

[మొదటి భాగము]

కలకత్తానగరం. వర్షాకాలం. ఒకనాటి ఉదయం వినయభూషణుడు తన మేడమీది వరండాలో నిలబడి వీధిలో వచ్చే పొయ్యే జనాన్ని చూస్తూండగా, అతని ఇంటి ముందే ఒక ధనికుల 'సార్టు'బండి ఒక కిరాయి బండిని ఢీకొని పడగొట్టి, వేగంగా వెళ్ళిపోయింది. వినయుడు వీధిలోకి పరిగెత్తే సమయానికి ఒక యువతి ఒక వృద్ధుణ్ణి పడిపోయిన బండిలోనుంచి కిందకి దింపుతూ కనిపించింది. వినయుడా

వృద్ధుడికి సహాయం వెళ్ళి, వారిద్దరినీ తన ఇంట్లోకి ఆహ్వానించాడు. వృద్ధుడికి స్పృహతప్పిపోయే లక్షణాలు కనిపించాయి. ఆయనను ఒక పక్కమీద పడుకో బెట్టి, వినయుడు తన పొరుగునున్న డాక్టరుకోసం తన నౌకరును పంపాడు.

వినయుడా యువతిని చూసి ముగ్ధుడయ్యాడు. అతను అప్పుడే కాలేజీ చదువు పూర్తిచేశాడు; ఇంకా ఉద్యోగంలోకూడా చేరలేదు. అతనికి పరస్త్రీలతో ఎలాంటి పరిచయమూ లేదు, పుస్తకజ్ఞానం తప్ప ప్రపంచజ్ఞానంకూడా అంతగా లేదు. స్త్రీల అందచందాలను గురించికూడా అతనికి పరిజ్ఞానంలేదు గాని, ఈ యువతి ముఖం అతనికి ఆకర్షవంతంగా కనబడింది.


డాక్టరు వచ్చి పరీక్షించి, వృద్ధుడికి ప్రమాద మేమీ కలగలేదనీ, వేడిపాలలో కొంచెం బ్రాందీ కలిపి తాగించమనీ చెప్పి వెళ్ళిపోయాడు. డాక్టరు కివ్వవలసిన డబ్బు ఇంటికి వెళ్ళాక పంపుతామని ఆ యువతి అనగానే వినయుడు దాన్నిగురించి బాధ పడవద్దన్నాడు. వృద్ధుడు కాసిని పాలుమాత్రం తాగి, తమ ఇల్లు దగ్గిరేననీ, తాను నడవగలననీ, బండి వద్దనీ అన్నాడు. కాని ఆమె అందుకు ఒప్పుకోకపోయేసరికి వినయుడు ఒద్దెబండి ఒకటి తెప్పించాడు.

వృద్ధుడు వినయభూషణచటర్జీ పరిచయం చేసుకుని, తనపేరు పరేశచంద్ర భట్టాచార్యుడనీ, తాను ఆ వీధిలోనే 78 నంబరు ఇంటిలో ఉంటున్నాననీ, ఎప్పు డైనా తమ ఇంటికి రమ్మనీ వినయుణ్ణి ఆహ్వానించాడు. తరవాత వారు వెళ్ళి పోయారు.

మరికొంతసేపటికి ఏడెనిమిదేళ్ళ వయసుగల కుర్రవా డొకడు ఇళ్ళ నంబర్లు చూసుకుంటూ వినయుడి ఇంటికి వచ్చి, "మా అక్క ఇవ్వమన్నది," అంటూ వినయుడి కొక కవరిచ్చాడు. దానిమీద వినయుడి పేరు ఆడదస్తూరీతో రాసిఉన్నది. అందులో ఉత్తర మేమీ లేదు: కొంత డబ్బున్నది.

కుర్రవాడితో అతని చక్కపోలిక యున్నాయి. అతను కొత్త ఏమి లేకుండా గది లోని ఒక ఫొటో చూపించి "ఇదెవరు?" అని అడిగాడు.

"నా మిత్రుడు, గౌరమోహనుడు. నేను గోరా అని పిలుస్తాను. మేం చిన్నతనం నుంచీ కలిసి చదువుకున్నాం." అన్నాడు వినయుడు. ఆ కుర్రాడు మరికాస్సేపు ఏవేవో ప్రశ్నలు వేశాడు. తనపేరు సతీశచంద్రముఖర్జీ అని చెప్పాడు. ఆ అక్క తమ్ముళ్ళు పరేశబాబు సొంతబిడ్డలు కారు, పెంపుడుబిడ్డలు అక్క అసలుపేరు రాధారాణి. పరేశబాబు భార్య ఆ పేరు మార్చి సుచరిత అనే పేరు పెట్టింది. ఈ విషయాలన్నీ చెప్పి సతీశుడు తన ఇంటికి బయలుదేరాడు. వినయుడతన్ని వాళ్ళ



ఇంటిదాకా దిగబెట్టాడు గాని, లోపలికి రమ్మంటే, "ఇప్పుడుకాదు, మరొకనాడు వస్తాను," అన్నాడు.

ఒకనెల గడిచింది. వినయుడు పరేశబాబుగా రింటికి వెళ్ళనేలేదు, కాని ఎవరో బ్రహ్మసమాజాన్ని నిందిస్తే, అతను తీవ్రంగా విమర్శించాడు – పరేశబాబు కుటుంబంవారు బ్రహ్మసమాజికులు.

ఈ సంఘటన గురించి ఒకనాడు సాయంకాలం గోరాకూ, వినయుడికీ గోరా ఇంట్లో చర్చ జరిగింది.

గోరా వినయుడికి ఆబాల్యమిత్రుడూ, సహాధ్యాయీనూ. ఇద్దరిలోకీ వినయుడే చదువులో చురుకైనవాడు. అందుచేత గోరా అతనిపైన బాగా ఆధారపడేవాడు. ప్రస్తుతం వారు నడిపే హిందూ దేశభక్తి సమాజానికి గోరా అధ్యక్షుడూ, వినయుడు కార్యదర్శీ. ఆ సమాజం తాలూకు మీటింగులు నెలనెలా ఈ యింట్లోనే జరుగుతూ ఉంటాయి.

ఇప్పుడు గోరా ఆరడుగులఎత్తు మనిషి. అతను పూర్తిగా తెల్లగా ఉంటాడు. అతని ఎముకలు చాలా పెద్దవి. పిడికిళ్ళు పులిపంజాల్లా ఉంటాయి. అతని కంఠ స్వరం కర్కశంగానూ, పెద్దగానూ ఉంటుంది. అతను అందగాడేమీ కాడుగాని, ఎంతమంది మధ్యనైనా కొట్టవచ్చినట్లు కనబడే విగ్రహం గలవాడు.

వినయుడు పరేశబాబు కుటుంబంగానే బ్రహ్మసమాజాన్ని వెనకవేసుకుని వస్తున్నాడనీ, అది అతనిలో పతనాన్ని సూచిస్తున్నదనీ గోరా ఆక్షేపించాడు. తనను వాళ్ళు రమ్మని పిలిచినప్పటికీ తాను ఇంతదాకా పరేశబాబుగారింటికి వెళ్ళలేదని వినయుడు జ్ఞాపకం చేశాడు. వెళ్ళలేదని అనుక్షణమూ జ్ఞాపకం చేసుకునేకన్న వెళ్ళటమే మేలన్నాడు గోరా.

"అయితే వెళ్ళమనేనా నీ సలహా?" అన్నాడు వినయుడు.

"వెళ్ళమని ఎంతమాత్రమూ చెప్పను. వారింట పంగిలిపడితేచాలు, నువ్వూ బ్రహ్మసమాజికుడివే అయిపోతావు. ఇక నీ పతనానికి అడ్డుండదు. నీ బలం ఎందుకూ పనికిరాదు. ఒకానొక సుకుమారహస్త నీకు వడ్డన చేసిందో, మైలపడిన భోజనంకూడా అమృతప్రాయమవుతుంది." అన్నాడు గోరా.

వినయుడికి కోపం వచ్చింది. స్త్రీలను గౌరవించటం గురించి ఇద్దరూ ఘర్షణపడ్డారు. పాశ్చాత్యులు స్త్రీలను గౌరవించేది కేవలమూ వ్యామోహంతోనేననీ, అది నిజమైన గౌరవం కాదనీ, పాశ్చాత్యులు దాన్ని ప్రేమ అంటారనీ గోరా అన్నాడు. "నువ్వొక్కడివే మనోబలం గలవాడివనీ, అందరూ దుర్బలులనీ నీ నమ్మకం. అదే నీ దౌర్బల్యం," అన్నాడు వినయుడు. అది నిజమేనని గోరా ఒప్పుకున్నాడు.

ఇంతలో గోరా అన్న మహిముడు, లావుగా, ఆయాసపడుతూ మెట్లెక్కివచ్చి, "అప్పుడే ఇంగ్లీషువాళ్ళను సగందూరం సాగనంపినట్టున్నావే: వాళ్ళకు పట్టిన నష్టమేమిటో నాకు తెలీదుగాని, మనదిన. కింద తల నొప్పితో బాధపడుతున్నది. నీ గర్జనలు భరించలేకుండా ఉన్నది." అని మళ్ళా కిందికి దిగిపోయాడు.

వారిద్దరూ కూడా దిగిపోయే సమయంలో గోరాతల్లి ఆనందమయి పైకి వచ్చింది. ఆమెకూ గోరాకు ఏమీ పోలికలేదు. ఆమె సన్నగా, నలభై ఏళ్ళుకూడా లేనిదానిలాగా

కనబడుతుంది. తన కాళ్ళకు ప్రణామం చేసిన వినయుణ్ణి పలకరించింది. ఆమె అతన్ని తన గదికి రమ్మనీ, మిఠాయి తినమనీ ఆహ్వానించింది. ఆనందమయి దాసి, లక్ష్మి. క్రైస్తవమతస్థురాలు కావటంచేత, వినయు డామె పెట్టే మిఠాయి తినరాదని గోరా అభ్యంతరం చెప్పాడు.

"నిన్నమొన్నటిదాకా ఆ లక్ష్మి పెడితేతప్ప నీకు ముద్ద దిగేదికాదే! నీ కది పాలిచ్చి పెంచటమేగాక, అమ్మవారు పోసినప్పుడు నిన్ను తన ప్రాణంకన్న ఎక్కువగా కాపాడిందే! ఎందు కిలా మాట్లాడుతావు?" అన్నది ఆనందమయి.

"అలా అయితే దాని కింత భూమి, ఇల్లూ ఏర్పాటుచేసి పంపెయ్యి. ఇంట్లో మాత్రం ఉండనియ్యరాదు." అన్నాడు గోరా.

"ఋణానుబంధాలు డబ్బుతో తెగిపోతాయా, నాయనా? నువు కనిపించకపోతే దాని ప్రాణం నిలవదు." అన్నది ఆనందమయి.

"అలాఅయితే ఇంట్లోనే ఉంచుకో. అంతటి పండితుడి కూతురువిగదా, ఆచార మంతా ఇలా మంటగలిపేశా వేమిటి?" అన్నాడు గోరా.

"నువు వచ్చేదాకా అన్ని ఆచారాలూ పాటించినదాన్నేరా, బాబూ. మీ నాన్న గారి అనాచారం కూడా సహించలేకపోయేదాన్ని. ఆయన బోలెడంత డబ్బు గడించి, పించను పుచ్చుకుని, ఆచారనిష్ఠలో పడ్డారు. నేనేమో ఏడుతరాల సదాచారానికి నీళ్లు వదులుకున్నాను. రమ్మన్నంతమాత్రాన అది తిరిగివస్తుందా, నాయనా? ఇవాళ నేను ప్రపంచంలో ఎవరిచేతి నీళ్ళయినా తాగుతాను." అన్నది ఆనందమయి.

"పిల్లల్ని పెంచినవారంతా సదాచారానికి స్వస్తి చెప్పారా? నీకు ప్రత్యేకంగా ఇలా ఎందుకు జరగవలసివచ్చింది?" అన్నాడు గోరా.

"నిన్ను నాకు ప్రసాదించినవాడే నాలో అలాటి భావంకూడా కలిగించాడు. నీ మూర్ఖత్వం చూస్తే నవ్వాలో, ఏడవాలో తెలియటంలేదు. పోనీ అదంతా." అన్నది ఆనందమయి

ఆమె కిందికి వెళ్ళిపోయాక, "మీ అమ్మ కేదో రహస్యం ఉన్నది. అది మనతో వెల్లడిచెయ్యలేక బాధపడుతున్నట్టున్నది." అన్నాడు వినయుడు.

"లేనిపోనిదంతా ఊహించుకుని కాలం వ్యర్థపుచ్చకు." అన్నాడు గోరా.

గోరా చేసే ప్రబోధాలను వినయు డెంతవరకు నిజంగా విశ్వసించాడో, ఎంత వరకు స్నేహభావంకొద్దీ ఆమోదించాడో చెప్పటం కష్టం. గోరా చెప్పే నియమాలకూ, వినయుని హృదయానికీ మధ్య సంఘర్షణ ఉన్నమాట నిజం. ఆనందమయి చేతి ఆహారాన్ని గోరా తిననివ్వనందు కతను చాలా బాధపడ్డాడు; కాని, సంఘం

ఉద్ధరించాలంటే తిండివిషయంలోనూ, కులాల విషయంలోనూ నియమంగా ఉండా లన్న గోరాసిద్ధాంతం వినయుడు ఆమోదించినదే. వినయుడికి తలిదండ్రులు చిన్న తనంలోనే పోయారు. అతను చిన్నాన్నతో ఉండి చదువుకున్నాడు. ఆనందమయిని మొదటిసారి చూసిన ప్పుడే "అమ్మా!" అని సంబోధించాడు. ఆమె చేతి తిండి తినటం పాపమని వేదాలన్నీ ఘోషించినా అతను సమ్మేస్థితిలో లేడు.

గదికి తిరిగివచ్చిన వినయుడు ఒంటరిగా కూర్చోలేక ఎక్కడైనా పోదా మను కున్నాడు. ఆరోజు బ్రహ్మసమాజంలో కేశవబాబు ఉపన్యాసం ఉన్నదని జ్ఞాపకం వచ్చి, అతను గొడుగు తీసుకుని అక్కడికి వెళ్ళేసరికి, ఉపన్యాసం అయిపోయింది: అందరూ వెళ్ళిపోతున్నారు. వెళ్ళేవారిలో అతనికి పరేశబాబు కుటుంబంవాళ్ళు కనిపించారు. చూస్తుండగానే వారు బండి ఎక్కి చీకటిలో అదృశ్యమైపోయారు.

మర్నాడు దీపాలు పెట్టాక వినయుడు గోరా దగ్గిరకి వెళ్ళి, "నిన్నొకటి అడ గాలి. భారతదేశంగురించి అహోరాత్రులు ఆలోచిస్తావుగదా? అది నీకు స్పష్టంగా గోచరిస్తుందా? దాన్ని ఎలా భావనచేస్తావు?" అన్నాడు.

"నావికుడు తన గమ్యస్థానాన్ని భావన చేసినట్టే నేను భారతదేశాన్ని భావన చేస్తాను. నా హృదయంలోని దిక్సూచి ఎప్పుడూ దానివేపే తిరిగిఉంటుంది. నేను మధ్యదారిలో మునిగిపోయి, గమ్యం చేరకపోవచ్చు, కాని గమ్యం అక్కడ ఉండనేఉంటుంది. అది సుసంపన్నం, జ్ఞానయుతం, పవిత్రం: అలాటి భారతం ఎక్కడా లేదనుకుంటున్నావా? నీ కలకత్తా, హైకోర్టూ, బుద్బుదప్రాయమైన ఈ రాతికట్టడాలూ వాస్తవమనుకుంటున్నావా?" అన్నాడు గోరా. అతను వర్తమాన జీవితాన్ని ఖండిస్తూ మాట్లాడి, "పుస్తకపాండిత్యమూ, బిరుదులూ, సేవకావృత్తీ, అన్నీ మరిచిపోయి, నావను రేవుకు నడిపించు," అన్నాడు.

అలాటి భారతదేశాన్ని తనకుకూడా చూపమని వినయు డడిగాడు.

"ప్రయత్నించి నువే తెలుసుకో. దానికి దృఢమైన విశ్వాసం కావాలి. అలాటి విశ్వాసం లేకనే మన దేశభక్తులు తాము ప్రభావితులు కావటంలేదు ఇతరులను ప్రభావితులను చెయ్యటంలేదు. విశ్వాసం లేదుగనక వారికి సార్థక్యంకూడా లేదు."

ఈ ధోరణిలో గోరా ఉపన్యసిస్తూండగా, హుక్కా చేతబట్టుకుని మహిముడు వచ్చి, "మా కొత్త ఆఫీసరు మహాదుర్మార్గుడు. తల్లి చచ్చినా సెలవివ్వడు. ఆయన మీద పత్రికల్లో అచ్చయిన ఆకాశరామన్న ఉత్తరం నేనే రాశాననీ, దాన్నిఖండిస్తూ నాపేర మరొక ఉత్తరం రాయాలనీ పట్టు బట్టాడు. మీ ఇద్దరూ కలిసి మంచి

ఉత్తరం రాసిపెట్టండి. మా దొరను ఇంద్రుడూ, చంద్రు డని పొగడుతూ మరీ రాయండి,'' అన్నాడు.

ఆ ఉత్తరం రాసేపని వినయుడిపైన పడింది.

## 2

ఆనందమయిభర్త కృష్ణదయాళుడు సల్లటీ సలుపు. ఆయన గడ్డం పెంచి, కషాయచీనాంబరాలూ, పావుకోళ్ళూ ధరించి, ఇత్తడి కమండలం పట్టుకు తిరిగేవాడు. ఒకప్పు డాయన సిపాయీలవెంట తిరిగి మద్యమాంసాలు కూడా అలవాటు చేసుకున్నవా డే. సన్యాసులనూ, మతాభిమానులనూ తిట్టిపోసినవాడే; కాని ఇప డాయన ప్రతి సన్యాసి పాదాలనూ పట్టుకుంటాడు – తరించటానికి సులువుమార్గం ఎవరైనా చెబుతారేమో; ఎవరినుంచిఅయినా తనకు సిద్ధులు లభిస్తాయేమో అని ఆయన ఆశ!

కృష్ణదయాళుడు ఇరవైమూడోఏట ఆయన ప్రథమకళత్రం, కొడుకును కని కన్ను మూసింది. తన భార్యప్రాణం తీసిన ఆ కొడుకును చూడలేక, ఆయన వాణ్ణి తన మామగారింటికి పంపేసి, విరక్తితో పడమర వెళ్ళిపోయాడు. ఆ సమయం లోనే సిపాయీల తిరుగుబాటు జరిగింది. పెద్దపదవులలో ఉండే తెల్లవాళ్ళప్రాణాలు కాపాడటానికి తనకు దొరికిన అవకాశాల నాయన జారవిడవలేదు. అందుచేత ఆయనకు గౌరవమూ, భూములూ లభించాయి. తిరుగుబాటు అణగిపోయిన వెంటనే ఆయన చంటిపిల్లవాడైన గోరాతో కాశీ చేరుకున్నాడు. ఆయన కలకత్తాకు వచ్చే నాటికి గోరా అయిదేళ్ళవాడు. పెద్దవాడు మహిముడుకూడా తన తండ్రివద్దకు తిరిగి వచ్చి, చదువుకుని, తండ్రిపలుకుబడితో ట్రెజరీలో ప్రభుత్వోద్యోగం సంపాదించు కుని, ఇంకా ఆ పనిలోనే ఉన్నాడు.

గోరా చిన్నతనంనుంచీ చుట్టుపక్కల కుర్రకారుకు నాయకుడు; క్లాసులో ఉపాధ్యాయులను ఏడిపించుకుతినటం ఆతనికి సరదాగా ఉండేది. కొంచెం పెరిగాక అతను విద్యార్థుల క్లబ్బులో జాతీయగీతాలు పాడి, తనచుట్టూ కొందరు తిరుగుబాటు దార్లను చేర్చుకున్నాడు. ఇంకొంచెం పెద్దవా డయ్యాక ఉపన్యాసాలు సాగించి, ఇంటివెలుపల కొంత ఖ్యాతి సంపాదించసాగాడు. సర్కారు నౌకరీ చేసే మహిముడు గోరా దేశాభిమానాన్ని అవహేళన చేసేవాడు. 'ఇంగ్లీషు' అన్న దేదీ గోరాకు ఎంతమాత్రమూ సరిపడదని తెలిసి ఆనందమయి ఆందోళన చెంది, అతన్ని శాంతపరచ యత్నించింది. ఈ దశలో గోరా కేశవచంద్రసేనుడి వక్తృత్వానికి

వకుడై బ్రహ్మసమాజంలో ప్రవేశించాడు. ఆదేసమయంలో కృష్ణదయాళుడికి సదాచారనిష్ఠ సంప్రాప్త మయింది. ఆయన గోరాను తన గదిలోకి రానిచ్చాడు కాడు: ఇంట్లో ఒక భాగానికి 'ఆశ్రమం' అని పేరుపెట్టి, దాన్ని ఆయన పూర్తిగా తనకింద ఉంచుకున్నాడు.

తండ్రిపై ఖరి గోరాకు ఏమాత్రమూ నచ్చక, ఆయనతో తెగతెంపులు చేసుకునే దాకా వెళ్ళాడు. కాని ఆనందమయి ఉద్దు డి, తండ్రికొడుకులమధ్య రాజీ చేసింది. గోరా తనతండ్రి చేరదీసే బ్రాహ్మణపండితులతో తీవ్రమైన వాదాలు పెట్టుకునే వాడు. వాళ్ళతనితో వాదించలేక, అతనంటే హడలిపొయ్యేవాళ్ళు. చివరకు విద్యా వాగీశు డనే పండితుడు అతిశాంతంగా గోరాతో మాట్లాడి, అతన్ని ఓడించాడు. అటుతరువాత గోరా హిందూ తత్వశాస్త్రాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసి పరమ హిందువు డైపోయాడు హిందూమత విశిష్టతను నిరూపించటానికి అతను ఇంగ్లీషులో ఒకపుస్తకం రాయటం ఆరంభించాడు. "మనదేశాన్ని ఇతరుల ప్రమాణాలతో అంచనా కట్టరాదు. మాతృదేశంగురించి మనం అవమానం చెందరాదు. మన దేశ మర్యాదను కాపాడేభారం మనమే వహించాలి." అని అతను బోధించే వాడు.

ఇలాంటి భావాల ప్రేరణతో అతను రోజూ గంగాస్నానాలను చేశాడు, సంధ్య వార్చాడు, మడీ ఆచారమూ అవలంబించాడు, పిలకకూడా పెంచాడు. ఇదంతా చూసి సంతోషించవలసిన కృష్ణదయాళుడు చాలా అసంతృప్తి చెందాడు. "చూడు నాయనా, హిందూమతం చాలా లోతైనది. ఋషులబోధలు అందరికీ అర్థంకావు. నీ మన సింకా పరిపక్వం కాలేదు. అందుచేత దీని జోలి పెట్టుకోకు. నీకు బ్రహ్మసమాజమే సరిఅయినది," అన్నా డాయన గోరాతో.

గోరా నిర్ఘాంతపోయి, "అదేమిటి నాన్నా ? నేను హిందువుణ్ని కానా ? కిందటి జన్మలో చేసుకున్న సుకృతాలకొద్దీ బ్రాహ్మణజన్మ ఎత్తాను. ఇప్పుడు దారి తప్పానంటే ఉన్నదికూడా పోగొట్టుకోనా ?" అన్నాడు.

కృష్ణదయాళుడు తల అడ్డంగా తిప్పి, "హిందువునని చెప్పుకున్నంతమాత్రాన హిందువు డవుతాడా ? ముసల్మాను కావచ్చు. మరింత సులువుగా క్రైస్తవుడు కావచ్చు; కాని హిందువుడే ! బాబో, అది సాధ్యంకాదు,'' అన్నాడు.

"సరయిన మార్గాన నడిస్తే ఎప్పటికైనా గమ్యం చేరుతానుగద,'' అన్నాడు గోరా.

వాదించి లాభంలేదని కృష్ణదయాళు డా విషయాన్ని అంతటితో పోనిచ్చాడు.

కాని ఆనందమయికి గోరా పెద్దసమస్య అయి కూర్చున్నాడు. ఆమె తన భర్తతో గోరాగురించి ఒకసారి వివరంగా మాట్లాడింది.



సిపాయీల తిరుగుబాటు సమయంలో కృష్ణదయాళుడి మకాంచుట్టూ దారుణమైన హత్యాకాండ జరుగుతున్న సమయంలో ఒక నిండుచూలాలైన దొరసాని వారింట ఆశ్రయం కోరివచ్చింది. కృష్ణదయాళుడు లేదనేశాడు. ఆ స్త్రీ భర్త హత్యఅయిపోయాడు. ఆనందమయి ఆమెను చూసి జాలిపడి, తమ పశువులకొట్టంలో ఆమెను దాచి వుంచేసింది. ఆ కొట్టంలోనే ఆ దొరసాని గోరాను ప్రసవించి మరణించింది. ఆనందమయి ఆ కుర్రవాణ్ని దేవుడిచ్చిన ప్రసాదంగా భావించి పెంచింది. ఆమె మాతృత్వంకోసం ఎన్నో మంత్రాలు జపించింది ఎన్నో తాయత్తులు కట్టుకున్నది. కాని ఆమె మాతృత్వం తీరటానికి గోరా దొరికాడు. గోరాను చేరదీశాక ఆనందమయి ధర్మంపట్ల అభిమానంకొద్దీ దాన్ని త్యాగం చేసింది. కృష్ణదయాళుడు ఆ రోజులలో మతమంటే లక్ష్యంలేక గోరాకు ఉపనయనం తలపెట్టితే ఆనందమయి వారించజూసింది.

"మన కొడుకని చెప్పుకుంటూ ఉపనయనం చెయ్యకపోతే నలుగురూ ఏమంటారు? కాకపోయినా జంధ్యప్పోచతో వచ్చే దేమిటి?" అని కృష్ణదయాళుడు నిర్లక్ష్యంగా అన్నాడు.

ఇప్పుడు గోరా ధోరణి ఆనందమయికి ఆందోళన కలిగించింది.

"ఇప్పుడైతే వాడికి ఉపనయనం చేసిఉండను. ఇకముందైనా వాడు బ్రాహ్మణ కన్యను శాస్త్రోక్తంగా పెళ్ళాడటానికి నేను ఒప్పను," అన్నాడు కృష్ణ యాళుడు.

"దాన్నిగురించి నేను బెంగపడటం లేదు. ఏమయితే అయింది. గోరాకు నిజం చెప్పేద్దామా అని చూస్తున్నాను!" అన్నది ఆనందమయి

"వద్దు, వద్దు; నాబొందిలో ఊపిరిఉండగా ఆపని చెయ్యకు. గోరా ఏంచేస్తాడో చెప్పలేం. సంఘం మనని కాకుల్లా పొడుస్తుంది. తల్లీ తండ్రీలేని పిల్లవాణ్ని

గురించి మనం మే|స్టీటుకు అప్పుడే చెప్పనందుకు నన్ను ముప్పతిప్పలు పెడతారు. గోరా పెళ్ళిగురించి నా కొక ఆలోచన ఉన్నది. స్కూళ్ళఇనస్పెక్టరు చేసి పింఛను పుచ్చుకుంటున్న నా మిత్రుడు పరేశభట్టాచార్య బ్రహ్మసమాజికుడు. కలకత్తాలోనే ఉంటున్నాడు. అతనికి ఇంట పెళ్ళికావలసిన ఆడపిల్లలున్నారని విన్నాను. గోరాను వారింటికి పంపి పరిచయం చేస్తే, ఎవరినో ఒకర్ని ప్రేమించి పెళ్ళాడతాడేమో!" అన్నాడు కృష్ణదయాళుడు

"గోరా బ్రహ్మసమాజికుల ఇంట అడుగుపెట్టేరోజు ఏనాడో పోయింది," అన్నది ఆనందమయి.

కాని, కృష్ణదయాళుడు తనను పరేశభట్టాచార్యుడి ఇంటికి వెళ్ళి అతను ఎలా ఉన్నదీ విచారించి రమ్మనగానే గోరా సరేనన్నాడు. కాని మర్నాడే వెళ్ళటం పడలేదు. ఆరోజు సూర్యగ్రహణం: స్నానానికి త్రివేణి కెళ్ళాలని గోరా నిశ్చయించాడు.

ఈ లోపల వినయుడికి చాలా అనుభవాలు జరిగాయి.

ఒకనాటి ఉదయం అతను మిద్దెమీది వరండాలో నిలబడిఉండగా, పరేశబాబు వీధివెంట సతీశుడితోసహా వస్తూ, వినయుణ్ని చూసి, లోపలికి వచ్చి, ఇన్నాళ్లూ అతను తమ ఇంటికి రానేలేదేమని అడిగాడు. అతనికి తమఇల్లు తెలుసునని సతీశుడు బయటపెట్టి, వినయుడికి అవమానం కలగజేశాడు.

కాస్సేపు కూర్చుని వారు వెళ్ళిపోయాక వినయుడు తిన్నగా గోరాఇంటికి వెళ్లాడు. గోరా ఇంట్లోలేడు. ఆనందమయికి లక్ష్మి వడ్డనచేస్తున్నది వినయుడు ఆనందమయి భోజనమే తానుకూడా లక్ష్మిచేత వడ్డించుకుని తిని, బంధవిముక్తుడైనట్టు భావించుకున్నాడు.

ఈ స్వేచ్ఛవల్ల కలిగిన ఆనందంతో అతను పరేశబాబు ఇంటికి వెళ్ళాడు. అయితే సుచరితగాని, సతీశుడుగాని ఇంట్లో లేరు. ప్రతి సోమవారమూ సుచరిత పరేశబాబు మిత్రుడి కుమార్తెకు పాఠం చెప్పబోతుంది. ఆ పిల్లకు తమ్ముడొకడు తనయీడువాడే ఉండటంచేత సతీశుడుకూడా అక్కవెంట వెళ్ళాడు. వినయుడు పళ్ళబిగువున ఒక గంటసేపు కూర్చుని, పరేశబాబువద్ద శలవు తీసుకుని బయటికి వచ్చేసరికి, బండిలో సతీశుడూ, సుచరితా తిరిగిరానేవచ్చారు వినయుణ్ని సతీశుడు మళ్ళా లోపలికి లాక్కుపోయాడు.

పోర్టికోమీది డాబామీద ఒక బల్ల పరిచి, దానిచుట్టూ కుర్చీలు వేశారు. అక్కడ వినయుడు పరేశబాబు కుటుంబాన్ని పరిచయం చేసుకున్నాడు. పరేశుడిభార్య

వారదకు నడివయసులో 'ఫాషన్'లు అబ్బినయి. బ్రహ్మసమాజ సంస్కృతిని ఆమె హెచ్చుగా పాటిస్తుంది. రాధారాణిపేరు సుచరితగా మార్చింది ఆమే. ఆమె పెద్దకుమార్తె లావణ్య చాలాలావు. ఆమెకు తల్లి బిగువైనదుస్తులు వేసేది. రెండోది లలిత — అన్నివిధాలా తన అక్కకు విరుద్ధం. ఆమె ఇతరుల నియమాలను పాటించదు. హెచ్చుగా మాట్లాడదు. తల్లికి లలిత అంటే కొంచెం భయం. లీల పదేళ్ళది. లీలకూ, సతీశుడికీ ఒక్కక్షణం పడదు. ముఖ్యంగా పెంపుడుకుక్క విషయంలో ఇద్దరూ కొట్లాడతారు.

వారద ఈ ముగ్గురు కుమార్తెలతోబాటు మరొక యువకుణ్ణికూడా వెంటబెట్టుకుని డాబామీదికి వచ్చింది. అతనిపేరు సుధీరుడు. బియ్యే చదువుతున్నాడు. అతను ఆడపిల్లలతో అతిచనువుగా ఉంటూ, వాళ్ళను నవ్వించటం చూసి వినయుడు మొదట నిర్ఘాంతపోయాడు; తరవాత అసూయ పడ్డాడు.

వినయుడి పరిచయం అయాక వారద, అతను చేసిన ఉపకారానికి కృతజ్ఞత వెలిబుచ్చి, అతన్ని బ్రహ్మసమాజంలో ఒకటి రెండుసార్లు చూసినట్టు గుర్తించింది. తన కుమార్తెల తెలివతేటలు గురించీ, వారందుకున్న ప్రశంసలూ, బహుమానాలు వగైరాలు గురించీ అతనికి చెప్పింది.

ఇంతలో గోరా వచ్చినట్టు వార్త తెలిసింది.

"ఎవరా వచ్చినవారు?" అని వారద అడిగితే, పరేశబాబు, "కృష్ణదయాళుడనే నా మిత్రుడి కొడుకు," అని చెప్పి, అతన్ని పైకి రానివ్వమని నౌకరుతో అన్నాడు. పళ్ళాలలో ఫలహారాలు అమర్చి సుచరితకూడా పైకి వచ్చింది.

వినయుడిగుండె చప్పుడు ఆగినట్టయింది. ఇక్కడి వాతావరణం చూసి గోరా ఎలా ప్రవర్తిస్తాడో అని అతను భయపడ్డాడు.

నుదుట గంగామృత్తిక పూసుకుని, ముతకధోవతీ, పొట్టిచొక్కా, నాటు చెప్పులూ ధరించి, మూర్తీభవించిన సనాతనత్వంలాగా గోరా పైకి వచ్చాడు. అతని శరీరచ్ఛాయ అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. వినయుడికి గోరా యుద్ధసన్నద్ధుడై వచ్చినవాడిలాగా కనిపించాడు.

దానికి కారణం లేకపోలేదు. గోరా త్రివేణినుంచి స్టీమరులో కలకత్తాకు వచ్చేటప్పుడు, రద్దీవల్లా, బురదవల్లా తొక్కిసలాడే ప్రయాణీకుల కడగళ్ళు చూసి పై అంతస్తులోనుంచి చూసే ఒకతెల్లవాడూ, షోకీ బెంగాలీవాడూ విరగబడి నవ్వారు. ప్రయాణీకులకు చాతనైనమటుకు సహాయపడుతున్న గోరా అది చూచి మండిపడి, స్టీమరు పైభాగానికి వెళ్ళి, "చాలించండి! మీకు సిగ్గయినాలేదా!" అన్నాడు.

తెల్లవాడు జవాబు చెప్పలేదు గాని. బెంగాలీబాబు, "ఈ పశువుల మూర్ఖత్వం చూస్తూంటే సిగ్గుగానే ఉంది," అన్నాడు.

"అమాయకప్రజలకన్న హీనమైన జంతువులుకూడాఉన్నాయి," అన్నాడు గోరా.

తెల్లవాడు చంద్రనగరువద్ద దిగిపోతూ, గోరాను సమీపించి, తన ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకుని వెళ్ళిపోయాడు. కాని గోరాను బాధించినది బెంగాలీబాబు ప్రవర్తన. విద్యావంతులైన బెంగాలీలు తమ సాటివారి దుస్థితి చూసి, విదేశీయుడితో కలిసి వినోదం ఎలా చూస్తారో అతని కర్థంకాలేదు. ప్రజలు జ్ఞానశూన్యులు కాబట్టేగదా పశువుల్లే చూడబడటానికి అలావాళ్ళైపోయారు. ఈ అవమాన పరిస్థితికి బాధ్యత తమదే నని చదువుకున్నవా ళ్ళెందుకు భావించరు?

గోరా పైకి వస్తూ ఒకేఒక్కసారి వినయుడికేసి చూసి మరిచూడలేదు. ఎవరూ కూర్చోమనకుండానే, బల్లదగ్గిర ఉన్న కుర్చీ లో ఒకటి ఎడంగా లాగి, దానిమీద కూర్చున్నాడు. పరేశబాబు తన బాల్యమిత్రుణ్ణి గురించి కుశలప్రశ్నలు చేసి, కృష్ణదయాళు డిప్పుడు చాలా పూర్వాచారపరాయణు డైనట్టు గోరాద్వారా తెల్సుకున్నాడు.

"అలా కావటాని కాయనకు లజ్జలేదా?" అన్నది వారద.

"లజ్జ దౌర్బల్య చిహ్నం. కొందరు తమ తలిదండ్రులను చూసి కూడా లజ్జిస్తారు," అన్నాడు గోరా.

"ఒకప్పు డాయన బ్రహ్మసమాజికుడు కాడూ?"

"ఒకప్పుడు నేనూ బ్రహ్మసమాజికుణ్ణే."

"భగవంతుడు సాకారుడని మీ రిప్పుడు నమ్ముతారా?"

"అకారణంగా సాకారాన్ని తృణీకరించే మూఢవిశ్వాసం నాలోలేదు. నిరాకారం వ్యక్తం కావాలంటే సాకారం కాకతప్పదు. భావం మాటలలో వ్యక్తమైనట్టే, నిరాకారమే పరిపూర్ణమైన పక్షంలో సాకార జగత్సృష్టి ఎందుకు జరిగినట్టు?"

గోరా వాగ్ధోరణి సుచరితకు చాలా చిరాకు తెప్పించింది. అతని నోటిని ఎవరైనా కట్టేస్తే బాగుండునని ఆమె అనుకున్నది. ఆమె టీ కలిపి అందరికీ ఇవ్వసాగింది.

"మీ రివన్నీ పుచ్చుకోరు కాబోలు," అన్నది వారద గోరాతో.

"పుచ్చుకోను," అన్నాడు గోరా.

మళ్ళీ ఇద్దరి మధ్యా వాగ్యుద్ధం జరిగింది. కులం పోతుందా? కులంలో గోరాకు నమ్మకం ఉన్నదా?

"కులాన్ని నేను ఏర్పాటు చెయ్యలేదు; సంఘానికి కట్టుబడ్డవాణ్ణి కులాల నెందుకు పాటించకూడదు?" అన్నాడు గోరా.

అతనికి సంఘంలో నమ్మకం ఉన్నదా? ఔను, సంఘాన్ని నమ్మకపోవటం సంఘాన్ని నాశనం చెయ్యటమే! సంఘం నాశనమైపోతేనేం? నిలబడ్డ కొమ్మను నరకటంలోకూడా నష్టం లేదన్నమాట!

"ఆయన తిననన్నాక ఈ వాదనలన్నీ దేనికమ్మా?" అన్నది సుచరిత. ఆమె వినయుణ్ణి "మీరు టీ తాగుతారా?" అని అడిగింది. అతను తప్పక తాగుతానని, అలవాటు లేకపోయినా తాగాడు.

ఇంతలో పానుబాబు వచ్చాడు. అతను సుచరితను చేసుకుంటాడని ఇంట్లో అందరూ అనుకోవటం. అతను బికిసంతుడు; అందుచేత వారదకు అతనంటే గొప్ప అభిప్రాయ మేమీలేదు తనకు అలాటి అల్లుడు రావటాని కామె చచ్చినా ఒప్పుకోదు.

పానుబాబుకూ, గోరాకూ రంధిపడుతుందని అందరూ అనుకుంటూనే ఉన్నారు. పానుబాబు గోరాను బ్రహ్మసమాజంలో ఎరుగును. అతను బెంగాలీల చేతగాని తనముగురించి ఏవో అనేసరికి గోరా అగ్గిఅయిపోయాడు. ఇద్దరూ కొంత సేపు వాదించుకున్నాక పానుబాబు మాటలు మిగల నారభించాడు. అదిచూసి సుచరిత తన మనసులో గోరాను సమర్థించసాగింది. పానుబాబు ఆమెకు చాలా జుగుప్స కలిగించాడు.

చివరకు గోరా వెళ్ళిపోయేటప్పుడు పరేశబాబు అతనితో, "కృష్ణదయాళుడు నాతోబుట్టువులాటివాడు – ఇవాళ మా దారులు వేరయాయి గాని, చిన్ననాటి స్నేహాలు రక్తంలోనుంచిపోవు. మీ తండ్రి కారణంగా నువుకూడా నాకు ఆప్తుడివి." అన్నాడు.

గోరా కిందికి దిగిపోగానే, వినయుడుకూడా దిగిపోయాడు. తరవాత పానుబాబు పరేశబాబుతో, "అయ్యా, ఆడపిల్లలను అడ్డమైనవాళ్ళకూ పరిచయం చెయ్యటం అంత భావ్యంకాదు," అన్నాడు.

"నాన్నగారలా చేసిఉంటే మాకు మీ పరిచయం అయేదేకాదు," అన్నది సుచరిత.

"నేను సమాజానికి చెందినవాళ్ళ మాట చెప్పటంలేదు," అన్నాడు పానుబాబు.

పరేశబాబు నవ్వుతూ, "అంటే ఘోషాపద్ధతి సమాజికులకు పరిమితంగా

అమలు చెయ్యాలన్నమాట. ఆడపిల్లలు అన్నిరకాల అభిప్రాయాలూ తెలుసుకోక పోతే సంకుచితబుద్ధు లవుతారు." అన్నాడు.

"కాని వాళ్ళకు మర్యాదకూడా తెలీదే."

"అది మర్యాద తెలియకపోవటంకాదు, బిడియం. స్త్రీలతో మసలటం అలవా టయేదాకా బిడియంపోదు." అన్నాడు పరేశబాబు

ఆరాత్రి సుచరిత పదకొండు గంటలదాకా నిద్రపోకుండా ఆలోచిస్తూ కూర్చు న్నది. ఆమె గోరా వాలకాన్ని సహించలేకపోయినమాట నిజమే, కాని అత సలా ఛాందసపు వేషం ధరించటం కేవలమూ తిరుగుబాటుతనమేనని ఆమె అర్థం చేసు కున్నది. అతను తన సజాతీయులను వెనక వేసుకునివచ్చి పానుబాబులో పోట్లా డటం ఆమెకు ఎంతైనా నచ్చింది. కాని గోరా తనను పూర్తిగా ఉపలక్షించటం ఆమె హృదయంలో శల్యంలాగా బాధించింది. గోరా స్త్రీలంటే బిడియపడి తనను తృణీకరించలేదు. అలాటి బిడియంగలవాడు వినయుడు. గోరాకు అలాటి దేమీలేదు అతని తృణీకారభావం తనను ఎందుకు బాధించాలో సుచరిత అర్థం చేసుకోనేలేకపోయింది గోరాఅన్నమాటలు కొన్ని ఆమెచెవిలో ఇంకాప్రతిధ్వనిస్తు న్నాయి — "మీరు సరిష్కరు లనేవాళ్ళమనిషినే నేను. మీరు మూఢవిశ్వాస మనేదే నాకు సుళం. మాతృదేశాన్ని ప్రేమించి, దేశప్రజలలో ఒకడుగా నిలబడలేనివారికి దేశాన్ని విమర్శించే హక్కులేదు...సంస్కారాలా? వాటి కేం తొందరా? అత్యవ సరంగా కావలసింది ప్రేమాభిమానాలు. ప్రజలలో ఐక్యత ఏర్పడిననాడు సంస్కారం దానంతట అదే జరుగుతుంది. దేశంనిండా మూఢాచారాలు వ్యాపించి ఉన్నాయని మీరంతా ఎడంగా వెళ్ళి ఎత్తుగా కూర్చుంటారా? మీ దురభిమానాన్నీ, ఉదాసీనతనూ విడిచిపుచ్చి నమ్రతతో అందరితోపాటు కండి; లోపాలన్నీ తొలగిపోతాయి. ఏ సమాజంలో లోపాలు లేవు? మనిషిలో ప్రాణం ఉన్నంతకాలమూ క్రిములు దాని జోలికి పోవు. ప్రాణం పోగానే కళేబరాన్ని ఆవ స్తాయి. మీ రయేది, విదేశీ మిషనరీ లయేది, బయటినుంచి సంస్కరిస్తామంటే మేం ఒప్పుకునేది లేదు. మన తప్పులు తల్లిదండ్రులు సరిచేస్తే అభ్యంతరం ఉండదు. కాని ఆ పనే చెయ్యటానికి పోలీసులు వస్తే అందువల్ల అభివృద్ధికంటె, అపమానమే హెచ్చుగా కలుగుతుంది."

ఇలాటిమాటలు తలలో గింగురుమంటూ సుచరిత ఎంతసేపటికీ నిద్రపోలేక పోయింది.

## 3

వినయుణ్ణి పరేశబాబు ఇంటచూశాక గోరా అతన్ని వెలివేసేసినట్టు ప్రవర్తిం



యువ

చాడు. పరేశబాబు ఇంటినుంచి వచ్చేటప్పుడు వినయుణ్ణి అతను తనవెంటకూడా రానివ్వక, తాను వేరేపనిమీద పోతున్నట్టు చెప్పి వెళ్ళిపోయాడు. ఇలాటిది అదివర కెన్నడూ జరగలేదు. గోరా తనతో పోట్లాడినా వినయు డంతగా బాధపడి ఉండకపోను.

మర్నాడు ఉదయమే వినయుడు గోరా ఇంటికి వెళ్ళాడు. ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. ఎవరన్నా ఏదన్నా యిచ్చినప్పుడు నిరాకరించటం వారిని అవమానించటమని వినయుడివాదం. మర్యాదలను పాటించటం సంఘాన్ని ఉద్ధరించటంకన్న ఎక్కువకాదని గోరావాదం. ఇంత టీ తాగినంతమాత్రానికే సంఘానికి ద్రోహం జరుగుతుందా అని వినయు డడిగాడు. టీ ముఖ్యంకాదనీ, సంఘాన్ని త్యజించటమే అసలు ద్రోహమనీ గోరా అన్నాడు. "నన్నెందుకు పట్టుకు వేళ్ళాడతావు ? హిందూ సమాజంలో నీకు రుచించనివాటన్నిటితోబాటు నన్నుకూడా విడిచెయ్యి." అని అతను వినయుడికి సలహా ఇచ్చాడు.

గోరామాటలను చిలకలాగా వప్పజెప్పే అవినాశుడు రాగానే వినయుడు ఆనందమయి దగ్గిరికి వెళ్ళాడు. ''భోజనం చేసివచ్చావా, నాయనా ? అని ఆనందమయి అడిగితే, నిజం చెప్పి ఆమెచేతిఅన్నం తినటానికి బదులుగా, "తినేవచ్చాను." అని అబద్ధమాడాడు. అతనికి ఎలాగైనా గోరాకు దాసోహం అయిపోవాలని ఉన్నది, కాని మళ్ళీ ఆరోజే గోరాదగ్గిరకి వెళ్ళటాని కతనికి కాళ్ళాడలేదు.

కొన్నిరోజులు గడిచాక ఒకనాటి అపరాహ్ణం వినయుడిగదికి మహిముడు వచ్చాడు. అతను కాస్సేపు అదీ ఇదీ మాట్లాడి. "ఉండు వినయా, నీవల్ల నాకో ఉపకారం కావాలి," అన్నాడు.

"నేను చెయ్యగలదైతే చేస్తాను, ఏమిట ?" అని వినయు డడిగాడు.

"మా అమ్మాయి శశి తెలుసుగా ? అది అందవికారి ఏమీకాదు. అది ఎదిగి వస్తున్నది. దానిపెళ్ళి ప్రయత్నాలు చూడాలి. అది ఏ పనికిమాలినవాడి చేతిలో పడుతుందో నని రాత్రిళ్ళు నిద్దరపోలేకుండా ఉన్నానంటే నమ్ము." అన్నాడు మహిముడు.

''దానిపెళ్ళికి అప్పుడే ఏంతొందర ?''

"నీకే కూతురుంటే తెలిసేది. అనుకోగానే వరుడు దొరకద్దా ? ఈలోపల పిల్ల ఎదిగిపోతూనే వుంటుందాయె. నువుగనక కాస్త భరోసా ఇస్తివా, నా కేమీ తొందర ఉండదు."

"అనువైనవాళ్ళు నాకూ అంతగా తెలీదు. కలకత్తాలో మీ కుటుంబంతప్ప నే

నెవర్నీ ఎరగననే చెప్పాలి. అయినా చూస్తాను." అన్నాడు వినయుడు, ఏం చెప్ప టానికీ తెలీక.

"నీకు శశి బాగా తెలుసుకదా – అది ఎలాటిపిల్లో, ఏమిటోనూ?"

"తెలియక పోవట మేమిటి? దాన్ని ఇంతప్పట్నించీ ఎరుగుదునుగా – లక్షణమైనపిల్ల!"

"అలాటప్పుడు వేరే చూడటం దేనికి, నాయనా? నువే దాన్ని చేసుకో." అన్నాడు మహిముడు, విశాలంగా నవ్వుతూ.

"ఏమిటీ?" అన్నాడు వినయుడు, కంగారుపడి, గట్టిగా, "శశి మరీ పసిపిల్ల." అని అతను తప్పుకో జూశాడు. కాని మహిముడిపట్టు మహాగట్టిపట్టు చిట్టచివరకు విన యుడు ఆలోచించుకునేటందుకు కొంచెం వ్యవధి కావాలన్నాడు తన బంధువులతో కూడా సంప్రతించా లన్నాడు. అందుకు సమ్మతించి మహిముడు వెళ్ళిపోయాడు.

ఆనందమయి లోగడ ఒకసారి, వినయుడు శశిని చేసుకుంటే బాగుడు నని సూచనగా అన్నప్పుడు పట్టించుకోలేదు. కాని ఇప్పుడా విషయం ఆలోచిస్తే అందులో కొంత మేలు ఉన్నట్టే కనబడింది. ఈ వివాహంద్వారా అతను గోరా ఆప్తవర్గంలో చేరిపోవచ్చు. ప్రేమించి పెళ్ళాడాలనే పాశ్చాత్య సిద్ధాంతంలో విన యుడికి నమ్మకం ఎలాగూలేదు గనక అతను శశిని పెళ్ళాడటానికది ఒక అభ్యం తరం కాబోదు. ఈ విషయమై సలహా అడిగే వంకమీద గోరావద్దకు పోదామని వినయుడు ఇంటినుంచి బయలుదేరాడు.

అంతను కొద్దిదూరం వెళ్ళాడోలేదో, వెనకనుంచి సతీశుడి కేక వినిపించింది. విన యుడు ఆగాడు. సతీశుడు అతన్ని సమీపించి, "వినయబాబూ, అమ్మ మిమ్మల్నొక సారి రమ్మన్నది. ఇవాళ లీల పుట్టినరోజు," అన్నాడు

వినయుడు తనకు తొందరపని ఉన్నదని తప్పించుకో జూశాడు గాని, సతీ శుడు వదిలేపటం కాదు. వినయుడు వెళ్ళేసరికి పరేశుడి ఇల్లు చాలా సందడిగా ఉన్నది. ఒంటరిగా గదిలో కూర్చున్న అతనిదగ్గిరికి సుచరిత వచ్చి, "అమ్మ మిమ్మల్ని కాసేపు ఆగమన్నది. నాన్న అనాథబాబుగారిని చూడబోయారు, త్వరగానే రావచ్చు." అన్నది.

ఆ తరవాత ఆమె గోరా మాట ఎత్తి, "ఆయన ఇక ఎన్నటికీ మా గడప తొక్క రనుకుంటాను. ఇంటిపనులకు మాత్రమే అంకితం కాని ఆడవాళ్ళను ఆయన గౌర వించరని నా అనుమానం." అన్నది.

అది నిజమే కావటంచేత వినయుడు, "ఈ విషయాలలో మనం సంప్రదాయా

లకు దాసులమని నా నమ్మకం. స్త్రీలు బయటికి రావటం అలవాటులేక, అలా వచ్చిన స్త్రీలను చూసి విడ్డూరం చెందుతాం. ఆ భావాన్ని సమర్థించుకునేటందుకుగాను స్త్రీలు బయటికి రావటం తప్పని సిద్ధాంతం చేసేస్తాం. తప్పు సంప్రదాయానిది; వాడసలన్నీ పై పూతలు," అన్నాడు.

సుచరిత గోరాను గురించే అతనిచేత మాట్లాడించింది. వినయుడుకూడా గోరాను చాలా అద్భుతంగా సమర్థించాడు. "అతను అందరిలాటివాడు కాడు. అతనిది నిజమైన ఏకాగ్రత. మన బుద్ధి ప్రతి ఆకర్షణకూ చలిస్తుంది. అన్నిదిక్కులకూ పోతుంది. గోరాది నిశ్చలమైన బుద్ధి," అన్నాడు.

గడియారం నాలుగు కొట్టేసరికి వినయుడు గోరావద్దకు పోదామని లేచాడు.

"అప్పుడే వెళ్ళిపోవాలా? అమ్మ మీ కోసం టీ చేస్తోంది," అన్నది సుచరిత. వినయుడు టీ తాగటం అయిపోయాక పరేశబాబు తిరిగివచ్చి, ఆనాడు ఆదివారం గనక అందరూ కలిసి బ్రహ్మసమాజానికి వెళితే బాగుటుం దన్నాడు. వారద వినయుడికేసి తిరిగి, "మీ కేమీ అభ్యంతరం లేదుగా?" అన్నది. అభ్యంతరం చెప్పటం చేతగాక వినయుడు లేదన్నాడు. బ్రహ్మసమాజంలో ప్రార్థనలు ముగిసి, ఇంటికి పోవటానికి సిద్ధపడుతూండగా సుచరిత, "అడుగో గౌరమోహనబాబు!" అన్నది.

గోరా తనను చూసే ఉంటాడని వినయుడు ఊహించాడు. అందుకే గోరా ఎవరినీ చూడనట్టుగా గబగబా వెళ్ళిపోయాడు. ఆ క్షణంలో సుచరితకు మళ్ళీ గోరా మీద కోపం వచ్చి, అతనికి శృంగభంగమైతే బాగుండు ననిపించింది.

ఆరోజు ఉదయం వినయుడు గోరాను చూడవచ్చి, అతను కోపంగా ఉండటం చూసి వెళ్ళిపోయాడు. వినయుడు మళ్ళీ వచ్చి తనతో సంధి చేసుకుంటాడని ఆ సాయంకాలం గోరా ఎదురుచూశాడు; కాని వినయుడు రాలేదు. అతనికి మారుగా మహిముడు వచ్చి, శశికి వరుణ్ణి చూడటంలోగల కష్టసుఖాలు మాట్లాడి, వినయుడికి శశిని ఇచ్చి పెళ్ళి చేస్తే ఏ ఇబ్బందీ ఉండదని తేల్చాడు.

దేశసేవకోసం తమ జీవితాలను అంకితం చెయ్యాలనీ, అందుకోసం ఆజన్మ బ్రహ్మచారులుగా ఉండిపోవాలనీ గోరా వినయులు ఏనాడో నిర్ణయించుకున్నారు. అందుచేత, పెళ్ళిసందర్భంలో వినయుడిపేరు రావటం చూసి ఆశ్చర్యపడి గోరా, "వినయు డసలు పెళ్ళికి ఒప్పుకుంటాడా అని!" అన్నాడు.

"ఏమన్న హిందువుడివి! బ్రాహ్మణవంశంలో పుట్టి వివాహం చేసుకోవటం విధికాదూ?" అన్నాడు మహిముడు.

"సరే, వినయు డేమంటాడో కనుక్కుంటాను,'' అన్నాడు గోరా; వినయుడి దగ్గిరికి వెళ్ళటానికి అవకాశం దొరికినందుకు సంతోషిస్తూ.

కనుక్కునే దేమిటి? నువ్వేమనుకుంటే అది అంటాడు. నువు చేసుకోమని ఒక్క మాట వేస్తేచాలు, పని జరిగిపోతుంది,'' అన్నాడు మహిముడు.

గోరా వినయుడి గదికి వెళ్ళి, అతను 78 నంబరు యింటికి వెళ్ళినట్టు నౌకరు ద్వారా తెలుసుకుని. పరేశబాబు కుటుంబాన్ని తిట్టుకుంటూ వారింటికి వెళ్ళి, అందరూ కలిసి బ్రహ్మసమాజానికి వెళ్ళినట్టు విని, బ్రహ్మసమాజంవేపుగా వచ్చి, వారదవెంట వినయుడు బండిలో ఎక్కుతూఉండటం చూసి, 'ఎటువంటి అవివేకం! ఎంత త్వరగా, ఎంత తేలికగా ఉచ్చులో చిక్కుపడ్డాడు! స్నేహితానికి మితే లేదన్న మాట!' అనుకుంటూ గబగబా వెళ్ళిపోయాడు.

ఇంటికి వెళ్ళాక గోరా మహిముడితో, "శశికీ వినయుడికీ వివాహం అసంభవ" మన్నాడు.

"ఏం? వినయుడు ఒప్పుకోలేదా?" అని మహిము డడిగాడు.

''నేనే ఒప్పుకోను."

''మళ్ళీ ఇదేమిటి? ఎందు కొప్పుకోవో కాస్త చెబుతావా?''

''వినయుడి మతాచారాలు ఇం కెంతకాలమో నిలవ్వు.''

''ఇంకా నయం! నీ కాలంలో క్రైస్తవమతం పుచ్చుకున్నవాడికూ్కడా ప్రాయశ్చిత్తం చేసేటట్టున్నావే! చూడూ, నేను నా పిల్లను చదువుసంధ్యలు లేనివాడి చేతిలో చచ్చినాపెట్టను. చదువుకున్నవాడు సనాతనాచారాన్ని అంతోఇంతో మీరకుండా ఉండనూ ఉండడు," అన్నాడు మహిముడు.

అతను ఆనందమయి దగ్గిరికి వెళ్ళి గోరాకు కాస్త కళ్ళెం వెయ్యమని కోరాడు.

మహిముడు చెప్పినదంతా విని ఆనందమయి గోరావద్దకు వెళ్ళి, వినయుడితో పోట్లాట పెట్టుకోవద్దని బతిమాలింది.

"వాడు స్నేహం పాటించకపోతే నన్ను వెంటపడమన్నావా ఏమిటి?" అని గోరా అడిగాడు.

''ఇంతకూ ఏం జరిగిందని? వాడు బ్రహ్మసమాజంవాళ్ళ యింటికి వెళ్ళాడు; అంతేనా? నువ్వేదో ఆదర్శాల నంటిపెట్టుకున్నట్టు మాట్లాడుతున్నావే; అవినాశుడు నీ ఆదర్శాలకు దూరంపోతే ఇంత తేలికగా పోనిచ్చిఉందువా? వినయుణ్ణి ఎందుకంత తేలికగా అవతలికి పోనిచ్చావు? నీకు ప్రాణస్నేహితుడు గనకనా?" అన్నది ఆనందమయి.



ఆ మాటతో గోరాకళ్ళు తెరుపు డయినట్టయింది. ఇంతకాలమూ అతను తన నియమంకోసం స్నేహాన్ని త్యాగం చేస్తున్నా ననుకు న్నాడు. కాని వినయుడు తన స్నేహంకోసం తనకు లొంగిరానందుకు పగ తీర్చు కుంటున్నట్టు ఇప్పుడు గోరాకు అర్థమయింది. వెంటనే అతను లేచి పైపంచె వేసుకుని వినయుడికోసం బయలుదేరుతుండగా వినయుడే వచ్చాడు.

'వినయా! నీకు దీర్ఘాయుస్సు. నీకోసమే బయలుదేరుతున్నాను,' అన్నాడు గోరా.

ఇద్దరూ భోజనం చేశారు. వినయుణ్ణి ఆరాత్రికి అక్కడే పడుకోమన్నాడు గోరా. ఇద్దరూ పై డాబామీదికి వెళ్ళి తెల్లవారినదాకా మాట్లాడుకున్నారు. వినయుడు గోరాతో తనకు గలిగిన ప్రేమానుభవం గురించి చెప్పాడు. అతను రెండో మనిషిపేరు చెప్పలేదుగాని, ఈ అనుభవం తనను పూర్తిగా మార్చేసిం దన్నాడు. ఇప్పు డాతనికి ప్రపంచమూ, ప్రకృతీ ఆనందమయంగా కనబడుతున్నాయి. అది తప్పేకావచ్చు, కాని చాలా వాస్తవమైన అనుభవం. పుస్తకాలలో చదివితే అల్ప మనిపించే ఈ అనుభవం వాస్తవంగా కలిగేసరికి అత్యంత శక్తివంతమైనదిగా కనబడుతున్నది.

వినయుడు చెప్పినదంతా గోరా మౌనంగా విని, "వినయా! ఇవాళ ఒక సత్యం నీ ఎదట ప్రత్యక్షంగా నిలబడింది. దాన్ని తృణీకరించటం అర్థంలేదు. దాన్ని స్వీకరిస్తేనేగాని వాస్తవమో కాదో తెలీదు. ఇదివరకు నీకు ప్రేమ అన్నది పుస్తకజ్ఞానమైనట్టే, నా దేశప్రేమకూడా పుస్తకజ్ఞానమే. నీకులాగే నాకుకూడా నా సత్యం సాక్షాత్కరిస్తే బాగుండును," అన్నాడు.

వారు ఇలా మాట్లాడుకుంటూండగానే తూర్పున ఉషఃకాంతి కనబడింది. అందులోనుంచి గోరా కేదో సందేశం వినిపించినట్టయి, తనను తాను మరిచి, ఏ ఋష్యాశ్రమంలోనో వేదపఠనం విన్నవాడిలాగా అయిపోయాడు. అతని శరీరమంతా ఒక్కసారి పులకించింది. అతని తలలోనుంచి ఒక కమలం పుట్టి, రెక్కలు విచ్చి ఆకాశమంతా ఆవరించినట్టనిపించింది. అతను తనను తాను తెలుసుకుంటూనే

"వినయా! నువ్వు ప్రేమదగ్గర నిలిచిపోరాదు; దాన్ని అధిగమించాలి. నన్ను పిలిచేవా డెంత శక్తిమంతుడో నీ కెప్పటికైనా తెలియజేస్తాను. నా ఆత్మ ఆనందంతో నిండిఉన్నది. నిన్ను జారనివ్వను." అన్నాడు.

అతను వినయుణ్ణి ఆలింగనం చేసుకుని, "మన ప్రవృత్తులు వేరు. కాని మనం మన వ్యత్యాసాలను విసర్జించి ఏకమై, మన స్నేహాన్ని సార్థకం చేసుకుందాం," అన్నాడు.

అరుణోదయంవేళ ఆనందమయి పైకి వచ్చి వాళ్ళను బలవంతాన పడుకోబెట్టి నిద్రపుచ్చింది. ఆమె కిందికి దిగపోతూండగా మహిముడు కనిపించాడు.

"తెల్లవార్లూ మేలుకుని మాట్లాడుకుని ఇప్పుడే నిద్రకుపక్రమించారు. వాళ్ళను లేపకు," అన్నది ఆనందమయి.

"పెళ్ళి విషయం ఏమైనా మాట్లాడుకున్నారేమో తెలుసునా?" అని అడిగాడు మహిముడు.

"నాకు తెలీదు," అన్నది ఆనందమయి.

"ఏదో ఒక నిర్ణయం జరిగే ఉంటుంది. త్వరగా పెళ్ళి జరక్కపోతే చిక్కే. వీ ళ్ళెప్పుడు లేస్తారోమరి!" అన్నాడు మహిముడు.

మూడుగంటలు నిద్రపోయి గోరా లేచాడు. తన పక్కనే వినయుడు పడుకుని ఉండటం చూసి అతనికి పరమానందమయింది. అతను వినయుణ్ణి లేవగొట్టి, "లే, పోవాలి; పనిఉంది," అన్నాడు.

గోరా ఉదయంపూట తనకు సమీపంలో ఉన్న బీదజనాన్ని చూడబోయేవాడు. అతని ఉద్దేశం వారికి ప్రబోధం చెయ్యటంగాని, ఉపకారం చెయ్యటంగానికాదు; వారితో కలిసిమసలటమే. అతను తన చదువుకున్న మిత్రులతోకన్న శ్రామికులతోనే ఎక్కువ దోస్తీగా ఉండేవాడు. తనకు అలవాటు లేకపోయినా వాళ్ళు హుక్కా ఇస్తే పీల్చేవాడుకూడా.

గోరాకు అందరికన్న ఎక్కువ భక్తుడు నందా అనే వడ్రంగి యువకుడు. తండ్రి దుకాణంలో పెట్టెలూ అవీ చేసేవాడు. నందా వ్యాయామ క్రీడలలో దిట్ట. అక్కడి క్రికెట్ జట్టులో అతన్ని మించిన బౌలరులేడు. ఆ జట్టులో విద్యావంతులు కూడా ఉన్నప్పటికీ, గోరా విధించిన క్రమశిక్షణ ఫలితంగా వారు నందాను కాప్టెన్‌గా పెట్టుకున్నారు.

కొద్ది రోజులక్రితం ఉలి తగిలి నందాకాలికి గాయమయింది. గోరా వినయుడి గొడవలో ఉండిపోయి విచారించలేదు. ఆ ఉదయమే నందా చనిపోయాడనీ, అతని

శవాన్ని దహనానికి తీసుకుపోయారనీ విని గోరా స్తంభించిపోయాడు. వైద్యుణ్ణి పిలిపించటానికి బదులుగా నందాతల్లి భూతవైద్యుణ్ణి పిలిపించి, తన కొడుకు ఒంటినిండా వాతలు వేయించింది. నందా గోరాను పిలిపించమన్నాడు; కాని గోరా వస్తే వైద్యం చేయించమంటాడని తల్లి గోరాకు కబురుచెయ్యలేదు.

''ఇదేం మౌఢ్యం ! ఎలాటిశిక్ష !'' అన్నాడు వినయుడు.

"ఇది ఎంతటి మౌఢ్యమో, దీని మూలాన ఎంత దారుణమైన శిక్ష కలుగుతున్నదో నీ కేంతెలుసు, వినయా ! ఆ భూతవైద్యుడు కలిగించిన వేదన నన్నూ, నా దేశాన్నీ దహిస్తున్నది. ఇది దారితప్పి జరిగిన సంఘటనకాదు ఈ వ్యాధికి నివారణ అసాధ్యమని నువ్వనబోతావు; నే నొప్పుకోను. మన దేశానికి విముక్తిలేదని కలలోకూడా భ్రమపడకు. దేశవిమోచనాని కెన్నడో ముహూర్తం రాబోతుం దను కోక. విమోచనోద్యమం అదివరకే ఆరంభమయింది. అది అనుక్షణమూ ముందుకు సాగుతూనే ఉంది," అన్నాడు గోరా.

ఇంతలోనే అతను "ఆగు ! ఆగు ;'' అని ఎలుగెత్తి అరుస్తూ పరిగెత్తాడు. ఒక బెంగాలీబాబు జోడుగుర్రాలబండీని తోలుకుంటూ ఒక ముసల్మాను వంటవాడి మీదికి బండిని పోనిచ్చాడు. ఎవరో తెల్లవాళ్ళకు వంటచేసే ఆ ముసలి ముసల్మాను, నెత్తిన కూరలగంప పెట్టుకుని వీధిని ఇటునుంచి అటు దాటాడు. బెంగాలిబాబు తొలగమని పెట్టిన కేక ఆ చెవిటివాడికి వినిపించలేదు. ఆ ముసలివాడు బండికింద పడకుండా ఎలాగో తప్పించుకున్నాడు గాని, గంపలో సరుకంతా రోడ్డుమీద పడిపోయింది. "పందిముండాకొడకా !' అని బెంగాలీబాబు కొరడాతో ముసలివాణ్ణి రక్తం చిమ్మేటట్టు కొట్టి వెళ్ళిపోయాడు.

ముసలివాడితోబాటు గోరాకూడా రోడ్డుమీద పడిన సరుకు ఎత్తి గంపలో వేయసాగాడు. ''అల్లా ! అల్లా !'' అని మూలుగుతూ ముసల్మాను, "ఎందుకు, బాబూ, శ్రమపడతారు ? అవెందుకూ పనికిరావు,'' అన్నాడు.

గోరా కా సంగతి తెలుసు. అయినా ఒక బెంగాలీవాడి దౌర్జన్యానికి మరొకడు పరిహారం చూపాలన్న ఉద్దేశంతో అతను సామానులన్నీ గంపలో చేర్చి, ''అయిన నష్టం మవు భర్తీచెయ్యలేవు. మా ఇంటికి రా, డబ్బిస్తాను. కాని ఒకటి గుర్తుంచుకో — ఇలాంటి అవమానాన్ని నోరుమూసుకుని సహించినందుకు అల్లా నిన్ను క్షమించడు," అన్నాడు.

"అల్లా తప్పుచేసినవాణ్ణి శిక్షిస్తాడు గాని నన్నెందుకు శిక్షిస్తాడు ?" అన్నాడు ముసల్మాను.

''తప్పు సహించినవాడుకూడా తప్పు చేసినవాడే. అలాటివాళ్ళ మూలానే ప్రపంచంలో పాపం పెరుగుతుంది,'' అన్నాడు గోరా.

గోరా ఇంటికన్న వినయుడి ఇల్లు చేరువలో ఉండటంచేత గోరా ముసల్మానును వెంటబెట్టుకుని వినయుడింటికి వెళ్ళి, "డబ్బు తియ్యి." అంటూ, వినయుడు డ్రాయరు తాళాలు తీసేలోపుగా దాన్ని పట్టుకుని బలంగా గుంజాడు అది కాస్తా తెరుచుకుని అందులోనుంచి పరేశ్‌బాబు కుటుంబం గ్రూప్ ఫొటో బయటపడింది.

దాన్ని చూడగానే గోరా బిగదీసుకుపోయాడు. వినయు డిచ్చిన డబ్బుతో ముస ల్మానును పంపేసి ఇంకా మాటా పలుకూ లేకుండా అతను బయలుదేరాడు. విన యుడు అతన్ని వదలక వెంబడించాడు.

ఇంటిదగ్గర వారికి మహిముడు కనిపించి, వినయుణ్ణి స్నానం చెయ్యమని పంపేసి, గోరాతో శశి విషయం ఎత్తాడు.

''శశిని పెళ్ళాడటానికి వినయుడు ఒప్పుకుంటా డనుకుంటానే!''అన్నాడు గోరా.

"వినయుడు ఒప్పుకోడనా నా దిగులు? నువొప్పుకోవని! నీ నోటిమీదిగా వినయుణ్ణి పెళ్ళిచేసుకోమని అడుగు, చాలు, ' అన్నాడు మహిముడు.

గోరా వినయుణ్ణి, "శశిని పెళ్ళాడటం గురించి నీ అభిప్రాయ మేమిటి?" అని అడిగాడు.

''నువ్వేమంటావు?" అని వినయుడు ఎదురడిగాడు.

"చేసుకోవచ్చునని నా ఉద్దేశం."

"మనిద్దరమూ పెళ్ళి లేకుండా ఉండిపోదా మనుకోలేదూ?"

"ఇప్పుడు ఇలా అనుకుందాం – నువు పెళ్ళాడు, నేను ఆడను."

"ఎందు కా తేడా?"

"నన్ను దేవుడు నెత్తిన ఇంత బరువు పెట్టి పంపాడు. నీ నెత్తినకూడా ఇంత బరువు పడితేగాని ఇద్దరమూ సమంగా ప్రయాణించలేం."

"సరే అయితే నా నెత్తిన ఇంతబరువు పెట్టు''

''ఈ బరువు నీకు అంగీకారమేనా అని."

"బరువు పడటమే ప్రధానంగాని అది ఎలాటి బరువైతే నేం?"

తన వివాహానికి గోరా తొందరపడటానికి కారణం తాను పరేశబాబు కూతు ళ్ళలో ఎవతెనైనా పెళ్ళాడతానేమోనన్న భయమే నని వినయుడు గ్రహించాడు.

ఆరోజు సాయంకాలం వినయుడు గోరాతో, "చూడు గోరా! మన దేశాభి

మాసంలో ఒక పెద్ద లోటున్నట్టు నాకు తోస్తున్నది. దేశంలో సగభాగమైన స్త్రీలను గురించి మనం ఆలోచించటమే లేదు," అన్నాడు.

"ఇంగ్లీషువాళ్ళలాగా అంతటా ఆడవాళ్ళనే చూడాలంటావా ఏం?" అన్నాడు గోరా.

ఇద్దరూ చర్చించుకున్నారు, కాని గోరా వినయిడికి కొంచెంకూడా సందివ్వకుండా రకరకాల యుక్తివాదాలు చేశాడు. కాని గోరా మనసులో ఒక బీజం పడి, అవకాశం దొరికితే మొలకెత్తటానికి సిద్ధంగాఉంది.

## 4

సుచరితా, సతీశుడూ పరేశబాబు పిల్లలుకారు; ఆయన మిత్రుడైన రామశరణ హాల్దారు పిల్లలు. సతీశుణ్ణి కని అతని తల్లి చనిపోయాక రామశరణుడు బ్రహ్మసమాజంలో చేరి, అయినవాళ్ళ సూటీ పోటీలు పడలేక ఢాకాలో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. ఆయన అక్కడ పోస్టాఫీసులో పని చేసే కాలంలోనే ఆయనకూ, పరేశబాబుకూ మైత్రి ఏర్పడింది. రామశరణబాబు ఆకస్మిక మరణం పాలయ్యాడు. ఆయన ఆస్తికి వారసులైన పిల్లలిద్దరికీ పరేశబాబు ట్రస్టీ అయాడు. అది మొదలు ఆ బిడ్డ లిద్దరూ పరేశబాబు కుటుంబంతో కలిసి జీవిస్తున్నారు.

గోరా తమ యింటికి వచ్చిపోయినాక ఒకరోజున వారద తన భర్తతో, "అయితే సుచరితకు పెళ్ళి చెయ్యనే చెయ్యరా ఏం?" అని అడిగింది.

"వరు డేడీ?" అన్నాడు పరేశబాబు సౌమ్యంగా.

"సుచరితకూ పానుబాబుకూ పెళ్ళవుతుందనేగా అందరమూ అనుకోవటం? సుచరితక్కూడా ఈసంగతి తెలుసే?"

"అతనంటే సుచరిత కంత ఇష్టం ఉందనుకోను."

"అందుకే నాకు మండుకొచ్చేది. దాన్ని మన పిల్లలాగే చూస్తున్నాంగదా అని అంత మరీ దర్జాలు పోనవసరం లేదు. పానుబాబులాటివాడు తనను పెళ్లాడ గోరటం ఎంతగొప్ప! మీరు దాన్ని ఇలా చెడగొట్టేటుంటే దానికి వరుడు దొరకటము చాలా కష్టమైపోతుంది."

సుచరితకు పానుబాబంటే ప్రత్యేకమైన గౌరవమే ఉండేది. అతన్ని చూడక మునుపే అతన్ని గురించి ఆమె గొప్పగా విన్నది. అతను బ్రహ్మసమాజంలో ప్రముఖుడు; ఉపాధ్యాయుడుగాకూడా అతనికి మంచి ఖ్యాతి ఉన్నది. ఇంగ్లీషూ, తత్వశాస్త్రమూ బాగా తెలిసినవాడు. అటుతరవాత పానుబాబు సుచరితపట్ల ప్రత్యేక

శ్రద్ధ చూపుతూవచ్చాడు. ఆమెను పెళ్లాడాలని ఉన్నట్టు అతను పైకి అనలేదు గాని, తన భావిభార్యను లోపరహితం చేసి తనకు తగినదిగా తీర్చిదిద్దటానికి చాలా కృషి చేశాడు. అతనికి తగిన భార్య కావటానికే సుచరితకూడా శ్రమపడింది.

ఆ దశలో పానుబాబు సుచరితను పెళ్ళి చేసేసుకోవటానికి మారుగా బ్రహ్మ సమాజ చరిత్రలో తన వివాహం ఒక ప్రముఖ ఘటనగా ఉండాలన్న దురాశతో సుచరితను పరీక్షకు పెట్టి, తానుకూడా పరీక్షకు గురిఅయ్యాడు. తాను ఆరాధించే సత్యంపట్ల పరేశబాబులో కనిపించిన నమ్రత పానుబాబులో లేకపోవడం సుచరిత గమనించింది.

పానుబాబు తాను బ్రహ్మమతానికి సంరక్షకుడిలాగా ప్రవర్తించేవాడు. పరేశ బాబు భగవద్గీతా, భారతమూ చదివి సుచరితకు వినిపించేవాడు. అది పానుబాబుకు గిట్టదు. ఇతర మతాల గ్రంధాలలో ఒక బైబిలును మాత్రమే అతను మన్నించే వాడు. పరేశబాబు నెవరు విమర్శించినా సుచరిత సహించలేకపోయేది. అయినప్ప టికీ పానుబాబు ఏ క్షణాన తనను పెళ్ళాడమన్నా సుచరిత సిద్ధంగానే ఉన్నది.

గోరా వచ్చిననాడు సుచరిత గోరాను సమర్థించుతూ పానుబాబుతో నాలుగు ముక్కలు ఘాటుగా మాట్లాడటం చూసి పరేశబాబు, ఆమెకు పానుబాబంటే ఇష్టం లేదనుకుని, తన భార్యతో ఆమాటే అన్నాడు. తరవాత వారద సుచరితతో, "మీ నాన్నగారి మనసు చాలా కష్టపెట్టావు. నువు పానుబాబును చేసుకొంటావని మేమంతా అనుకుంటుంటే నువ్వేమో —'' అన్నది.

చేసుకోనని తా నెవ్వరితోనూ అనలేదన్నది సుచరిత.

ఆ రోజు అపరాహ్ణం పానుబాబు వచ్చినప్పుడు వారద, "ఇదేమిటి, పాను బాబూ ? నువు సుచరితను పెళ్లాడతావని మే మంతా ఇంతకాలంగా అనుకుంటున్నాం. నీ నోట ఆ మాటే రాదేం ?" అన్నది.

"ఆ మాట వేరే అనాలా ? ఆమెకు పద్దెనిమిదో ఏడు రాగానే అందామనే నా ఉద్దేశం," అన్నాడు పానుబాబు.

"నీదంతా చాదస్తం; పద్నాలుగు నిండితే చాలదూ ?''

ఆ సాయంకాలం వెళ్ళిపోయేముందు పానుబాబు లాంఛనగా పరేశబాబుతో సుచరితను చేసుకోవాలని ఉన్న దన్నాడు.

"పద్ధెనిమిదేళ్ళలోపు పిల్లలు వివాహ మాడరాదని వ్యాసాలుకూడా రాశావు కదూ ?'' అన్నాడు పరేశబాబు.

"సుచరితలాగా మనఃపరిపాకం గల పిల్లకా నియమం వర్తించదు."

"కావచ్చు, కాని నీ మాటలో నీకు విశ్వాసం ఉన్నపక్షంలో సుచరిత యుక్త వయస్కురాలయేదాకా ఆగటం మంచిది."

"తప్పకుండానూ. ఇది నిశ్చితార్థం మాత్రమే," అన్నాడు పానుబాబు...

శశికీ తనకూ పెళ్ళి నిశ్చయమై, తనకూ గోరాకూ తద్వారా మైత్రీబంధం బలపడ్డాక, వినయుడికి స్వేచ్ఛగా ప్రవర్తించే అధికారం వచ్చినట్టయింది. అతనిప్పుడు పరేశబాబుగారింటికి తరచు వెళ్ళివస్తున్నాడు. త్వరలోనే అతను పరేశబాబు కుటుంబంలోనే ఒకడుగా జమఅయిపోయాడు.

వినయుడంటే లలితకు ఒక ప్రత్యేకాభిమానం ఏర్పడింది. గోరాలాగా అతను తనతో వాగ్యుద్ధానికి దిగడు గనక పానుబాబుకుకూడా వినయుడంటే సద్భావమే. పానుబాబు లేని సమయాలు చూసి సుచరిత వినయుడిచేత గోరా భావాలను గురించే మాట్లాడించేది. గోరా, వినయుల వంటి విద్యాధికులు మూఢవిశ్వాసాలను సమర్థించట మేమిటి? గౌరమోహనబాబు కులాలను విశ్వసించట మేమిటి? ఇలాటి ప్రశ్నలామె అడిగితే వినయుడు గోరా అభిప్రాయాలను సమర్థించ యత్నించేవాడు. కిందినుంచి పైకి వెళ్ళాలంటే మెట్లుండాలిగదా! కొన్ని మెట్లు కిందా, కొన్ని మెట్లు పైనా ఉండక తప్పదు. సాంఘిక సమస్య పరిష్కారం కావటానికి భారతదేశం వర్ణవ్యవస్థ నెలకొల్పింది. కాని ఆ ప్రయోగం ఇంతవరకు ఫలించలేదు. దేశానికి కావలిసింది భయమంటే ఏమిటో తెలియని నిస్వార్థపరులైన బ్రాహ్మణులు, జితేంద్రియులు. మనని భయమే అణగదొక్కుతున్నది. మనం రాజులకూ, నియంతలకూ తలవంచుతున్నది వారిపైగల గౌరవంకొద్దీ కాదు–భయంతో. మన ఈ భయం పోగొట్టే నిజమైన బ్రాహ్మణుడు రావాలి.

ఈ వాగ్వాదం వింటున్న పరేశబాబు, ''ఇదంతా గతంకేసి చేతులు చాచటం కాదా? అందువల్ల లాభ మేమిటి?" అని అడిగాడు.

"గతం మాటలతో చావదనీ, గతానికి చెందిన సత్యానికి చావు లేదనీ గోరా అంటాడు," అన్నాడు వినయుడు. గోరాలో కొంత పిడివాదం లేకపోలేదని అతను ఒప్పుకున్నాడు.

"అలాటివాళ్ళు బ్రాహ్మలలోకూడా ఉన్నారు. వాళ్ళు సత్యంమీద ఆధారపడక, సత్యమే తమపైన ఆధారపడి ఉన్నదనుకుంటారు. నామటుకు నేను సత్యాన్ని ఎక్కడైనా ఆరాధిస్తాను. నా ఆరాధనకు పైవాళ్ళు ప్రతిబంధకాలు పెట్టకుండా ఉంటే చాలు,'' అన్నాడు పరేశబాబు.

ఆరాత్రి పడుకునేముందు లలిత సుచరితతో వినయుణ్ణి గురించి మాట్లాడుతూ,

"నాకు వినయబాబంటే చాలాఇష్టం. కాని అతను బొత్తిగా ఆ గోరానీడలో ఉండి పోతున్నాడు. గోరామాటలే చిలకలాగా అప్పగిస్తాడు; తన సొంతమాటలు చెప్పడు. అది గౌరమోహనబాబుపైన ప్రేమకూడా కాదు, దాస్యం. ప్రేమ ఉన్నంతమాత్రాన గుడ్డిగా అనుసరించాలా ?" అన్నది.

వినయుణ్ణి గోరానుంచి కాపాడాలన్న అభిప్రాయంకూడా లలితకు కలిగింది.

వాళ్ళుమాట్లాడుకుంటుండగానే సతీశుడు తిరిగివచ్చి, "దీదీ, దీదీ! నన్ను వినయ బాబు సర్కసుకు తీసుకెళ్లాడు. ఒకరోజు అందరమూ కలిసి సర్కసు చూద్దామంటే – ఆడవాళ్లు పులిని చూసి భయపడతారన్నాడు," అన్నాడు.

"చెప్పక చెప్పక వినయబాబు ధైర్యమే చెప్పాలి," అన్నది లలిత.

"రేపు మాటినీ ఉంది," అన్నాడు సతీశుడు.

మర్నాడు వినయుడు రాగానే లలిత, "సరైన సమయానికి వచ్చారు వినయ బాబూ! సర్కసుకు పోదాం పదండి. మీ గౌరమోహనబాబుకు కోపం రాదుగా? నవ్వుతారేం, వినయబాబూ! ఆడపిల్లలకు పులిని చూస్తే భయమన్నారుట గదూ; మీ కెవరిభయమూ లేదా?" అన్నది.

తప్పనిసరి అయి ఆడపిల్లలను వెంటబెట్టుకుని వినయుడు పగటివేళ సర్కసుకు వెళ్లాడు.

తరవాతను ఒకరోజు ఉదయం గోరా రాసుకుంటూండగా వినయుడు వెళ్ళి, "ఈమధ్య నేను పరేశబాబు కూతుళ్ళను సర్కసుకు తీసుకెళ్ళాను," అన్నాడు.

గోరా రాసుకుంటూనే, "విన్నాను," అన్నాడు. ఎవరు చెప్పారని అడిగితే అవినాశుడు చెప్పాడని గోరా అన్నాడు.

వినయుడిలో ఆగ్రహం బుస్సున లేచింది. తాను సర్కసుకు పోతే నేం? తన మీద చాడీలు చెప్పడానికి అవినాశు డెవడు? గోరా తనకు రక్షకుడా? తనకు గోరా అంటే భయమని లలిత అన్నప్పుడు, తన కంత ఆగ్రహం కలిగిందే? కాని తనలో పిరికితనం లేదా? గోరా ముభావంగా ఉండటం వినయుడి కోపాన్ని మరింత చేసింది – అతను నిశ్చింతగా తన మానాన తాను రాసుకుంటున్నాడు.

ఇంతలో మహిముడు వచ్చి, "మీ బాబాయినుంచి పెళ్ళికి అనుమతి వచ్చిందా?" అని అడిగాడు. అప్పుడే తన పెళ్ళి అంతా నిర్ధారణ అయిపోవటం వినయుడికి ఆశ్చర్యం కలిగించింది. దీనికికూడా గోరాకు తనపై పెత్తనం ఉండటమే కారణం. తనది ఏమీలేదు!

"నే నింకా మా బాబాయికి రాయలేదు. ఎందు కింత తొందర? ఆశ్వీజ కార్తీకా

లలో పెళ్ళిళ్ళు చెయ్యరు. మార్గశిరం మా కుటుంబానికి అచ్చిరాదు. ఆ మాసంలో మా వాళ్ళు శుభకార్యాలు చెయ్యరు," అన్నాడు వినయుడు. అతనికీ మహిముడికీ వర్జ్య మాసాలను గురించి చర్చ జరిగింది. ఆ చర్చ వింటుంటే వినయుడు పెళ్ళి ప్రస్తావనను దాటవేసే ధోరణిలో ఉన్నట్టు తోచింది. అతను రాయటం ఆపి, "ఒకసారి మాట ఇచ్చాక, ఆయనకు లేనిపోని చిక్కు లెందుకు కలిగిస్తావు ?" అన్నాడు.

వినయుడు అసహనంతో, "నేను మాట ఇచ్చానా ? నా నుంచి మాట ఊడ లాగారా ?" అని అడిగాడు.

"నీ నుంచి ఎవరు ఊడలాగారు ?'' అని గోరా అడిగాడు.

"నువే !''

"నేనా ? నేను గట్టిగా నాలుగు మాటలైన అనలేదే ? నీ చేత బలవంతాన ఒప్పించానా ?''

అందుకు ఎన్నో మాటలు కావాలా ?"

గోరా బల్ల ముందునుంచి లేస్తూ, "ఆ మాట అన్నందుకు లెంపలేసుకో. నీ ఒప్పుదల బలవంతాన రాబట్టవలసినంత గొప్పదేమీకాదు...దాదా! వినయుడికీ శశికీ పెళ్ళి పొసగదనీ, నా కిష్టం లేదనీ మొదటే నీతో నేను చెప్పలేదూ ?'' అన్నాడు.

"ఎందుకుచెప్పలేదూ ? నువు గనక ఆ మాటన్నావుగాని, అన్నదాతురి పెళ్ళి సందర్భంలో మరో డెవడూ అలా చెప్పడు," అన్నాడు మహిముడు.

వినయుడు అక్కడినుంచి తన ఇంటికి వెళ్ళిపోయాడు. అతని హృదయాన్ని శూలాలు గుచ్చుతున్నాయి. అతనికి ఆకలి ఏమీ లేకుండా పోయింది. తాను గోరాకు తీరని అన్యాయం చేశాడు.

ఆరోజు మధ్యాహ్నం దాటాక వినయుడు ఆనందమయి దగ్గిరికి వచ్చి, "అమ్మా! నేను గోరాకు చాలా అన్యాయం చేశాను శశిని పెళ్ళాడటానికి నాకేమీ అభ్యంతరం లేదని నీతో చెప్పటానికి వచ్చాను," అన్నాడు.

"బాబూ, కలహం రేపటికి మాసిపోతుంది. కాని పెళ్ళి ఆజన్మాంతం ఉండేది. మీ తగాదా పరిష్కారం చేసుకోవటానికని తొందరపడి నిర్ణయం చేసుకోవద్దు," అన్నది ఆనందమయి.

కాని వినయుడీ సలహా పాటించలేదు. తిన్నగా గోరా దగ్గిరికి వెళ్ళటానికి మొహంచెల్లక, అతను మహిముడి వద్దకు వెళ్ళి, తాను నాలుగు నెలల్లోపల శశిని

పెళ్ళాడటానికి సిద్ధమేననీ, తన బాబాయి అనుమతి సంపాదించే భారం తనదేననీ అన్నాడు.

"అయితే వెంటనే నిశ్చితార్థం చేద్దమా ?" అన్నాడు మహిముడు.

''గోరాతో సంప్రతించిగాని చెయ్యవద్దు.'' అన్నాడు వినయుడు.

మళ్ళీ గోరా ఏంపేచీ పెడతాడోనని మహిముడు భయపడ్డాడుగాని, గోరా ఏమీ పేచీ పెట్టలేదు; నిశ్చితార్థం జరపమన్నాడు.

# 5

వినయుణ్ణి అదుపులో ఉంచాలంటే ప్రమాదస్థలంలో అతనిపైన తాను ఒక కన్ను వేసిఉంచటం అవసరమనీ, అందుకుగాను తానుకూడా పరేశబాబుగారింటికి తరుచు వెళ్ళిరావటం మంచిదనీ గోరా నిర్ణయించుకున్నాడు. అతను మర్నాదే వినయుడి ఇంటికి వెళ్ళి, పరేశబాబు కుమార్తెలను గురించి శాంతంగా చాలాసేపు ముచ్చటించి, వినయుడికి అత్యాశ్చర్యం కలిగించాడు. అంతేకాక, మర్నాడు వినయుడు తనను పరేశబాబుగారింటికి పోదాం రమ్మన్నప్పుడు గోరా వెంటనే సమ్మతించాడు. వినయుడికి ఆ ఇంట కనిపించే ఆకర్షణ ఏమిటో తెలుసుకోవాలని గోరాకు అనిపించింది.

వాళ్ళిద్దరూ అక్కడికి చేరేసరికి చీకటిపడింది. దీపంముందు బల్లవద్ద కూర్చుని పానుబాబు ఏదో ఆంగ్లవ్యాసం పరేశబాబుకు చదివి విన్పిస్తున్నాడు. ముఖానికి తాటాకు విసనకర్ర అడ్డంపెట్టుకుని సుచరితకూడా వింటున్నది. కాని ఆమె మనసు తాను వినేదానిలో లగ్నం కావటంలేదు.

వారద తనకుమార్తెలతో సహా ఒకనాటకం రిహార్సలుకు వెళ్ళింది. గోరా వినయులు రావటంతో పానుబాబు పఠనానికి విఘ్నం కలిగింది. తన భార్యనూ, పిల్లలనూ తీసుకువచ్చే వేళ అయిందని పరేశబాబు బయలుదేరుతూ, తాను త్వరగానే తిరిగివస్తానన్నాడు.

పరేశబాబుకు బ్రౌన్‌లో అనే జిల్లా మేజిస్ట్రేటు మిత్రుడున్నాడు. ఈయేడు వినోదాలకు లెఫ్టినెంటు గవర్నరు సకుటుంబంగా వస్తున్నాడనీ, ఆ సందర్భంలో ఒక ఇంగ్లీషు నాటకం ఆడితే బాగుంటుందనీ బ్రౌన్‌లో భార్య వారదతో అన్నది. వారద సరేనని తన పిల్లలచేత నాటకం రిహార్సల్సు చేయించటానికి తీసుకుపోయింది.

పరేశబాబు వెళ్ళగానే పానుబాబుకూ, గోరాకూ వాగ్యుద్ధం ప్రారంభమయింది. భారతదేశంలో బెంగాలీలకూ ఇంగ్లీషువారికీ పొత్తుకుదరదని గోరా అన్నాడు.

అందుకు కారణం మన మూఢాచారాలూ, మూఢవిశ్వాసాలే నన్నాడు పానుబాబు. అదే నిజమైతే మనం ఇంగ్లీషువారి పొత్తుకోసం పాకులాడటానికి సిగ్గుపడా లన్నాడు గోరా. అర్హులైనవారిని ఇంగ్లీషువా రెంతో ఆదరిస్తా రన్నాడు పానుబాబు. వాళ్ళు కొద్దిమంది భారతీయులను మాత్రమే ఆదరించటం మిగిలిన దేశ ప్రజలకు మరింత అవమాన మన్నాడు గోరా. పానుబాబు ఆగ్రహం రెచ్చిపోతున్నకొద్దీ, అతను గోరాకు మరింతబాగా దొరికిపోయాడు.

సుచరిత విసనకర్ర చాటునుంచి గోరాను కన్నార్పకుండా చూస్తూ ఉండి పోయింది. దృఢమైన చేతులూ, విశాలమూ, కాంతివంతమూ అయిన నుదుడూ, నిరసనతోకూడిన అతని నవ్వూ, హుందాతనమూ, అతని భావాల పరిపక్వతా, గంభీరమైన అతని కంఠధ్వనీ చూస్తుంటే ఆమెకు అతనుఒక అసాధారణవ్యక్తనీ, వాస్తవమైన పురుషుడనీ అనిపించింది. అతనిపక్కన పానుబాబు వెకిలిగా కన బడ్డాడు. అలాటివ్యక్తిత్వంగలవాణ్ణి సుచరిత అదివరకు ఎరగదు. అందుచేత గోరాను చూస్తూ ఆమె తనను తాను మరిచింది.

ఆమె తన్మయత్వం గమనించి పానుబాబు లేచి, "సుచరితా, అలా పక్కగది లోకి వస్తావా? నీతో ఒకమాట చెప్పాలి," అన్నాడు.

గోరా వినయుల సమక్షంలో అతను తనతో అలా మాట్లాడటం సుచరితకు చెంపపెట్టులాగా తగిలింది. దానికితోడు గోరా క్షణకాలంపాటు ఆమెకేసి ఎలా చూశాడంటే, దానితో ఆమె అవమానం రెట్టింపయినట్టయింది.

"వినిపించలేదా సుచరితా. అలా ఒకసారి రా, నీతో ఒకమాట చెప్పాలి," అన్నాడు పానుబాబు మరింత ధాష్టీకంగా.

"నాన్నగారు వచ్చేదాకా ఉండండి. అప్పుడు చెప్పుదురుగాని," అన్నది సుచరిత.

"మేం వెళ్ళాలి," అంటూ వినయుడు లేచాడు.

"అప్పుడే వెళ్ళటమేమిటి? తిరిగి వచ్చేదాకా నాన్నగారు మిమ్మల్ని ఉండ మన్నారు," అన్నది సుచరిత. తాను ఆగటానికి వీల్లేదని చెప్పి, పానుబాబు వెళ్ళి పోయాడు. ఎంతో అవమానం పొందినదానిలాగా, ఏమనటానికీ చెల్లక, సుచరిత తల వంచుకు కూర్చున్నది. ఆ సమయంలో గోరా ఆమెను పరీక్షగా చూశాడు. అతను ఏ స్త్రీనీ ఎన్నడూ ఒక సమగ్ర వ్యక్తిగా పరిశీలించి ఎరగడు. ఇప్పు డతనికి సుచరితలో సంపూర్ణ స్త్రీత్వం బొమ్మకట్టి కనిపించింది.

అతను సుచరితకు ప్రబోధం కలిగించసాగాడు. మనదేశానికీ, సమాజానికీ, ముక్తి లేదనీ, ఇంగ్లీషువాళ్ళ సంరక్షణలో ఎప్పటికీ ఉండిపోవలసినవాళ్ళమే ననీ



చాలామంది నమ్మకం. అతను అడ్డుపడకపోతే వినయుడు ప్రభుత్వోద్యోగంలో ప్రవేశించేవాడే. ప్రభుత్వోద్యోగులు తాముకూడా ప్రభుత్వంతోబాటు అధికారం పంచుకుంటున్నామనీ, మరొక విశిష్ట వర్గమనీ అనుకుని, మిగతావారిని హీనంగా చూస్తారు. అందువల్ల కొంచెంకూడా లాభంలేదు.

మాట్లాడుతూనే గోరా బల్లమీద గట్టిగా గుద్దాడు దీపం ఎగిరిపడింది.

"అదేమిటి, గోరా? అది సర్కారు బల్లకాదు. ఆ దీపం పరేశబాబుగారి సొత్తు," అన్నాడు వినయుడు.

ఈ మాటకు గోరా ఇల్లెగిరిపోయేటట్టు నవ్వాడు. అతను ఎవరైనా హాస్యమాడినా గోరా నవ్వగలడని సుచరిత తెలుసుకున్నది.

గోరా ఇంకా ఎన్నో విషయాలు మాట్లాడాడు. సుచరిత మౌనంగా తాను చెప్పేదంతా శ్రద్ధతో వినటం అతనికి ఉత్సాహం కలిగించింది. "నేను కోరేదల్లా ఏమంటే, దేశంలోపలి అడుగుపెట్టు. దాని గుణదోషాలను ఆమోదించు. ఆ తర



వాత లోపాలు సవరించు అంతే గాని ఎడంగా ఉండిపోయి. కిరస్తానీ భావాలు నరాలకెక్కించుకుని చూడవద్దు. అందువల్ల దేశానికి బాధ హెచ్చుతుందేగాని లాభం జరగదు,'' అన్నాడతను సుచరితతో.

''నేనెన్నడూ దేశం గురించి లోతుగా ఆలోచించలేదు. కాని, ఒకటి చెప్పండి. దేశంకన్న మతం ఉన్నతమైనది కాదా?" అన్న దామె.

"అంత ఉన్నతమైనది దేశంలోనుంచే వ్యక్తమవుతుందిగద. మన దేశంలోనే ఉండి మనం సూర్యుణ్ణి చూడగలుగుతున్నాం కామా? సముద్రం దాటి వెళ్ళి ఏచర్చి గదపలోనో కూర్చుంటేగాని సూర్యుడు కనబడడా? సత్యం ఒకటే కావచ్చు. అది భిన్నరూపాలలో వ్యక్తమవుతుంది. రూపరహితమైనదానికి శతకోటిరూపాలు. ఇతర దేశాలలోవాళ్ళు ఈశ్వరుణ్ణి ఒకే రూపంలో బంధించ యత్నించారు. ఇది భారతీయులు చెయ్యలేదు"

ఈ ధోరణిలో చాలాసేపు మాట్లాడి చివరకు గోరా, "నన్ను మతదురభిమానిగా భావించవద్దు. దేశంలోని భిన్నత్వంలోనూ, వైవిధ్యంలోనూ నేను ఏకత్వము చూడగలిగాను; భారతదేశ మంతా నాదే. భారతీయు లందరూ నావారే," అన్నాడు.

అతని మాటలన్నీ ఆమెకు అర్థమయే అవకాశం లేదు, కాని జీవితం ఒక కుటుంబానికీ, ఒక సమాజానికీ పరిమితమై లేదన్న భావం బలమైన కెరటంలాగా ఆమెను తాకింది.

ఇంతలో పరేశబాబు కుటుంబం తిరిగి వచ్చారు. వినయుడూ, గోరా వెళ్ళిపోవటానికి లేచారు. పరేశబాబు గోరాతో, "మీతో మాట్లాడే అవకాశం లేకపోయింది. తీరిక ఉన్నప్పుడల్లా వస్తూఉండండి," అన్నాడు.

గోరావెంట వెళ్ళిపోబోతున్న వినయుణ్ణి వారద కొంచెంసేపు ఉండమన్నది. వినయుడు గోరాకేసి చూశాడు. లలిత కొంటెగా నవ్వి ముఖం పక్కకు తిప్పుకుంది. వినయుణ్ణి ఉండమనిచెప్పి గోరా వెళ్ళిపోయాడు.

"వినయబాబూ! మీరు తప్పించుకు పారిపోతే బాగుండేది. మా కొక నటుడు తక్కువయాడు. మీకు అమ్మ ఒక వేషం ఇస్తుంది," అన్నది లలిత.

"అది నావల్లకాదు," అన్నాడు వినయుడు.

"నేను అమ్మతో ముందే అన్నాను— మా స్నేహితుడు ఒప్పుకోరని," అన్నది లలిత.

"స్నేహితుడిమాట కాదు. నాకు నటించటం రాదు."

"మా కందరికీ వచ్చునా ఏం?"

వినయుడు తప్పించుకునే దారిలేదు. అతన్ని లలిత వాదంలోకి దింపింది. అతనికి మేజిస్ట్రేటుగారింటో నాటకం ఆడటానికి ఎందుకభ్యంతరం? అదిఅతని సొంత అభిప్రాయమా, ఇతరులదా? ఇంగ్లీషువారిని ప్రతిఘటించటానికి ఇదొక పద్ధతి అని గౌరమోహనబాబు ఉద్దేశమా?

"ఎందుకాకూడదూ? వాళ్ళ వేషం ఆడించి పిలపటమే మనను గౌరవించట మనుకో పటం మనకు అగౌరవం కాదా?" అన్నాడు వినయుడు రోషంగా.

అయినా లలిత వినయుణ్ణి అర్థంలేని వెటకారంతో నొప్పించింది చివరకు వినయుడు, "ఎందుకీ వాదం? నిన్ను సంతోషపెట్టటానికి వేషం కట్టమంటే కడతానుగదా!" అన్నాడు.

"నాకోసం మీ నమ్మకాల నెందుకు మార్చుకోవాలి?" అన్నది లలిత.

"సరే, అలా అయితే నీ వాదనవు ఓడిపోయి, వేషం వెయ్యటానికి ఒప్పు కుంటాను, సరా?" అన్నాడు వినయుడు.

తీరా అతను వేషం వెయ్యటానికి ఒప్పుకున్నాక లలితకు తృప్తి కలగలేదు. అతను వెళ్ళిపోయేటప్పుడు లలిత ముఖంలో కాఠిన్యం గమనించి, "నేను ఓటమి అంగీకరించికూడా నిన్ను సంతోషపెట్టలేకపోయాను." అన్నాడు. లలిత జవాబివ్వ లేదు.

లలిత మనసు కల్లోలితమై పోయింది. కారణం లేకుండానే ఆమెకు గుండె దడ దడ లాడింది. ఏడవ బుద్ధి అయింది.

మర్నాడు ఉదయం ఆమె రెండు ఎర్రగులాబీలు—లావణ్యకు సుధీరు డిచ్చిన పూలగుత్తిలోవి—సతీశుడి కిచ్చి, 'వినయబాబు దగ్గిర అన్ని బొమ్మలూ తీసుకుని ఆశ్రమంలో అంటించుకుంటావుగదా, ఆయన కెప్పుడన్నా ఏమన్నా ఇచ్చావా? ఈ గులాబీలు తీసుకుపోయి ఇవ్వరాదూ?' అన్నది

సతీశు డా గులాబీలను తీసుకుపోయి వినయుడి కిస్తూ "మా లలితక్క మీ కిమ్మ మన్నది." అని చెప్పాడు. వాటిని చూడగానే వినయుడికి, తన హృదయంలో లలిత కలిగించిన గాయం నయమైపోయిన ట్లనిపించింది. ఇది లలిత తనకు పంపిన రాజీ చిహ్నం. అతను వాటిని తీసుకుని ఆనందమయికోసం వెళ్ళాడు.

ఇంటివాకిటిదగ్గిర గోరా, వీపున గుడ్డల మూటతో ఎదురై, "నువ్వు శుభ శకునమా, దుశ్శకునమా?" అన్నాడు.

"ఎక్కడికి ప్రయాణం?" అని వినయు డడిగాడు.

"నాకే తెలీదు. అమ్మ నీకు చెబుతుంది." అంటూ గోరా వెళ్ళిపోయాడు.

వినయుడు ఆనందమయికి ఎర్రగులాబీలు అర్పించి, వాటిని ఆశీర్వదించి తిరిగి ఇవ్వమన్నాడు. "గోరాను పరేశబాబుగా రింటికి తీసుకుపోయావా ఏమిటి?" అని ఆనందమయి అడిగితే వినయుడు జరిగినదంతా చెప్పాడు. ఆమె అంతా శ్రద్ధగా విన్నది. తరవాత వినయుడు వెళ్ళిపోయాడు.

క్రితంరాత్రి గోరా పరేశబాబు ఇంటినుంచి బయలుదేరి, తిన్నగా ఇంటికిపోక, పరధ్యానంలో ఉన్నవాడిలాగా నింపాదిగా నడుస్తూ గంగాతీరానికి వెళ్ళి, అక్కడ చాలాసేపు ఒంటరిగా కూర్చున్నాడు. ఆ సమయాన అతని మనస్థితి చాలా కొత్తది. నదీ, చీకటీ, ఆకాశాన మెరిసే నక్షత్రాలూ అతన్ని మొదటిసారిగా పరవశం చేశాయి. ప్రకృతి అతన్ని తనలోకి లాగేసుకుంటున్నట్టు కనిపించింది. ఎక్కడినుంచో పూలవాసన వస్తున్నది. అతని హృదయం అనిర్వచనీయమైన మాధుర్యంతో నిండిపోయింది. తానిలా ఎందుకైపోయినదీ అతనికే అర్థంకాలేదు.

అతను ఇంటికి రాగానే ఆనందమయి, "ఇంత ఆలస్యమయిందేమిటి బాబూ! వంటంతా చల్లగా అయిపోయింది గద!" అన్నది.

"ఏమోనమ్మా నదీతీరాన చాలాసేపు కూర్చున్నాను," అన్నాడు గోరా. అతను ఒంటరిగానే కూర్చున్నాడని తెలిశాక, ఆనందమయి మరింత ఆశ్చర్యపడింది. అతను భోజనంకూడా పరధ్యానంగానే చేశాడు. ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అతను, తాను ఆ సాయంకాలం పరేశబాబు ఇంటికి వినయుడివెంట వెళ్ళాననీ, పరేశబాబు కుమార్తెల పరిచయం చేసుకున్నాననీ, వాళ్ళకు ఘోషా లేదనీ చెప్పాడు. గోరా మాటలలో మామూలుగా ఉండే చురుకూ, కరుకూ లేకపోవటం ఆనందమయికి మరింత ఆశ్చర్యం కలిగించింది.

మర్నాడు ఉదయం అవినాశుడు వచ్చేసరికి గోరా ఎప్పటిలాగా తన కాలకృత్యాలు నిర్వర్తించి సిద్ధంగా లేడు. మరికొందరి విద్యార్థులతో అవినాశుడు రావటం కంటపడేసరికి అతను తనను తాను నిందించుకుని, ఇంక ఎన్నటికీ పరేశబాబు గారింటికి పోరాదని నిశ్చయించుకున్నాడు; వీలయితే వినయుడికికూడా కొంతకాలం పాటు దూరంగా ఉంటా అనుకున్నాడు.

అందరూ కలిసి మాట్లాడుకుని గ్రాండ్‌ట్రంక్ రోడ్డువెంబడి కొన్నాళ్ళపాటు సంచారం చేసిరావాలని నిర్ణయించారు. ఎవరిదగ్గిరా డబ్బుండరాదు. దారిలో ఎవరేది పెడితే దానితో తృప్తిపడాలి. ఈ నిర్ణయంతో గోరాకు ఉత్సాహం తిరిగి వచ్చింది.

అతను భోజనం చేసి, కొన్ని బట్టలు మూటగట్టి, వీపున కట్టుకుని, తల్లివద్దకు వెళ్ళి, కొద్దిరోజులపాటు తిరిగివస్తానని చెప్పాడు. ఎక్కడికంటే తెలీదన్నాడు. ఆమె మాట్లాడకపోవటం చూసి, "నేను పారిపోవటం లేదమ్మా. మళ్ళీ వస్తాను," అన్నాడు.

"నీతో వినయుడుకూడా వస్తున్నాడా?" అని ఆనందమయి అడిగింది.

''లేదు వాడు నాకు రక్షకుడనా నీ ఉద్దేశం?'' అని అతను ఆమె కాళ్ళు తాకి వందనం చేసి వెళ్ళిపోయాడు.

అందుచేతనే ఆనందమయి వినయుడు చెప్పిన ప్రతి మాటా ఎంతో శ్రద్ధగా విన్నది. వినయుడు వెళ్ళిపోయాక ఆమె చాలాసేపు ఆ విషయమే ఆలోచించింది.

ఆ సాయంకాలం వినయుడు పరేశబాబు గారింటికి వెళుతూనే లలితను చూసి, "ఎరుపు యుద్ధ చిహ్నం – సంధిచిహ్నం తెలుపు,'' అంటూ తన ఉత్తరీయం చాటునుంచి తెల్లగన్నేరు పూలగుత్తి తీసి, "ఇవి నీ ఎర్ర గులాబీలంత అందంగా లేకపోయినా నువ్వు స్వీకరించవచ్చు." అన్నాడు.

"నా పువ్వు లేమిటి?'' అన్నది లలిత తెల్లమొహం వేసి

''సతీశబాబూ! ఎవరిపువ్వులు తెచ్చి ఎవరికిచ్చావు?" అని వినయుడు అడిగాడు.

"లలితక్క మీ కివ్వమన్నదిగా?'' అన్నాడు సతీశుడు.

"నీవంటి మొద్దును ఎక్కడా చూడలేదు. బొమ్మలకు బదులుగా నువ్వు పువ్వులిస్తానన లేదూ?'' అని లలిత అడిగింది, దేవురించిన మొహంతో.

"నిజమే. కాని అలా ఇవ్వమని నువేగా అన్నావు.' అన్నాడు సతీశుడు, విషయం బోధపడనట్టుగా.

"ఆ పువ్వులమాట ఏమైనాగానీ, ఇవి నా సంధిసమర్పణ. మన తగాదా దీనితో చెల్లు,'' అన్నాడు వినయుడు లలితతో

"మనం పోట్లాడిం దెప్పుడు? ఈ సంధి ఏమిటి?'' అన్నది లలిత.

"అయితే అంతా మిధ్యే నన్నమాట...పోట్లాటలేదు పువ్వులులేవు. సంధీలేదు! మెరిసేదంతా బంగారంకాదు; సరికదా, మొదలు మెరుపేలేదు! అయితే నాటకం గురించి ––"

"దాన్నిగురించి మీతో ఎవరు పోట్లాడారు? మిమ్మల్ని ఒప్పించటానికి నే నేమన్నా కుట్రచేశానా? మీకభ్యంతరం నిజంగా వుంటే, ఒకరడిగారని ఎందుకు ఒప్పుకోవాలి?"

వేషం వెయ్యటానికి తన మనస్సులో ఇంకా అభ్యంతరం ఉన్నట్టు భావించి లలిత శాంతించకుండా ఉన్నదని వినయుడు అపోహపడ్డాడు. అతన్ని వేషం వెయ్యవద్దని చెబుదామని ఆ ఉదయం లలిత అనుకుని ఉండింది. కాని అంతా తారుమారయింది – ఆసంగతి వినయు డెరగడు.

తనగదిలో కూర్చునిఉన్న సుచరితకు వినయుడిగొంతు వినిపించింది. గోరా కూడా వచ్చిఉంటాడా అని ఆమె అనుకున్నది. ఇంతలో లలిత వచ్చి, ''వినయ బాబు వచ్చాడు. నీతో మాట్లాడతాడేమో,'' అన్నది.

అతిధిమర్యాదలు జరపటానికి సుచరిత బయలుదేరుతూ, లలితనుకూడా రమ్మన్నది; కాని లలిత తరవాత వస్తానన్నది. సుచరిత ముందుగదిలోకి వచ్చి, వినయుడితో, "నాన్నగారు బయటికి వెళ్ళారు త్వరగానే వస్తారు. అమ్మ లావణ్యనూ, లీలనూ తీసుకుని రిహార్సలుకు వెళ్ళింది. మీరు వస్తే ఉండమని చెప్పమన్నది," అన్నది.

"ఈ నాటకంలో నీ కేమీ వేషం లేదా?"

"అందరూ నటిస్తే చూసే దెవరు?" ఆమె సాధారణంగా వినయుడితో గోరాను గురించి జాస్తిగా మాట్లాడలేదు. ఇవాళ ఆమెకు గోరాగురించి మాట్లాడబుద్ధి కాలేదు. వినయుడికి ఆ పేరెత్తటానికే సాహసం లేకపోయింది — ఆ ఇంట తనను గోరాఉగ్రహంగా జమకట్టేస్తున్నారు. అందుచేత ఇద్దరికీ సంభాషణ సాగలేదు.

ఇంతలో పానుబాబు వచ్చాడు. "ఇవాళ మీ గోరాబాబు రాలేదా?" అని వినయుణ్ణి అడిగాడు.

"ఏం, అతనితో పనున్నదా?" అన్నాడు వినయుడు చిరాకుగా.

"మీ రిద్దరూ కలిసే ఉంటారుగదా అని అడిగాను." అన్నాడు పానుబాబు

"అతను కలకత్తాలో లేడు."

"సంచారానికి వెళ్ళారేమో."

వినయుడు కోపోద్రేకంతో మౌనంగా ఉండిపోయాడు. పానుబాబు 'ఒక మాట' చెప్పాలని సుచరితతో అన్నాడు, "నా ఒంట్లో బాగా లేదు," అని సుచరిత తన గదిలోకి వెళ్ళి తలుపు మూసేసుకున్నది. ఆమె ఒంటరిగా కూర్చుని 'నా జీవితం ఎంత నిరర్థకంగా నడిచింది! ఇంతకాలమూ నమ్మినదంతా అనుమానంలో పడింది. నేను రోజూ చేస్తున్న పనుల కేమీ అర్థం లేదు,' అనుకున్నది. ఆమెకు ఒక దివ్యలోకపు తలవాకిట నిలబడి అందులోకి అడుగుపెట్టబోతున్నట్టు భావన కలిగింది. ఆమెగుండె దడదడలాడింది.

# 6

ప్రదర్శనంలో వినయు డొక ఇంగ్లీషుగేయం చదవవలసిఉంది. ప్రదర్శనం జరిగేలోపుగా అతనికి తగినంత శిక్షణ ఇస్తామని వరద మాట ఇచ్చింది. అందుకు గాను ఇంగ్లీషులో నిపుణులైనవారిని కూడా తెచ్చింది. కాని మొదటి రిహార్సలులోనే వినయు డా గేయాన్ని పఠించిన పద్ధతి చూసి నిపుణులు నివ్వెరపోయారు. అత నంతబాగా చదువుతాడని ఎవరూ అనుకోలేదు. ఒక్క లలితకుమాత్రం ఇది

చూసి ఏదో అసంతృప్తి కలిగింది. అలా ఎందుకు జరగాలో ఆమెకే అర్థంకాలేదు. ఆమె నాటకంలో తాను పాల్గొనననికూడా చెప్పేసింది. కారణ మేమి టని పరేశబాబు అడిగితే, తనకు చెయ్యటం చేతకా దన్నది.

''సరిగా చెయ్యలేకపోతే అది నీతప్పుకాదు. కాని చేస్తానని మాటఇచ్చి చెయ్యక పోవటం నీ తప్పవుతుంది.'' అని బోధించి పరేశబాబు లలితను పాత్రధారణకు ఒప్పించాడు. లలిత ఒప్పుకోవటమేగాక రిహార్సల్‌లో చాలాబాగాకూడా చేసింది. అంతటితో వినయుడికీ, లలితకూ మధ్య అడ్డుగోడగా ఉన్న దేదో తొలగిపోయిన ట్టయింది. తనపట్ల లలిత ప్రవర్తనలో కలిగిన మార్పు గ్రహించి వినయు డొక పెద్దనిట్టూర్పు విడిచాడు.

ఇంట్లో అందరూ నాటకం హడావుడిలో మునిగి తేలుతున్నప్పటికీ, సుచరిత ఎవరితోనూ కలవక, ఏమీ కల్పించుకోక, పెడపెడగా ఉంటూ వచ్చింది. లలిత పరేశబాబుచేత చెప్పించి, సుచరితనుకూడా ఉద్యమంలోకి లాగింది. అందుచేత వినయుడికి ఆమెతో వెనకటిలాగా మాట్లాడే అవకాశం లభించింది. కాని ఆమె ఇప్పుడు తనకు చాలా దూరంగా ఉన్నదని అతను గ్రహించాడు. అయినా అందు వల్ల అతనికి కలగదగినంతబాధ కలగలేదు. త్వరలోనే సుచరిత అతనికి పూర్తిగా ఎడమైపోయింది.

గోరా ఎప్పుడు తిరిగివచ్చేదీ ఎవరికీ తెలియదు. కాని సుచరితమటుకు ఏ రోజు కారోజు, అతను ఇవాళే తిరిగిరావచ్చు అనుకోసాగింది. ఇందువల్ల ఆమెకు ఆందోళనకూడా కలిగింది. కాని ఆ ఆలోచనమాత్రం ఎంత యత్నించినా మనసులోకి రాకుండా ఉండటంలేదు.

ఒకనాడు పానుబాబు తన పెళ్ళి నిశ్చితార్థం జరగటం తనకూ, సుచరితకూ కూడా మంచి దని పరేశబాబుతో అన్నాడు. పరేశబాబు సుచరితను మళ్ళీ అడిగితే, ఆమె తడుముకోకుండా ఒప్పుకున్నది. అలాగైనా తన మానసిక ఆందోళన సమసి పోతుందని ఆమె ఆశ.

ప్రదర్శనం జరిగిన వెంటనే నిశ్చితార్థం జరపటానికి నిశ్చయం జరిగింది.

సుచరిత పానుబాబు భార్యకావటానికి తగిన శిక్షణ పొందటానికి తీర్మానించు కుని, అతని సంపాదకత్వంకింద వెలువడే పత్రిక శ్రద్ధగా చదవసాగింది. కాని అడుగులోనే హంసపాదులాగా ఆమె కా పత్రికలో ఒక వ్యాసం తగిలింది. అది గోరా అభిప్రాయాలను అధిక్షేపించటానికి రచించిన వ్యాసం. అందులో గల వాదన సుచరితకు అసమ్మతమైనది కాదు. కాని వ్యాసం రచించిన ధోరణి చూసి

ఆమెకు పట్టరాని ఆగ్రహం వచ్చింది. అందులో కసీ, ఒక మనిషిని నొప్పించా లన్న దుర్బుద్ధీ ఉట్టిపడుతున్నాయి. ఆమె ఆ పత్రికను నేలకేసి కొట్టి, "గౌర మోహనబాబు ఈ వ్యాసాన్ని పిండికొట్టెయ్యగలడు!'' అనుకున్నది. తన మనసు పానుబాబుకు వ్యతిరేకం కావటం అంత మంచిది కాదని, దాన్ని అతనికి సుము ఖంగా ఉంచటాని కామె ప్రయత్నించసాగింది...

వినయుడు శశిని పెళ్ళాడటానికి ఒప్పుకునేటప్పుడు తనకూ గోరాకూ ఉన్న మైత్రిని గురించి మాత్రమే ఆలోచించాడు గాని ఇతర సంబంధా లెలా మారేదీ ఆలోచించలేదు. అతను ఒకనాడు ఆనందమయిదగ్గిరకి వచ్చేసరికి, ఆమె పక్కనే కూర్చుని పోకలు కత్తిరిస్తున్న శశి చివాలున లేచి, సిగ్గుతో పారిపోయింది. తనతో ఎప్పుడూ అమిత చనువుగా ఉండే శశి ఇలా మారటం చూసి వినయుడు బాధపడి, తన వైవాహిక జీవితం ఎలా ఉండబోయేదీ ఊహించుకుని, దీనికంతకూ కారకు డైన గోరాపై కోపం తెచ్చుకున్నాడు.

ఆనందమయి అతని మనస్థితి అర్థం చేసుకోగలిగింది. గోరానుంచి ఉత్తరం వచ్చిందని ఆమె చెప్పేసరికి, గోరా ఏం రాశాడని వినయు డడిగాడు.

''తన విషయం ఏమీలేదు. దేశంలో ఉండే పేదలు పడే కష్టాలనుగురించి తెగరాశాడు. అదేదో గ్రామంలో మేస్ట్రీటు నానా దురాగతాలూ చేస్తున్నాట్ట" అన్నది ఆనందమయి.

"ఇతరుల తప్పు లెన్నటం తప్ప గోరాకు మరేపనీలేదు. సంఘంలో ఉండే సవాలక్ష దురన్యాయా లన్నిటినీ క్షమించగలడు, సమర్థించనూ గలడు," అన్నాడు వినయుడు.

ఆనందమయి నవ్వటం చూసి అతను, ''నీకు నవ్వొగా ఉంటుంది. ఆమధ్య సుధీరుడివెంట రైలుప్రయాణం చేశాను. జోరున వాన కురుస్తున్నది. ఒక జంక్షన్లో ఒక బెంగాలీవాడు దొరల దుస్తులు ధరించి గొడుగు వేసుకుని వానలో నిల బడ్డాడు పిల్లవాణ్ణి చంకన పెట్టుకుని రైలు దిగిన అతని భార్య వానలో తడిసి ముద్ద అవుతూ నిలబడింది. బెంగాలీస్త్రీ, ధనికురా లయేది, దరిద్రురా లయేది, ఎండ కెండి వానకు తడవవలిసిందే. ఆ దృశ్యం చూసిన క్షణంనుంచీ, మనవాళ్ళు స్త్రీలను గౌరవిస్తారనే అబద్ధం నానోట ఉచ్చరించనని ఒట్టుపెట్టుకున్నాను,'' అన్నాడు.

అతను వెళ్ళాక ఆనందమయి మహిముణ్ణి పిలిచి, "వినయుడికీ శశికీ పెళ్ళి జరగదు," అని చెప్పేసింది.

"గోరా ఒప్పుకున్నాడు, వినయు డొప్పుకున్నాడు; ఇప్పుడు నువ్వు అభ్యంతరము చెబుతావా ఏం?" అన్నాడు మహిముడు.

"అవును, ఇది జరిగే పెళ్ళికాదు. లేకపోతే నే నభ్యంతరం చెబుతానా?" అన్నది ఆనందమయి.

"సరే, గోరాను తిరిగి రానియ్యి, చూద్దాం," అన్నాడు మహిముడు...

## 7

గోరా బయలుదేరినప్పుడతనివెంట నలుగురున్నారు—అవినాశుడూ, మోతీలాలూ వసంతుడూ, రమాపతీ. కాని గోరాను అనుసరించటం వారికి చాలా కష్టమనిపించింది. అతనితోబాటు నిష్టూరపడలేక, ఒంట్లో బాగాలేదని వంకపెట్టి, అవినాశుడూ, వసంతుడూ కలకత్తాకు త్వరలోనే తిరిగివచ్చారు. కేవలమూ గోరాపట్ల గల భక్తితో మోతీలాలూ, రమాపతీ అతనివెంట ఉండిపోయారు. గోరాకు విసుగూ, అలుపూ కూడా లేనట్టు కనిపించాడు. ఎంత అసౌకర్యంగా ఉన్న ఇళ్ళలోనైనా ఇంటివాళ్ళు కోరినంతకాలం అతనూ ఉండిపోతూవచ్చాడు.

కలకత్తా నాగరిక జీవితం విడిచిపెట్టి అతను మొట్టమొదటిసారిగా దేశపరిస్థితులు చూస్తున్నాడు. సముద్రమంత విస్తృతిగల భారతీయ గ్రామీణ జీవితం ఎంత సంకుచితంగా, ఎంత దుర్బలంగా, ఎంత ఛిన్నాభిన్నంగా ఉన్నదీ అతని కిప్పుడు తెలిసివచ్చింది. గ్రామస్థులు అతని చుట్టూ మూగి, దేశాన్నిగురించి అత డిచ్చే ఉపన్యాసాలు విసుగులేకుండా విన్నారు. కాని వారు ఖైదులాంటి జీవితం జీవిస్తున్నారు. వారి అజ్ఞానం అగాధం. వాళ్ళు ఎలాంటి తుచ్ఛమైన మూఢ విశ్వాసాన్నీ అధిగమించలేదు. ఎంత అల్పమైన ఆచారాన్నీ విడిచిపెట్టలేదు. వాళ్ళ జీవితాలు ఎంత అల్పమైనవో, వారి దృష్టి ఎంత దుర్బలమైనదో ప్రత్యక్షంగా చూడకపోతే గోరా తెలుసుకుని ఉండేవాడుకాదు.

అతనుండగా ఒక గ్రామంలో ఇళ్ళంటుకున్నాయి. మంటలార్పటానికి తగిన శిక్షణకూడా గ్రామస్థులకులేదు. సమిష్టి చర్యలూ, సక్రమ ప్రయత్నమూ లేదు. కొందరు లబోమని ఏడిచారు. కొందరటూ ఇటూ పరిగెత్తారు. అంతా గందరగోళమైపోయింది. దగ్గరలో ఎక్కడా జలాశయమున్నది లేదు. దాన్ని ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్థులు ప్రయత్నించలేదు. ఏటా ఇళ్ళు తగలబడుతూనే ఉన్నాయి. కాని వాళ్ళ ప్రాణాంతకం విధిలిఖితం: దాన్నిగురించి చేసేదేమీ లేదు!

ఈ పరిస్థితి చూసి గోరా, "వీళ్ళకు నేను దేశంగురించి ఉపన్యసించట మేమిటి? వాళ్ళ నిత్యజీవితావసరాల విషయంలోకూడా గుడ్డినమ్మకాలపైన ఆధారపడు

తున్నారే!" అనుకున్నాడు. ప్రజల పరిస్థితి ఎంతన్నా ఆశ్చర్య పరిచినట్లుగా మోతీలాలునూ, రమాపతినీ ఆశ్చర్యపరచలేదు. "పేదవాళ్ళలాగే జీవిస్తారు మనకు కష్టాలనిపించేవి వాళ్ళకు కష్టాలుగా తోచవు," అన్నారు వాళ్ళు.

ఎవరికో జబ్బుగా ఉన్నట్టు తెలిసి మోతీలాలు వెళ్ళిపోయాడు. రమాపతి ఒక్కడే గోరావెంట మిగిలాడు. వాళ్ళిద్దరూ కలిసి, ఒక నదిఒడ్డున వున్న మహమ్మదీయ గ్రామం చేరారు. ఆ గ్రామంలో వారికి ఆతిథ్యం ఇవ్వగల హిందువుడు ఒక్క మంగలిమాత్రమే ఉన్నాడు. హిందువుడివై ఉండి, ఈ తురకకుర్రాణ్ణి ఇంట్లో పెట్టుకున్నావేమని గోరా అడిగితే, "తేడా ఏమిటి బాబూ? మనం హరీ అంటే వాళ్ళు అల్లా అంటారు. అంతేగా?" అన్నాడు మంగలివాడు.

ఎండ మండిపోతున్నది. రమాపతికి నోరెండిపోతున్నది. కాని తాగటానికి నీళ్ళు లేవు. మంగలివాడింట చిన్న నుయ్యి ఉన్నదిగాని, ఆ అపవిత్రజలం ఎలాతాగటం?

మహమ్మదీయబాలుడివిషయం మంగలినుంచి గోరా తెలుసుకున్నాడు. అక్కడి ఎస్టేటును నీలిమందు ఫాక్టరీవాళ్ళు గుత్తకు తీసుకుని, నదీతీరాన పొలాలు చేసుకునే రైతులతో తగాదాలలోకి దిగారు. వాళ్ళు రైతులందరినీ తొలగించగలిగారు గాని, ఘోషపూరా రైతులు లొంగిరాలేదు. వారందరూ మహమ్మదీయులు. ఫరూసర్దారు వాళ్ళ నాయకుడు, భయమన్నది ఎరగడు. అతను ఫాక్టరీ యజమానుల మూలంగా రెండు సార్లు జైలుకు వెళ్ళి, తిండిలేక మాడేదశకుకూడా వచ్చాడుగాని లొంగలేదు. ఈయేడు ఈ రైతులు పండించిన పొలాలను ఎస్టేటుదార్లు దౌర్జన్యంగా వశపరచుకుని ఫలసాయం పట్టుకుపోయారు. ఫరూసర్దారు ఒక 'దొర'ను చెయ్యి విరగ గొట్టేశాడు. అందుకు శిక్షగా పోలీసులు రైతులకొంపలన్నీ తగలబెట్టేశారు. ఫరూ ఇంట తిండిలేదు. అతని భార్యకున్న ఒక్క కోకా బయటికిరావటానికి పనికిరానిస్థితిలో ఉంది. మంగలిభార్యను వాళ్ళబ్బాయి తమీజ్ పిన్నీ అని పిలుస్తుండేవాడు. వాడు తిండికి మాడటం చూడలేక, వాణ్ణి ఆమె తమఇంటికి తెచ్చింది.

నీలిమందు ఫాక్టరీ అక్కడికి రెండుమూడు మైళ్ళలో ఉన్నది. పోలీసుదళం కూడా అక్కడే ఉన్నది. వాళ్ళు ఎప్పుడు వచ్చిపడి ఏంచేస్తారో తెలీదు. ఆ కిందటి రోజునే వాళ్ళు నజీమ్ అనేవాడి ఇల్లు శోధించి, చుట్టపుచూపుగా వచ్చిన అతని బావ మరిదిని చావగొట్టారు. అదివరకు ఇలాంటిపనులు చేసే సాహసం పోలీసులకుండేది కాదు. ఇప్పుడు దృఢకాయులంతా అరెస్టుకావటాన వాళ్ళు బాగా విజృంభించారు.

మంగలి చెప్పేది ఎంత విన్నా గోరాకు ఇంకా వినాలనే ఉన్నది. రమాపతి మాత్రం దాహంతో తహతహలాడిపోతూ, "హిందువుల ఇల్లు ఎంతదూరంలో

ఉంటుంది?" అని అడిగాడు.



రెండు మూడు మైళ్ళ దూరాన ఫాక్టరీఆవరణలో మాధవచటర్జీ ఇల్లున్నదని మంగలి చెప్పాడు. ఈ మాధవచటర్జీ తియ్యటి మాటలతోగొంతులు కోసే రకమనీ, ఇన్నాళ్ళూ పోలీసు ఇనస్పెక్టరు కాయన మనుగుడుపులు చేస్తున్నాడనీ, దాని కయ్యే ఖర్చంతా తమలాటివాళ్ళదగ్గిర రాబడుతున్నాడనీ మంగలి గోరాకు తెలిపాడు.

రమాపతికి ఆ చటర్జీ ఇంటికి వెళ్ళాలనున్నది. గోరా అతని మాట వినిపించుకోక, మంగలితో, "మీ రివన్నీ ఎందుకు సహిస్తారు? ఇంకెక్కడికైనా పోరాదా?" అన్నాడు.

"నే నిక్కడే పుట్టి పెరిగాను. ఇక్కడ అందరూ నాకు అయినవాళ్ళే: నాకు పెళ్ళామూ పుట్రా లేదు గనక ఫాక్టరీవాళ్ళు నా జోలికిరారు. గ్రామంలో ఇప్పుడు నేను తప్ప చెప్పుకోతగ్గ మగాడులేడు. నేను పోయానంటే ఆడవాళ్ళు భయపడి చస్తారు," అన్నాడు మంగలి.

ఇంతా విన్నాక రమాపతికి, అకారణంగా కష్టాలు తెచ్చుకున్నారని రైతులపైన ఆగ్రహం వచ్చింది. బలవంతులతో విరోధం మూర్ఖత్వం. వాళ్ళ కంతే కావాలి. రమాపతికి 'దొరల'మీదనే సానుభూతి కలిగింది.

కాలే ఇసకలో, నెత్తి ఎండకు మాడుతూ, నడిచి వెళ్ళేటప్పుడు గోరా నోట మాటలేదు. తీరా ఫాక్టరీ సమీపానికి వచ్చాక అతను, "రమాపతీ, నువు వెళ్ళి ఏదైనా తిను; నేను మంగలిదగ్గరికి తిరిగి వెళ్ళాలి," అన్నాడు.

"అదేమిటి? ఈ బ్రాహ్మణకొంపలో భోంచేద్దాం," అన్నాడు రమాపతి.

"నన్ను గురించి విచారించకు. నువు భోంచేసి కలకత్తా వెళ్ళిపో. నేను ఘోష్పారా గ్రామంలో కొన్నాళ్ళుంటాను. అది నీ వల్లకాదు," అన్నాడు గోరా.

తిరిగి పోతున్న గోరాను చూసి రమాపతికి ముచ్చెమటలు పోశాయి. గోరాకు మతి చెడిందేమో ననుకున్నా డతను.

ఆకలిదప్పులు గోరానుకూడా దహిస్తూనే ఉన్నాయి. అయితే మాధవచటర్జీలాటి

నీచుడి ఇంట ఎంగిలిపడటం అతనికి దుర్భర మనిపించింది. గోరా మళ్ళీ రావటం చూసి మంగలి ఆశ్చర్యపోయాడు. అతను గోరాకు వంటచేసుకునే ఏర్పాట్లు చేసి పెట్టాడు. "నీ ఇంట కొంతకాలం ఉంటాను," అన్నాడు గోరా మంగలితో. అందువల్ల గోరాకు పోలీసులతో ఇబ్బంది కలగవచ్చునన్నాడు మంగలి. "ఇంత వరకూ పోలీసులను తప్పించుకున్నాను. కాని వాళ్ళ చూపు నాపైన పడిందంటే నేను వెళ్ళిపోవలసివస్తుంది. ఆ తరవాత గ్రామం నాశనమవుతుంది. నా మాట వినండి బాబూ!" అన్నాడతను.

పట్నవాసానికి అలవాటుపడ్డ గోరాకు మంగలిభయం పిరికితనంలా కనబడింది. ఆ పనికిమాలినవాడి ఇంట భోజనం చేసినందుకూ గూడా అతను పశ్చాత్తాపపడి, ఆ సాయంకాలం ఫాక్టరీ ఆఫీసుకు వెళ్ళాడు. అప్పటికే రఘుపతి కలకత్తాకు బయలు దేరి వెళ్ళిపోయాడు.

మాధవచటర్జీ గోరాకు చాలా మర్యాద చేసి తన ఆతిథ్యం స్వీకరించమన్నాడు.

"నీ యింట పచ్చి మంచినీళ్ళుకూడా ముట్టను." అన్నాడు గోరా ఆవేశంతో. అతను కూర్చోనైనా కూర్చోకుండానే మాధవచటర్జీ గొడవగాలు ఏకరువుపెట్టాడు. పోలీసు ఇనస్పెక్టరు అక్కడే చేరగిలబడి హుక్కా తాగుతున్నాడు. అతను గోరాతో, "అసలు నువ్వెవడవు? ఎక్కడినుంచి ఊడిపడ్డావు?" అని అడిగాడు.


"ఓహో, ఇనస్పెక్టరా? ఘోషపారాలో తమరు చేసిన చర్యలన్నీ విన్నాను. ఇప్పటికైనా తమ ధోరణి మార్చుకోకపోతే—"

"మమ్మల్నందర్నీ ఉరి తీయిస్తావు కాబోలు, ఏం? మా ప్రాణానికి మంచి రాలుగాయ దాపరించాడే. సార్జెంట్, ఇలారా!" అన్నాడు ఇనస్పెక్టరు.

"తొందర పడకండి, ఇనస్పెక్టరుగారూ! పెద్దమనిషిని అవమానించకండి. ఆయన అన్నదాన్లో అబద్ధ మేముందీ? ఉన్నమాటకు ఉలుకెందుకూ? నా కర్మకాలి, నే నీ ఫాక్టరీవాళ్ళ తొత్తునయ్యాను. మనం ఎలాగో జీవయాత్ర గడపాలిగదా," అన్నాడు మాధవుడు.

"చూడండి, బాబూ! మే మిక్కడ ఉన్నది సర్కారు ఉత్తరువులు పాలించటానికి. ఇందులో మీరు జోక్యం కలిగించుకుంటే చిక్కుల్లో పడిపోగలరు, చెబుతున్నాను," అన్నాడు పోలీసుఅధికారి గోరాతో.

గోరా నూరుమాటాడకుండా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. మాధవచటర్జీ అతని వెంటబడి భోజనం చెయ్యమనీ, కనీసం లాంతరుతో సేవకుణ్ణి వెంట పంపుతాననీ ప్రాధేయపడ్డాడు. కాని గోరా జవా బియ్యలేదు.



మాధవుడు ఇనస్పెక్టరు వద్దకు తిరిగివచ్చి, 'అరే, భాయీ! ఇతను మనమీద తప్పక ఏదో రిపోర్టిస్తాడు. నువు ముందుగానే మేస్రీటు దగ్గిరికి ఎవరినన్నా పంపి, నీ కేసులోని సాక్ష్యాలతో ఎవరో ఒక బాబు జోక్యం కలిగించుకుంటున్నట్టు చెయ్యి." అని హెచ్చరించాడు.

## 8

వేడుకలు ఆరంభమయాయి. కలకత్తానుంచి పరేశబాబుభార్యా, కూతుళ్ళూ, సుచరితా, హానుబాబూ, వినయుడూ మేస్రీటు బ్రౌన్‌లో ఉండేచోటికి వచ్చేశారు. పరేశబాబుమాత్రం రాలేదు. వచ్చినవారంతా సర్కారు బంగళాలో బస చేశారు.

ఒకనాటి సాయంకాలం బ్రౌన్‌లో హానుబాబు వెంట నదీతీరాన వాహ్యాళి చేస్తూండగా గోరా ఆకస్మికంగా ప్రత్యక్షమై, "గుడీవెనింగ్ సర్," అన్నాడు. హానుబాబు అతన్ని ఎరిగనట్టే నటించాడు. గోరా భారీ విగ్రహమూ, తెల్లని తెలుపూ ముతకబట్టలూ చూసి మేస్ట్రీటు ఆశ్చర్యపోయాడు ఆయనకు గోరా అపరిచితుడు.

''నేను ఘోషపారానుంచి వస్తున్నాను,'' అన్నాడు గోరా.

మేస్ట్రీటు చిన్నగా ఈలవేశాడు ఘోషపారా విచారణలలో ఎవడో జోక్యం కలిగించుకుంటున్నాడని కిందటిరోజే ఆయనకు తెలియవచ్చింది. ఈ మనిషేనన్న మాట! మేస్రీటు ప్రశ్నలకు సమాధానంగా గోరా, తానొక బెంగాలీ బ్రాహ్మణ్ణనీ, తనకే పత్రికతోనూ సంబంధం లేదనీ అన్నాడు.

''అయితే ఘోషపారా కెందుకు వెళ్ళావ్?"

"సంచారం చేస్తూ అక్కడ పోలీసు అత్యాచారాల నిదర్శనలు చూశాను. అవి ఆగేటటులేవు. మీ రేదైనా చక్రం అడ్డేస్తారేమోనని వచ్చాను.''

''ఘోషపారావాళ్ళు పరమదుర్మార్గులని తెలుసా?''

"వాళ్ళు దుర్మార్గులుకారు. భయంలేనివారు, అన్యాయాన్ని సహించలేనివారు."

ఈ మాటలు విని మేస్రీటుకు ఆగ్రహం వచ్చింది. నీ కక్కడి పరిస్థితు లేమీ

తెలియవని ఆయన గోరాతో అన్నాడు. నాకు తెలిసినంతకూడా నీకు తెలీదని గోరా అన్నాడు. మేజిస్ట్రేటు బెదిరించాడు.

"మీవల్ల న్యాయం జరిగేటట్టులేదు. నేను ఘోస్పారాకు తిరిగిపోయి పోలీసులను ప్రతిఘటించమని అక్కడివాళ్ళను ప్రోత్సహిస్తాను." అని చెప్పి గోరా వెళ్ళిపోయాడు.

అక్కడినుంచి అతను తిన్నగా సాత్కడి హాల్దార్ అనే పేరుబడ్డ లాయరు వద్దకు వెళ్ళాడు. మిగిలిన వాళ్ళను భయపెట్టటానికిగాను 47 మందిని విచారణ లేకుండా ఖైదులో ఉంచారు. వారిలో పధ్నాలుగేళ్ళవాళ్ళూ, 80 ఏళ్ళవాళ్ళూ కూడా ఉన్నారు.

సాత్కడి గోరా సహాధ్యాయే నని తేలింది. అతను గోరాను చాలా కాలానికి చూసి సంతోషించాడుగాని, సహాయం చెయ్యలేకపోయాడు జైలులో ఉన్న సలభై ఏడుగురిని జామీనుమీద విడిపించాలని గోరా ఉద్దేశం. మేజిస్ట్రేటుకోర్టులో జామీను దరఖాస్తు పడేసే సమయంలో గోరా ముఖం కనిపించగానే మేజిస్ట్రేటు దరఖాస్తును నిరాకరించాడు.

గోరా కేసు నడప నిశ్చయించి సాత్కాడీని తన లాయరుగా పని చెయ్యమన్నాడు. సాత్కడి భయపడి, పెళ్ళామూ పిల్లలూ గలవాణ్ణన్నాడు. చెయ్యి విరగగొట్టుకున్న వాడు 'కౌర'. ప్రతి తెల్లవాడూ రాజవంశీయుడే. ఎంతహీనుడైన తెల్లవాడిమీద అత్యాచారం జరిగినా బ్రిటిషు ప్రభుత్వంమీద తిరుగుబాటే. ఉన్నపరిస్థితి అదీ.

గోరా కలకత్తా వెళ్ళి గట్టిలాయరును మాట్లాడ నిశ్చయించాడు. కాని దానికొక విఘ్నం వచ్చింది.

వేడుకల ఆఖరుదినంనాడు కలకత్తా విద్యార్థుల జట్టుకూ, స్థానిక విద్యార్థుల జట్టుకూమధ్య క్రికెట్ పోటీ ఏర్పాటయింది. కలకత్తా విద్యార్థులు తరిఫీదు పొందు తుండగా ఒక విద్యార్థికాలికి దెబ్బతగిలి గాయమయింది. మిగిలివాళ్ళు అతన్ని దగ్గరలోఉన్న చెరువుకు తీసుకుపోయి గాయానికి కట్టు కట్టటానికని గుడ్డను చెరువులో ముంచారు. వెంటనే ఒక పోలీసు ఎక్కడినుంచో ఊడిపడి, వాళ్ళను నానా బూతులూ తిట్టుతూ ఎడాపెడా బాద నారంభించాడు. ఆ చెరువును ఇతరు లంటుకోరా దని కలకత్తా విద్యార్థు లెరుగరు. వాళ్ళు ఈవిధమైన పోలీసు దౌర్జన్యాలకు అలవాటు పడ్డవాళ్ళుకూడా కారు అందుచేత వాళ్ళా పోలీసుకు తగినవిధంగా బుద్ధిచెప్పారు. అంతలో మరికొంపరు పోలీసు లక్కడికి పరిగెత్తుకుంటూ వచ్చారు. అదే సమయంలో గోరాకూడా అక్కడ తటస్థపడ్డాడు.

గోరాకు కలకత్తా విద్యార్థులు తెలుసును. అతను సహజంగా వారికి సహాయం వెళ్ళాడు. "జాగ్రత్త. ఆకుర్రాళ్ళజోలికి పోకండి," అని అతను పోలీసులను గదమాయించాడు. జనం పోగయారు. గోరా ప్రోత్సాహంతో విద్యార్థులు పోలీసులను చెదరగొట్టేశారు.

సాయంకాలం మూడు, నాలుగు గంటలవేళ వినయుడూ, పానుబాబూ, ఆడపిల్లలూ రిహార్సల్ చేస్తూండగా గోరా మరికొందరు విద్యార్థులతోబాటు అరెస్టయారనీ, రేపు మేజిస్ట్రేటుముందు విచారణ జరుగుతుందనీ తెలిసింది. ఈ వార్త విని పానుబాబు తప్ప అందరూ చకితులయారు.

హతాశుడై బంగళాకు తిరిగివచ్చిన వినయుడిద్వారా సుచరితకూ, పరేశబాబు భార్యకూ సంగతి తెలిసింది. తాను మేజిస్ట్రేటుభార్యతో మాట్లాడి గౌరమోహనబాబుకు సాయం చేస్తానన్నది పరేశబాబు భార్య. అలా చేస్తే గోరాకు చాలా కోపం వస్తుం దన్నాడు వినయుడు.

"అంతా పోజు," అనేశాడు, పానుబాబు అణచుకోలేక.

"ఏమీకాదు. గౌరబాబు ఉద్దేశమే సరయినది. మనం ప్లీడర్లకు డబ్బిచ్చుకోవలసి వస్తే మేజిస్ట్రేట్లకింతేసి జీతాలు దేనికి? ఇలాటి న్యాయంకన్న జైలే నయం," అన్నది లలిత.

"నీ కసలేమీ తెలీదు ఊరుకో," అని పానుబాబు లలితను మందలించి, క్రితం రోజు గోరాకూ మేజిస్ట్రేటుకూ మధ్యజరిగిన సన్నివేశం గురించీ, గోరాను మేజిస్ట్రేటు అన్నమాటలూ చెప్పాడు. అతను తక్కువబుద్ధికి సుచరిత చాలా ఏవగించుకున్నది.

ఆరోజే లెఫ్టినెంటు గవర్నరు వస్తున్నాడు. అందుచేత ఆరోజు విచారణలు చప్పున ముగించే ఉద్దేశంతో మేజిస్ట్రేటు టంచనుగా పదిన్నరికే కచేరికి వచ్చాడు. విద్యార్థుల పక్షాన వకీలుగా పనిచేసిన సాత్కడి విద్యార్థులది తప్పేననీ, అయితే వారి లేతవయసూ, అజ్ఞానమూ పరిగణించి క్షమించాలనీ వాదించాడు. మేజిస్ట్రేటు వారికి 5 మొదలు 25 బెత్తపు దెబ్బలదాకా శిక్షలు విధించి, గోరాకు మాత్రం ఒక నెల కఠినశిక్ష విధిస్తూ, తేలికలో పోనిచ్చా నన్నాడు.

శిక్ష లిచ్చేటప్పుడు వినయుడూ, సుధీరుడూ కోర్టులోనే ఉన్నారు. వినయుడు సుధీరుడితోబాటు బంగళాకు తిరిగివెళ్ళక కోర్టు ఆవరణలోనే ఒక చెట్టుకింద చతి కిలబడ్డాడు. మధ్యాన్నం దాటాక సుచరిత సుధీరుడివెంట బండిలో వచ్చి, అతన్ని బంగళాకు తీసుకుపోవలసివచ్చింది.

అతను వచ్చేసరికి బంగళాలో పెద్ద రభస సాగుతున్నది. లలిత అందరిపైనా

తిరగబడి, మేస్త్రీటును దుమ్మెత్తి పోస్తున్నది. ఆమె వినయుణ్ణి చూడగానే, "వినయబాబూ! మీరు మొదట ఈ నాటకానికి అభ్యంతరం చెప్పినప్పుడు నేను గ్రహించలేకపోయాను. ఈ మేస్త్రీటుగారి పరిపాలన మనకు దేవుడి ప్రసాదమని పానుబాబు అంటున్నారు. దాన్ని మనం దుమ్మెత్తి పొయ్యటంమటుకు దేవుడి ప్రసాదం కాదా?" అన్నది.

పానుబాబు ఆమెను మందలించబోతే, "నేను మీతో మాట్లాడటంలేదు...వినయ బాబూ! ఈరాత్రి ప్రదర్శనం జరగటానికి వీల్లేదు," అన్న దామె.

వారద వినయుణ్ణి స్నానంచేసి భోజనం చెయ్యమన్నది.

"మేస్త్రీటు అతిథిగా నే నీ ఇంట భోజనం చెయ్యలేను," అన్నాడు వినయుడు.

"అందరూ ఇలా అలిగి రాత్రికి ప్రదర్శనంలో పాల్గొనకపోతే, నేను వీళ్ళ ఎదట ఇక తలఎత్తుకు తిరగలేను," అన్నది వారద.

వినయుడు స్టీమరుమీద కలకత్తా వెళ్ళిపోతానని బయలుదేరాడు.

పానుబాబు వినయుణ్ణీ, గోరానూ కసికొద్దీ తిట్టాడు.

లలిత సుధీర్‌నూ, సుచరితనూ ప్రదర్శనంలో పాల్గొనవద్దని ప్రబోధించింది. సుధీరుడు అంతపని చెయ్యటానికి జంకాడు. అదీగాక అతనికి నౌరలముందు తన సామర్థ్యం ప్రదర్శించాలన్న కోరికకూడా ఉన్నది.

"నాన్నగారికి మాట ఇచ్చివచ్చాను నేను. ఎంత ఇష్టం లేకపోయినా నా విధి నెరవేరుస్తాను. ఈ రోజు నా జన్మలో మరుస్తా ననుకోకు," అన్నది సుచరిత.

తీరా స్టీమరు బయల్దేరబోయే సమయంలో దాని మీద ఉన్న వినయుడు, లలిత రావటమూ, స్టీమరును ఆఖరు క్షణంలో అందుకోవటమూ చూశాడు. అతనికి ఆశ్చర్యం వేసింది.

"నేను ఇంటిదగ్గిర చీటీ పెట్టివచ్చాను. వాళ్ళు దాన్ని చూసుకొని, నేను కలకత్తాకు వెళ్ళిపోయినట్టు తెలుసుకుంటారు," అన్నది లలిత. గోరాను గురించి అపోహపడినందు కామె వినయుడికి క్షమాపణ చెప్పుకుని, "అతను మీ కందరికీ కష్టమైన పనులు చెబుతాడనే అనుకున్నాను. కాని తానుకూడా కష్టాలకు గురికాగల డని నే నెరగను. అలాటివాడు మరొక డుండడు," అన్న దామె వినయుడితో.

గోరాకు జరిగిన అన్యాయానికి నిజమైన తిరస్కారం ప్రదర్శించినది తానూ, లలితామాత్రమే ననుకున్నాడు వినయుడు. ఆమె పట్ల అతని కొక నూతనభావం కలిగింది. అతని జీవితాకాశాన్ని మొట్టమొదటగా ప్రకాశింపజేసిన శుక్రతార సుచరిత. ఆ తార ఎప్పు డస్తమించినదీ అతనికి సరిగా తెలియదు. ఇప్పుడా



ఆకాశాన లలిత ప్రకాశిస్తున్నది. ఆమె అందరినీ పరిత్యజించి తనవద్దకు వచ్చిందన్న భావం అతన్ని ఆవేశించింది. ఆమె గదికి వెళ్ళి పడుకున్నాక కూడా అతను నిశ్శబ్దంగా బయట పహరా తిరిగాడు. ముత్యపు చిప్పలో ముత్యంలా ఆమె తన రక్షణలో సుఖంగా నిద్రిస్తున్నదన్న భావం అతనికి చాలా తృప్తి నిచ్చింది.

దానితో పాటు అతనికి ఆవేదన కలిగించే భావం కూడా ఒకటి అతని మనసును తొలిచింది. ఈ రాత్రి గోరా జైలులో నిద్రపోతున్నాడు. అతనికి జైలు ఒక కష్టం కింద జమకాదు. కాని గోరా జీవితంలో కలిగిన ఇలాటి సంఘటనలలో వినయుడి ప్రమేయం లేని మొదటి సంఘటన ఇదే తమ ఉమ్మడి జీవితంలో ఈ తెంపు. తిరిగి అతుక్కుంటుందా అని వినయుడు విచారించాడు.

తూర్పు తెవాల్లరుతుండగా లలిత నిద్ర లేచి తన కాబిన్ బయటికి వచ్చి, బయట బెంచీమీద శాలువ కప్పుకుని నిద్రపోతున్న వినయుణ్ణి చూసి, అతను తెల్లవార్లూ తనకు కాపలా కాశాడని తెలుసుకున్నది ఆమె హృదయమూ కళ్ళూకూడా చప్పున ఆర్ద్రమయాయి.

తరవాత, బాగా తెల్లవారి, ఇద్దరూ కలుసుకున్నప్పుడామె, "రాత్రి మీకు సరిగా నిద్రలేదు కాబోలు," అన్నది.

"రాత్రి నాకు సుఖంగానే గడిచింది," అన్నాడతను.

అంతటితో ఆ సంభాషణ అంతమయింది. కలకత్తా చేరగానే వినయుడు బండి మాట్లాడి, లలితను బండిలో ఎక్కించి, తాను బండివాడి పక్కన కూర్చుని పరేశబాబుగారింటికి వచ్చాడు.

లలిత లోపలికి వెళ్ళటానికి జంకుతున్నట్లు తోచి, అతను ఆమెను పరీక్షించ టానికి. "ఇక నేను పోనా?" అన్నాడు.

అతను తప్పు చేసినవాడిలాగా జారుకుండా మనుకుంటున్నాడనుకుని లలిత, "వద్దు, నాన్నగారిని చూద్దుగాని రండి." అన్నది.

కాని తీరా ఇద్దరూ లోపలికి వెళ్ళేసరికి పరేశబాబు ఇంటలేడు. ఒక కొత్త ఆవిడ—సుచరితా సతీశుల పెద్దమ్మ—వచ్చిఉన్నది. వినయుడు చప్పున ఆమెక అప్తుడైపోయి, ఆత్మీయంగా ఆమెతో మాట్లాడసాగాడు. ఎందుకో అది లలిత సహించలేకపోయింది. ఇతరులతో చనువుగా ఉండే విద్య ఆమెకురాదు. చూసి చూసి ఆమె వినయుడితో, "మీ రెవరికోసం ఎదురు చూస్తూ ఉండిపోయినట్టు? నాన్నగా రెంత సేపటికి వస్తారో తెలీదు మీరు గౌరమోహనబాబు తల్లిని చూడ బోవటం మంచిదికదా?" అన్నది.

వినయుడి మనస్సు కలుక్కుమన్నది. రాసింతే తనను లోపలికి తెచ్చిన లలితే ఈమాట అంటుందని అత సనుకోలేదు. అతని కలలన్నీ కరిగినట్టయింది. అతను వెళ్ళిపోగానే లలిత తన గదికి వెళ్ళిపోయి బావురుమని ఏడిచింది. ఆమె కదికూడా అలవాటే

వినయుడు చెప్పకముందే ఆనందమయికి గోరా సంగతి తెలిసింది. తనకు మర్నాడు జైలుశిక్ష పడవచ్చునని గోరా ఆమెకు ఉత్తరం రాశాడు. తనకు జైలు భయం లేదనీ, ఇది మంచి అనుభవమేననీ, తల్లిని దిగులుపడవద్దనీ అతను రాశాడు. ఆనందమయి తన హృదయంలో దాచుకున్న విచారం వినయుడి కర్థమయింది. కాని అత నేమీ చేయులేకపోయాడు.

పరేశబాబు ఇంటికి రాగానే లలిత కనిపించింది. ఏదో జరిగిందని ఆయన తెలుసుకున్నాడు. లలిత ఆయనతో తాను ప్రదర్శనలో పాల్గొనకుండా వినయుడి వెంట వచ్చేశాననీ, మేజిస్ట్రీటు గౌరమోహనబాబుకు జైలుశిక్ష విధించాడనీ, తన కక్కడ ఒక్కక్షణం ఉండబుద్ధి కాలేదనీ అన్నది. పరేశబాబు ఆమెను తప్పుపట్ట లేదు.

ఆ సాయంకాలం వినయుడు పరేశబాబును వారింటిబయట కలుసుకుని గోరా జైలుశిక్షగురించి మాట్లాడి, లోపలికి రాకుండనే వెళ్ళిపోయాడు.

మర్నాడు పరేశబాబు భార్యా, పిల్లలూ, హానుబాబూ మొదలైనవా రంతా దిగారు. పరేశబాబు భార్యా లలితను పలకరించనుకూడాలేదు. హానుబాబు తీవిగా పరేశబాబువద్దకు వెళ్ళి, "ఇది చాలా ఘోరం!" అన్నాడు.

''జరిగినదందా విన్నాను. దాన్నిగురించి వితర్కించి లాభం లేదనుకుంటాను,'' అన్నాడు పరేశబాబు.

"జరిగినది జరిగింది, నిజమేకాని, కాని అందుకు కారణభూతమైన మన స్త్రత్వ వికారం అలాగే ఉండిపోయింది. మీరు లలితకు చనువు జాస్తిగా ఇచ్చి చెడ గొట్టారు. అందువల్ల ఎంత అన్యాయం జరిగిందో మీ కింకా తెలీదు," అన్నాడు పానుబాబు,

లలిత తండ్రిని స్నానానికి పంపి, ఆయన కుర్చీలో కూర్చుని, పానుబాబు కేసి సూటిగా చూస్తూ, "ఈ ఇంట్లో ఎవరితోబడితే వారితో ఎలాపడితే అలా మాట్లాడే అధికారం మీ కున్నదనుకుంటున్నారులా గుంది. మా విషయంలో నాన్నగారి బాధ్యతలు ఆయనకన్న మీకే బాగా తెలుసునన్నమాట! మీరు బ్రహ్మసమాజాని కంతకీ హెడ్మాస్టరవుదామని చూస్తున్నారు! మీ ధాష్టికం చాలాకాలంగా సహించాం కాని మీరు నాన్నగారిపైన అజమాయిషీ చెయ్యజూస్తే ఈ ఇంట్లో నౌకర్లుకూడా సహించరని తెలుసుకోండి. ఇదే స్పష్టంగా మీకు చెప్పదలిచాను," అన్నది.

లలిత తనతో అలా మాట్లాడుతుందని పానుబాబు కలలోకూడా అనుకోలేదు. అతను సుచరితకేసి తిరిగి, ''సుచరితా, లలిత నన్నిలా అవమానిస్తే ఊరుకుం టావా?" అన్నాడు.

''ఆమె మిమ్మల్ని ఏమీ అవమానించలేదు. నాన్నగారికి తగిన గౌరవం చూప మంటున్నది. ఆయనకన్న గౌరవనీయు లున్నారని మే మెవరమూ అనుకోం. నా మాట నమ్మండి," అన్నది సుచరిత.

పరేశబాబు తిరిగివచ్చాడు. సతీశుడు సుచరితను 'పిన్ని' దగ్గిరికి తీసుకు పోయాడు. పానుబాబు పరేశబాబుతో తనకూ సుచరితకూ పెళ్ళిప్రధానం చెయ్య మన్నాడు.

"సుచరిత సరేనంటే నా కేమీ అభ్యంతరలేదు," అన్నాడు పరేశబాబు.

వినయుడు పరేశబాబుగారింటికి వెళ్ళలేక, తన గదిలోనూ ఉండలేక, ఆనంద మయివద్ద చేరి అక్కడే ఉండసాగాడు. అతను పరేశబాబు కుటుంబాన్ని తప్పుకు తిరుగుతున్నట్టు తోచి ఆనందమయి, ''వినూ! పరేశబాబుగారింట అంతా బాగానే ఉందిగద?" అని అడిగింది. వినయుడు తుళ్ళిపడి, అందరూ బాగానే ఉన్నారన్నాడు.

"నాడు వారి అమ్మాయిలను చూడాలనిఉన్నది. గోరాకు మొదట వాళ్ళంటే పడేదికాదు. చివరకు వాళ్ళు అతన్ని జయించారు. వాళ్ళు మామూలు మనుషులు మటుకు కారు,'' అన్న దామె.

వినయుడు ఇంతకాలమూ తనమనస్సులో దాచుకున్న విషయాలన్నీ ఆనంద మయికి చెప్పేశాడు.

ఇంతలో మహిముడు తిరిగి వినయుణ్ణి, "శశిని ఎప్పుడు పెళ్ళాడుతున్నావు? లేనిపోని అభ్యంతరాలు పెట్టకు," అని హెచ్చరించాడు.

"వినయుడు శశిని ఇంతప్పటినుంచీ ఎరుగును; ఎలా పెళ్ళాడతాడు?" అన్నది ఆనందమయి.

"ఆమాట ముందే ఎందుకుచెప్పలేదు?" అన్నాడు మహిముడు.

"ఎవరిమనసు వాళ్ళకు అంతసులువుగా తెలుస్తుందా? ఎందుకలా హైరాన పడ్తావు? పెళ్ళికొడుకులకు కరువా? తగినవరుణ్ణి చూసి ముడిపెట్టవచ్చు." అన్నది ఆనందమయి.

ను విలా అడ్డుపుల్ల వెయ్యకపోతే వినయుడు ఒప్పుకునిఉండును," అన్నాడు మహిముడు.

"అది నిజమే. కాని అందువల్ల నష్టమే గలిగేది."

సవతితల్లి అన్నాక ఇలాగే ప్రవర్తిస్తుంది లెమ్మనుకున్నాడు మహిముడు.

ఒకనాడు పరేశబాబువెంట సుచరితా, లలితా ఆనందమయిని చూడవచ్చారు. పరేశబాబు కిందిఅంతస్తులో కృష్ణదయాళుడితో మాట్లాడుతూ ఉండిపోయాడు. ఆడపిల్లలుమాత్రం ఆనందమయీ, వినయుడూ ఉన్న పైఅంతస్తుకు వచ్చారు.

వాళ్లు ఆనందమయి కాళ్ళకు వందనం చేసి తమను తాము ఆనందమయికి పరిచయం చేసుకున్నారు. లలిత వినయుణ్ణి చూడనట్టు నటించింది. కాని సుచరిత అతన్ని పలకరించింది.

ఆనందమయి వాళ్ళపట్ల చాలా ఆప్యాయత చూపింది. "నేను మిమ్మల్ని చూడ లేదన్నమాటేగాని, మిమ్మల్ని నావాళ్ళగానే తలుచుకుంటూ ఉంటాను," అన్నదామె.

సుచరిత వినయుణ్ణి, "చాలా గాజులై మమ్మల్ని చూడరావటం లేదేం?" అని అడిగింది.

వినయుడు లలితకేసి చూస్తూ," అతిరో మీ ఆతిధ్యం స్వీకరించి, మిమ్మల్ని విసుగెత్తించటం ఇష్టంలేక," అన్నాడు.

"అభిమానం ఉన్నచోట అడిగి చేయించుకోవచ్చునని మీకు తెలీదా?" అన్నది సుచరిత.

''ఆ మాట వాడికి చెప్పాలా, తల్లీ. అది కావాలి, ఇది కావాలి అని నన్ను అస్తమానమూ చంపుకుతింటాడు. క్షణంసేపు ఊపిరితీసుకోనివ్వడు," అన్నది ఆనందమయి.

''అవునమ్మా, నీ ఓర్పు పరీక్షించేటందుకు దేవుడు నన్ను సాధనంగా ఏర్పాటు చేశాడు," అన్నాడు వినయుడు.

సుచరిత లలితను మోచేత్తో పొడిచి, "విన్నావా, లలితా ? నీకూ కూడా పరీక్ష జరిగి, అందులో నువు ఓడిపోలేదు గద ?'' అన్నది.

ఆనందమయి, ''ఈ సారి వినూ తనను తానే పరీక్షకు పెట్టుకుంటున్నాడులే. మీరంటే వాడి కెంత ఇష్టమో మీకు తెలీదు,'' అంటూ లలితకేసి చూసింది. లలిత ముఖం జేవురించింది.

''వినయబాబు మా పట్ల ఎంతో స్నేహవాత్సల్యం చూపుతున్నారు. అది మా గొప్పతనం కాదు, ఆయన సౌహార్దమే,'' అన్నది సుచరిత.

ఆ మాట నిజం కాదనీ, వినయుడి కెంతమందో ఎరిగినవా ళ్ళున్నా గోరాతప్ప స్నేహితుడే లేడనీ, పరేశబాబు కూతుళ్ళ పరిచయంతో ఎవరికీ అందకుండా పోయాడనీ ఆనందమయి అన్నది. వినయు డీ సంభాషణమూలంగా బాధపడటం చూసి సుచరిత అతనితో పరేశబాబు కిందఉన్న సంగతి చెప్పి పంపేసింది. -

తరవాత ఆనందమయి వాళ్ళను గోరా ఉత్తరం ఇచ్చి చదవమన్నది. వాళ్ళకు గోరా గురించీ, ఆనందమయి గురించీ చాలా గొప్ప అభిప్రాయం ఏర్పడింది.

ఆరోజు పరేశబాబు సుచరితనూ, లలితనూ వెంటబెట్టుకుని ఆనందమయిని చూడరావటానికి ప్రేరేపకురాలు లలితే. ఆమె రోజూ వినయుడికోసం ఎదురు చూస్తూ ముళ్ళమీద ఉండింది. ఆమె ఆవేదన నానాటికీ రెచ్చిపోయింది. తాను వినయుణ్ణి ప్రేమిస్తున్నది. కాని శిష్టాచార కుటుంబానికి చెందిన వినయుడు తనను పెళ్ళాడుతాడన్న నమ్మకం ఏమీలేదు. అయినా వినయుణ్ణి చూడాలన్న తహతహ ఏ మాత్రమూ తగ్గటంలేదు.

"వినయబాబు నీతో స్నేహం మానాడు. అందుకే రావటంలేదు,'' అని లలిత సతీశుణ్ణి కవ్వించింది. సతీశుడు నమ్మలేక వినయుడి గదికి వెళ్ళి తిరిగివచ్చి, వినయబాబు చాలా రోజులుగా తన గదిలో ఉండటంలేదు; అందుకే రాలేదు," అని చెప్పాడు.

ఈ సంగతి విన్నాక లలిత సుచరితను ప్రేరేపించి, ఆనందమయిని చూడ

బోదా మన్నది. మనం ఆవిణ్ణి ఎరగమే అన్నది సుచరిత. ఆనందమయి భర్త పరేశబాబు బాల్యస్నేహితుడని లలిత జ్ఞాపకం చేసింది. ఆ విధంగా వా శ్శీనాడు ఆనందమయిని చూడరావటం తటస్థించింది.

కొంతసేపయాక కిందినుంచి వినయుడు వచ్చి, పరేశబాబుగారు బయలుదేరదా మంటున్నారని ఆడపిల్లలకు చెప్పాడు.

''అప్పుడేనా? వాళ్ళ కేమన్నా పెట్టకుండా ఎలా పంపుతాను? నువ్వు కాస్సేపు వాళ్ళతో కబుర్లాడుతూఉండు. నే నిప్పుడే వస్తాను,'' అని ఆనందమయి అతిథుల కోసం తినటానికి తేబోయింది.

ఆ సమయంలో లలిత, "మీకు తెలుసా, వినయబాబూ? సతీశుడు మీ గదికి వెళ్ళాడు. మీ రక్కడ లేరని చెప్పాడు. మీరు తన స్నేహం మానారని వాడి అనుమానం,'' అన్నది.

లలిత మాటలు అతని చెవులకు అమృతోపమంగా తగిలాయి. తాను పొరబడ్డాడు. లలితకు తనంటే కోపంలేదు ఎంత ఆనందం!

పరేశబాబు ఆడపిల్లలను వెంటబెట్టుకుని వెళ్ళిపోయేసరికి చీకటి పడుతున్నది. వెంటనే వినయుడు ఆనందమయిని పైడాబామీదికి తీసుకుపోయి, చాపవేసి కూర్చోబెట్టి, ''మాట్లాడు,'' అన్నాడు. ఆడపిల్లలను గురించి ఆమె అభిప్రాయం తెలుసు కోవాలని అతని తహతహ.

''పిల్లలు రత్నాలు,'' అన్నది ఆనందమయి. "గోరా సుచరితను చేసుకుంటే ఎంత బాగుణ్ణు!''

"నాకూ అదే అనిపించిందమ్మా. సుచరిత గోరాను ఆకర్షిస్తున్నదని నా నమ్మకం,'' అన్నాడు వినయుడు.

"సుచరిత ఈ శ్రోత్రియుణ్ణి చేసుకుంటుందా అని నా అనుమానం.''

''నీ కేమీ అభ్యంతరం లేదా?"

''నా కేమీ అభ్యంతరంలేదు. వినూ! మనసులు కలవాలిగాని, మంత్రాలలో ఏముంది?"

"నీ కింత విశాలభావా లెలా అలవడ్డాయమ్మా?''

''గోరానుంచే బాబూ! నేను నేర్చుకున్నదంతా నేర్చుకున్నాను."

వినయుడి కీమాట అర్థంకాలేదు. కాని అతనిమనసు ఆనందంతో నిండిపోయింది.

(ముగింపు పై సంచికలో)



[రెండవ భాగం]

[జరిగిన కథ: ఆనందమయీ కృష్ణదయాళులు గోరా పుటుక రహస్యాన్ని గోప్యంగా వుంచి, పెంచి పెద్దవాణ్ని చేశారు. గోరా వినయులు చాలా స్నేహంగా వుంటూండేవారు. గోరాకు దేశభక్తి మెండు - అందుకే జైల్లో పడ్డాడు. పరేశబాబు కుటుంబానిది బ్రహ్మనుతం. వినయా లలితలమధ్య ప్రేమబీజం మొలకెత్తి పెరుగుతోంది. సుచరిత గోరా హృదయంలో మొదటిసారిగా స్త్రీ మనుగడను గుర్తింపచేసింది. వినయుడు ప్రేమకొరకు బ్రహ్మమతం తీసుకొని అధోగతిపాలు అవుతాడని గోరాకు భయం. వినయునికి శశిని యిచ్చి ముడేయాలని మహిముడి ఉద్దేశము.]

సుచరితా సతీసుల పెద్దమ్మ హరిమోహిని రావటంతో పరేశబాబు ఇంటి వాతావరణం చాలా కలతచెందింది. ఇది ఎలా జరిగినదీ తెలుసుకునేముందు హరిమోహిని జీవితచరిత్ర కొంత తెలుసుకోవటం అవసరం.

హరిమోహిని సుచరిత తల్లికన్న రెండేళ్ళు పెద్దది. తల్లిదండ్రులకు వాళ్ళిద్దరే పిల్లలు కావటాన చాలా గారాబంగా పెరిగారు. ఎనిమిదో ఏట హరిమోహినికి పెళ్ళి అయింది. కట్నందగ్గిర పేచీవచ్చి ఆమెను అత్తగారి వైష్ణవాళ్ళు హీనంగా చూశారు. అత్తగారివైపు వారిదిఉమ్మడి కుటుంబం. అరవై దెబ్బయి మందికి తొమ్మిదేళ్ళ హరిమోహిని తానే వంట చేసేది. అందరూ తిన్నాక, అపరాహ్ణం ఆమె ఎంగిలి పడేది. ఒక్కోసారి అన్నంతప్ప ఏమీ మిగిలేదికాదు. మెతుకులు నాలుగూ నోట్లో వేసుకుంటూనే మళ్ళా రాత్రివంట ప్రారంభించేది. రాత్రి భోజనాలయేసరికి దాదాపు అర్ధరాత్రి అయేది. ఆమె అప్పుడు వెళ్ళి ఎవరిమంచంలో ఖాళీవుంటే అక్కడ పడుకునేది. ఆమెకు ప్రత్యేకించి ఒక గదిగాని మంచంగాని లేదు.

పదిహేడో ఏట ఆమెకు మనోరమ పుట్టింది. మరి మూడేళ్ళకు కొడుకు కలిగాడు. ఆ కుర్రవాడు పుట్టకముందే హరిమోహిని భర్తా, అతని తమ్ములూ వేర్లుపడ్డారు. పెళ్ళీడు వచ్చాక మనోరమను పదిమైళ్ళదూరాన ఇచ్చారు. ఆమెభర్త నవమన్మథుడు, కాని పట్టి భ్రష్టుడు, తాగుబోతు.

హరిమోహిని తన భర్తయొక్క ప్రేమగౌరవాలు సంపాదించే సమయంలో కలరా వచ్చి, ఆమె భర్తా, కొడుకూకూడా నాలుగురోజుల తేడాలో పోయారు. అల్లుడు ఆమెను వేధించి డబ్బు తీసుకుపోయి దుర్వ్యసనాలకింద ఖర్చు చెయ్య సాగాడు. మనోరమ డబ్బు ఇవ్వవద్దన్నది; అయినా అల్లుడికెక్కడ ఆగ్రహం వస్తుందోనని హరిమోహిని చాటుగా డబ్బిస్తూవచ్చింది. కొంతకాలానికి మనోరమ గర్భిణిగా వుండి పుట్టింటికి వచ్చేసింది. తల్లి తన భర్తకు డబ్బివ్వకుండా నిరోధించటానికామె తల్లి డబ్బంతా తన అధీనంలో వుంచుకున్నది. మనోరమ భర్త వచ్చి చిందులు తొక్కాడు. మనోరమ లొంగలేదు.

ఒకరోజు మనోరమకోసం అత్తవారు పల్లకీ పంపారు. మనోరమ వెళ్ళనంటున్నకొద్దీ హరిమోహిని ఆమెను పంపింది. మనోరమ ఆమెకు మళ్ళీ కనిపించలేదు. ఆమెకు గర్భస్రావమై చనిపోయినట్టు కబురు వచ్చింది. హరిమోహిని వెళ్ళేసరికి శవదహనంకూడా అయిపోయింది.

భర్త చనిపోయాక భర్తవంతు ఆస్తి హరిమోహిని దయింది. దాన్ని తమకు రాసిఇవ్వమని మరదులు ఆదివరకే ఒత్తిడి చేశారు. దాన్ని మనోరమకు ఇద్దామని ఆమె అనుకున్నది. మనోరమ పోయాక ఆమె విరక్తి చెంది, తన మరదులు రాసి తెచ్చిన దస్తావేజుమీద సంతకం పెట్టేసింది. ఆ సంతకంతో వాళ్ళు ఆమెకు భరణ మన్నా లేకుండా ఆస్తి కాజేసి, ఆమెను ఇంటినుంచి వెళ్ళగొట్టారు. ముప్పైనాలుగేళ్ళు కాపరం చేసిన ఇంటినుంచి ఆమె బయటికి నడిచింది. తన చెల్లెలు పెళ్ళికికూడా వెళ్ళలేదు. ఆమె ఎన్నో తీర్థాలు తిరిగింది. కాని మనశ్శాంతి రాలేదు. ఆఖరుకు, ఆమె తన చెల్లెలిపిల్లలను చూసుకుంటూ కాలం గడుపుదామని పరేశబాబుగారింటికి వచ్చింది.

పరేశబాబు ఇంట అడుగు పెట్టగానే హరిమోహినికి తన మనోరమ తిరిగి బతికి నట్టయింది. సుచరిత మనోరమ వయసుదే. అదీగాక ఇద్దరికీ చాలా పోలిక ఉండి ఉండవచ్చు. అనేక పర్యాయాలు సుచరితను చూసి హరిమోహినికి మనోరమనే చూసినట్టు భ్రమకలిగింది. అందుచేత ఆమె సుచరితను ఎంతో అపేక్షగా దగ్గరికి తీసుకుని, ముఖం నిమిరి, ముద్దులాడ నారంభించింది. మాతృవాత్సల్యం కరువైన సుచరితకుకూడా పెద్దమ్మను చూస్తుంటే తనకు తల్లి దొరికినట్టయింది.

ఇదంతా చూస్తుంటే పరేశబాబు భార్యకు మండుకొచ్చింది. ఇంత ఆచారవంతు రాలిని తన భర్త ఎందుకు చేరదీయాలి? హరిమోహిని మేడపైభాగాన ఉన్న ఒంటి గదిలో ఉండటంకూడా ఆమె సహించలేకపోయింది. భర్తతో ఇదేమిటంటే, "మా అందరి బరువూ మోసే నీ కీ దిక్కులేని విధవరాలు బరువయిందా?" అని అడిగాడు. ఆయనతో పోట్లాడి ప్రయోజనంలేదు. ఆయన చేసిన నిర్ణయాన్ని ఎవరూ మార్చలేరు.

హరిమోహినికి నీరు తెచ్చిపెట్టటానికి బ్రాహ్మణనౌకరును ఏర్పాటు చేశారు. కాని పరేశబాబు భార్య అతని కి.కేవో పనులు పురమాయించి, "పని చేయించు కోవాలంటే రామ్‌దీన్‌కు చెప్పరాదా ఏం?'' అనేది. రామ్‌దీన్ తెచ్చిన నీరు హరి మోహని తాకదు.

పరేశబాబు భార్యకు తన భర్తతో పోట్లాడి ఆయన గౌరవాన్ని కోల్పోయే సాహసంలేదు. అందుచేత ఇలాటి పనులు చేసి కసి తీర్చుకునేది. బయటికి వెళ్ళి బ్రహ్మసమాజం వాళ్ళందరితోనూ తనకు వచ్చిన కష్టం చెప్పుకుని, ''మూఢాచారా లను ఇలా సహిస్తే బ్రహ్మసమాజం మట్టికొట్టుకుపోక ఏం చేస్తుంది?" అని ప్రచారం చేసేది.

సుచరిత హరిమోహినిపట్ల అపేక్షగా ఉండటంకూడా ఆమె సహించలేక పోయింది. "నాకు ముందే తెలుసు. సుచరిత కిన్నాళ్ళూ పెద్దమ్మే చేసింది కాబోలు ఆ మనిషి కెంతచేసీ ఏమీ లాభంలేదు. ఇప్పు డొచ్చిన పెద్దమ్మ ఆప్తురాలై పోయింది," అని విమర్శించింది.

హరిమోహినీ, సుచరితా, సతీశుడూ ఒక జట్టుగా తయారయారు. మిగిలిన వాళ్ళంతా ఒక జట్టు. మధ్య లలితమాత్రమే ఉంది. మిగిలినవా ళ్ళందరినీ నివారించినట్లు లలితను నివారించి, హరిమోహినిదగ్గిరికి వెళ్ళకుండా చేసేటందుకు పరేశబాబు భార్యకు గుండెధైర్యం లేదు.

సుచరిత తన పద్ధతులను పెద్దమ్మకు అనుకూలంగా మార్చుకోసాగింది. ఆమె ఆచారానికి భంగం రాకుండా తాను పెద్దమ్మకు సేవ చెయ్యాలని ఆమె ఉద్దేశం. అలా చెయ్యవద్దనీ, పరేశబాబు నేర్పిన సిద్ధాంతాలనే అనుసరించమనీ హరిమోహిని అన్నది, కాని సుచరిత వినిపించుకోలేదు.

పరేశబాబు భార్య తన ఇంటికి వచ్చే బ్రహ్మసమాజ స్త్రీలను పై డాబామీద, హరిమోహిని గది కెదురుగా సమావేశపరచేది. వాళ్ళంతా హరిమోహినికేసి అదో రకంగా చూసి, సనాతనాచారాలను దుమ్మెత్తి పోసేవారు. పెద్దమ్మ దగ్గిరే ఎప్పుడూ ఉండే సుచరిత ఈ సూటిపోట్లను మౌనంతో సహించేది; కాని, వారితోబాటు ఫలహారం చెయ్యమన్నప్పుడు నిరాకరించింది. "ఆవిడగా రిప్పుడు సనాతనా చారాలు అలవరచుకుంటున్నది. మనతో కలిసి తింటే మైలపడిపోతుంది," అన్నది పరేశబాబు భార్య వారద.

ఒకనా డొక బ్రహ్మసమాజస్త్రీ హరిమోహిని గదిలోకి అడుగు పెట్టబోతే సుచరిత వాకిలి కడ్డం నిలబడి, "అక్కడ పెద్దమ్మ దేవు డున్నాడు," అన్నది.

"అంటే విగ్రహమా? ఆవిడ విగ్రహాలను పూజిస్తారా?"

"అవును, తల్లీ, పూజిస్తాను," అన్నది హరిమోహిని

"మీకు విగ్రహంలో గురి ఎలా కుదిరింది?'' అన్నది బ్రహ్మసమాజికురాలు.

''గురా? అది ఉంటే బాగుపడేదాన్నే," అన్నది హరిమోహిని.

లలిత ఆ సమయాన అక్కడే ఉంది. ఆ స్త్రీని, ''మీ రారాధించే దేవుడిమీద మీకు గురి ఉన్నదా?'' అని అడిగింది.

"లేకుంటా ఎలా ఉంటుంది?'' అన్నదా స్త్రీ.

లలిత తల అడ్డంగా తిప్పి, "మీకు గురి లేకపోవటమే గాక, లేదని కూడా తెలీదన్నమాట!'' అన్నది.



ఒక నాడు పానుబాబు, "నువ్విప్పుడు దేవుడి నైవేద్యం తప్ప తినవుటగా?" అని సుచరితను అడిగాడు.

సుచరిత ముఖం జేవురించింది. పరేశబాబు: "పానుబాబూ, మనం ఏది తిన్నా అది ఈశ్వరుడి నైవేద్యమే," అన్నాడు.

"కాని సుచరిత మన దేవుణ్ణి విసర్జించేలా కనబడుతుంది," అన్నాడు పానుబాబు.



"అది సాధ్యమే అనుకున్నా, అందు గురించి దిగులు పడి ఏం లాభం?" అని పరేశబాబు అడిగాడు.

"ఎవరైనా నీటిలో పడి మునిగి పోతుంటే రక్షించి ఒడ్డు చేర్చమా?"

"రాళ్ళతో కొట్టటమూ, రక్షించటమూ ఒకటి కాదు. సుచరితను చిన్నప్పటి నుంచీ ఎరుగుదును. ఆమె నీటిలో పడిపోతే మీ అందరి కన్నా నాకు ముందే తెలిసేది. నేను చూస్తూ ఊరుకుని ఉండేవాణ్ణి కాను," అన్నాడు పరేశబాబు.

"నేను అడ్డమైనవాళ్ళ చేతి తిండీ తినటం మానేశానని నాన్న గారికి తెలుసు. ఆయన అది సహిస్తే నాకింకేమీ అవసరం లేదు. మరెవరికన్నా నా పద్ధతి నచ్చక పోతే, అనేదేదో నన్నే అనవచ్చు. ఆయనను క్షోభపెట్టటం దేనికి?" అని సుచరిత పానుబాబు నడిగింది. ఆమెధాటికి పానుబాబు వివ్వెరపోయాడు.

ఆ తరవాత బ్రహ్మసమాజంలో పరేశబాబును గురించి తరచు చర్చలు జరుగుతూ వచ్చాయి. వాటిని అరికట్టట మెలాగో సుచరితకు అంతుచిక్కలేదు.

ఇదంతా ఇలా ఉండగా పరేశబాబును ఆయన భార్య, సుచరితకూ పానుబాబుకూ త్వరగా పెళ్ళి చెయ్యమని తొందర పెట్టసాగింది.

ఈ సమయంలోనే పానుబాబు, పేరుచెప్పకుండా, పరేశబాబు మీద ఒక వ్యాసం రాశాడు. పరేశబాబు బ్రహ్మసమాజాదర్శాల గురించి పతన మవుతున్నాడని ఆ వ్యాసంయొక్క తాత్పర్యం. సుచరిత ఆ వ్యాసాన్ని చూసి, చించి ముక్కలు ముక్కలు చేసేస్తుండగా పానుబాబు వచ్చాడు. వచ్చి, "సుచరితా! ఇవాళ నీతో

అతిముఖ్యమైన విషయం ఒకటి మాట్లాడాలి," అన్నాడు. సుచరిత వినిపించుకోక, అతని వ్యాసాన్ని ఇంకా చిన్నచిన్న తుంపులు చెయ్యటంలో నిమగ్నురాలయింది.

ఇంతలో లలిత అక్కడికి వచ్చింది. ఆమెతో పానుబాబు, "నేను సుచరితతో మాట్లాడాలి" అన్నాడు. కాని లలిత వెళ్ళిపోబోతుంటే పోనీకుండా సుచరిత పట్టి, తనపక్కన కూర్చోబెట్టుకున్నది.

వాతావరణాన్ని పసిగట్టలేని పానుబాబు, "చూడు సుచరితా, మన వివాహం వాయిదాపడటం ఇంకెంతమాత్రమూ భావ్యంకాదు. పరేశబాబుతోకూడా మాట్లాడాను. వచ్చే ఆదివారంగాక పై ఆదివారంనాడు—" అని ఆరంభించాడు

"వల్లకాదు," అన్నది సుచరిత.

పానుబాబు దిమ్మరపోయి, "వల్లకాదా? అంటే? మరికొంచెం ఆవతలగా ముహూర్తం పెడదామంటావా?" అన్నాడు.

"లేదు" అన్నది సుచరిత.

"మరి నీ ఉద్దేశం?"

"నాకి పెళ్ళి ఇష్టంలేదు."

"ఇష్టంలేదా? అంటే?"

లలిత కలిగించుకుని, "పానుబాబుగారూ మాతృభాష మరిచారా ఏమిటి?" అన్నది వెటకారంగా.

"మాతృభాష రాకపోవటంకన్నా దారుణం ఇతరులు పదేపదే అన్నమాటలు అర్థం చేసుకోలేకపోవటం — అందులోనూ నేను గౌరవించిన మనిషిమాటలు!" అన్నాడు పానుబాబు.

"నేను మిమ్మల్ని ఏమాత్రమూ తప్పుపట్టను," అన్నది సుచరిత.

"నా తప్పేమీ లేనప్పుడు నన్నిలా అవమానించటం దేనికి?"

"అవమానం నాదే. ఎందుకంటే నేను మిమ్మల్ని—" అని సుచరిత అంటుండగా బయటినుంచి వినయుడి పిలుపు వినపడింది, సుచరిత అతన్ని లోపలికి రమ్మన్నది. వినయుడు లోపలికి వచ్చి, తాను చాలా రోజులుగా రానందుకు క్షమాపణ చెప్పుకున్నాడు. తాను సుచరితతో అతిముఖ్యమైన విషయం మాట్లాడుతున్నానని పానుబాబు అనేసరికి, వినయుడు వెళ్ళిపోబోయాడు. కాని సుచరిత అతన్ని పోనివ్వక, తమ సంభాషణ అయిపోయిందని చెప్పి, అతన్ని కూర్చోబెట్టింది. పానుబాబు ఆట కట్టయింది. కాని అతను తాను తేల్చుకోదలచినది తేలేదాకా ఆ గది నుంచి పోదలచలేదు.

ఈలోపల ఆ గదిలో మరొక నాటకం జరుగుతున్నది. వినయుడి గొంతు వినిపించిన క్షణంలోనే లలితకు త త్తరంలాటిది కలిగింది. అతనితో మామూలుగా మాట్లాడటం ఆమెకు సాధ్యంకాలేదు. వినయుడికికూడా లలితను పలకరించే సాహసం లేకపోయింది. కాని ఆ ఇద్దరి మధ్య జరిగిన నాటకం పానుబాబు గ్రహించి, పరేశబాబుపై ఆగ్రహించాడు. ఆయన తన కుమార్తెలను బ్రహ్మ సమాజంలో లేనివాళ్ళ కెందుకు పరిచయం చేశాడు?

పానుబాబుకు వెళ్ళిపోయే ఉద్దేశం లేదని గ్రహించి సుచరిత వినయుణ్ణి పెద్దమ్మను చూడటానికి తీసుకుపోయింది.

లలిత పానుబాబుతో, "మీకు నాతో మాట్లాడే దేమీ లేదనుకుంటాను?" అన్నది.

"లేదు కావలిస్తే నువుకూడా వాళ్ళతోబాటు వెళ్ళిపోవచ్చు." అన్నాడు పానుబాబు—ఆమెకు తన అనుమతి అవసరమైనట్టు.

"అవును. నేను వినయబాబుతో మాట్లాడాలి; ఈలోపల మీరు కాలక్షేపానికి మీ వ్యాసం చదవదలిస్తే - అన్నట్టు దీదీ దాన్ని తుంపులు తుంపులుగా చించేసింది కదూ! కావలిస్తే ఇది చదువుకోండి," అంటూ వెనక వినయుడు సుచరితకు తెచ్చి ఇచ్చిన గోరా వ్యాసాలకట్టను మూలనుంచి తీసి, పానుబాబు ముందు పెట్టి, పైకి వెళ్ళిపోయింది.

కొంచెంసేపుండి పానుబాబు విసిగి, పరేశబాబు భార్యను వెతుక్కుంటూ వెళ్ళి, సుచరిత తనను పెళ్ళాడనంటున్నదని చెప్పేశాడు.

"పానుబాబూ, మీ మెత్తదనమే దా న్నిలా చేస్తున్నది. మీరు మాత్రం గట్టిగా నిలబడండి. అది ఎలా చేసుకోదో చూస్తాం," అన్నా దావిడ ఉగ్రులాలైపోయి.

గట్టిగా నిలబటటంగురించి పానుబాబు కొకరు చెప్పే పనేలేదు.

"సిద్ధాంతంకోసం నేను గట్టిగా నిలబడితీరాలి. సుచరితను విడిచిపుచ్చటం నా కో లెక్కలోది కాదు. కాని ఈ విషయంలో బ్రహ్మసమాజ ప్రతిష్ఠ నిలబెట్టవలసి ఉంది," అన్నా డతను.

వారద హరిమోహిని గదికి వెళ్ళి, "ఇక్కడున్నావా, మహారాణీ! నే నప్పుడే అనుకున్నాను. పాపం, పానుబాబు పొద్దుట్నుంచీ నీకోసం పడిగాపు లున్నాడు. నీ కీ చేష్ట లెవరు నేర్పుతున్నారో నా కర్థం కాకుండా ఉంది. ముగ్గురు కూతుళ్ళను నేను పెంచాను గాని ఇలాటి దెన్నడూ ఎరగను. బ్రహ్మసమాజంలో ఎలా తల ఎత్తుకు తిరిగేటట్టు?" అన్నది.

"నీ కోసం ఎవరో కాచుకున్నారని నాకు తెలీదు, తల్లీ! వెళ్ళు వెళ్ళు," అన్నది హరిమోహిని. సుచరిత కిందికి వెళ్ళిపోయింది.

"నీ కిక్కడ పనేమైనా ఉన్నదా, లలితా?" అని వారద అడిగింది.

"అవును. చాలా రోజు లయాక వినయబా బొచ్చారు. నే నాయనతో మాట్లాడాలి," అన్నది లలిత.

లలిత మొరాయించిందని గ్రహించి ఆమె తల్లి, వినయుణ్ణి పలకరించకుండానే కిందికి వెళ్ళిపోయింది.

సుచరిత కిందికి వెళ్ళి పానుబాబుకు ఎదురుగా నిలబడి, "నాతో ఏదో చెప్పాలని వేచిఉన్నారుట; ఏమి టది?" అని అడిగింది.

"సుచరితా! నువు నాకు అన్యాయం చేశావు," అన్నా డతను.

"మీరూ నా కన్యాయం చేశారు."

"నేను ఇచ్చిన మాటమీదనే నిలబడిఉన్నాను."

అన్యాయం మాటలతోనే చెయ్యాలా? మాటకన్న సత్యం ఎక్కువకాదా? ఒక పొరపాటు మళ్ళీమళ్ళీ చేశానుగనక దానికి నేను కట్టుబడాలా? నేను ఇచ్చిన మాట దక్కించుకోలేను. అలా చెయ్యడం తప్పవుతుంది," అన్నది సుచరిత.

సుచరిత ఇలా ఎందుకు మారిపోయిందో పానుబాబుకు అర్థంకాలేదు. తన మొండిపట్టుదలవల్లనే సుచరిత తన సహజవిగ్రహం కోల్పోయిందని అతనికి తట్టనైనాలేదు. అందుచేత అతను తప్పంతా ఆమె కొత్త స్నేహితులపైన తోశాడు.

"ఏం పొరపాటు చేశానని తెలుసుకున్నావు?" అని అత నడిగాడు.

"దాంతో మీ కేం పని? నేను పెళ్ళాడనన్నది చాలదా?"

"కాని బ్రహ్మసమాజం నిన్ను తప్పక సంజాయిషీ అడుగుతుంది. ఏం చెబుతావు? మన సభికులకు నే నేం చెప్పాలి?"

"నేనుమటు కేమీ చెప్పను. మీరు కావలిస్తే సుచరిత మరీ పసిదనో, బుద్ధిలేనిదనో, నిలకడ లేనిదనో చెప్పండి. మీ రేం చెప్పినాసరే, మనిద్దరిమధ్యా చర్చించేటందు కేమీలేదు," అన్నది సుచరిత.

ఇంతలో పరేశబాబు వచ్చాడు. పానుబాబు, అవతలికి వెళ్ళిపోతున్న సుచరితను, "వెళ్ళిపోకు. పరేశబాబు సమక్షంలో ఇది తేలాలి," అన్నాడు. సుచరిత పోతున్నదల్లా ఆగింది.

"పరేశబాబూ! ఇంతా అయాక సుచరిత నన్ను పెళ్ళాడ నంటోంది. పెళ్ళి

లాటి ముఖ్యవిషయంలో ఆమె ఇలా ప్రవర్తించటం భావ్యమేనా? ఇందులో మీ బాధ్యతకూడా కొంత వుండదూ?" అన్నాడు పానుబాబు.

పరేశబాబు సుచరిత తల నిమిరి, మృదువుగా, "అమ్మా, నువ్వు వుండనవసరంలేదు. వెళ్ళిపోవచ్చు." అన్నాడు. కృతజ్ఞతతో చెమ్మగిల్లే కళ్ళతో సుచరిత వెళ్ళిపోయింది.

"సుచరిత తన మనసుకు తానే అర్థం చేసుకోకుండా పెళ్ళికి అంగీకరించిందన్న అనుమానంతోనే నేను నిశ్చితార్థం గురించి తటపటాయించాను," అన్నాడు పరేశబాబు.

"ఆమె మంచికోరి మీ రేమీ సలహా ఇవ్వరా?" అని పానుబాబు అడిగాడు.

"ఆమె మంచికోరకుండా ఎన్నడూ సలహా ఇవ్వనని మీరు గ్రహించాలి."

"అలాగే మీరు చేసిన పక్షంలో ఇంతదాకా వచ్చేది కాదేమో? మీ పొరపాటువల్లనే మీ కుటుంబపరిస్థితు లిలా పరిణమించాయని మీ ముఖంఎదుటే నే నంటాను."

పరేశబాబు చిరునవ్వు నవ్వి, "నా కుటుంబానికి నేను బాధ్యత వహించకపోతే మరెవరు వహిస్తారు?" అన్నాడు.

"కాని, చూస్తూండండి, మీరు పశ్చాత్తాపపడే రోజు వస్తుంది."

"పశ్చాత్తాపం భగవదనుగ్రహం లేనిదే కలగదు. పానుబాబూ! నేను తప్పు చేయ్యటానికి వెరుస్తానుగాని, పశ్చాత్తాప పడటాని కెన్నడూ వెరవను."

సుచరిత తిరిగివచ్చి, "నాన్నా, మీ పూజకు వేళఅయింది," అని పరేశబాబుతో అన్నది.

పానుబాబు వెళ్ళిపోయాడు.

## 2

తన జీవితంలో ఒక విషమఘట్టం వచ్చినట్టు సుచరిత గ్రహించింది. తాను తన లోపలా, వెలపలా ఇంత ఘర్షణను ఎదుర్కోవలిసి వస్తుందని ఆమె ఊహించలేదు. గోరాపట్ల ఆమెకు గలభావం, అతను అరెస్టయాక మరింత ప్రస్ఫుటమయింది. అయితే దాన్నిగురించి ఆమె ఎవరితోనూ చెప్పలేదు. తానుకూడా ఆలోచించటానికి భయపడింది. ఆలోచింతామన్నా ఆమెకు ఏకాంతం దొరకలేదు—పానుబాబు బ్రహ్మసామాజకులను ఆమెపైకి ఉసికొల్పుతూవచ్చాడు.

ఇంతకన్న ఆమెను హెచ్చుగా బాధించినది 'పెద్దమ్మ' సమస్య. ఆ సమస్య వెంటనే పరిష్కారం అయితీరాలి. వారద సుచరితమనసును మళ్ళించలేకా, తన భర్తను తనపక్షం చేసుకోనూలేకా, తన అక్కనవ్వంతా హరిమోహినిపైన వెళ్ళ

గక్కింది. "చూడండి, మీ రీ ఇంటో ఎంతకాలం ఉన్నా నా కభ్యంతరంలేదు. మేం సంతోషంగా మీభారం మోస్తాం. కాని మీ పూజావిగ్రహాలుమాత్రం ఇక్కడ ఉండటాని కెంతమాత్రమూ వీల్లేదు," అన్నా దామె హరిమోహినితో.

ఆమె ఆ మాట అన్నప్పుడు వినయుడు హరిమోహినిగదిలోనే ఉన్నాడు. ఆతనికి మండుకొచ్చింది. "మా అమ్మ దగ్గరికి తీసుకుపోతాను. పిన్నీ! నీ మూటా ముల్లే సర్దుకో," అన్నా డతను

"నన్నెక్కడికన్నా తీర్థానికి తీసుకుపో బాబూ!" అన్నది హరిమోహిని. పాపం, ఆమె చాలాకాలం తీర్థాలలో గడిపింది భగవంతుడిమీద మనస్సు లగ్నం చెయ్యాలని యత్నించింది. కాని ఆమెకు మనిషివాపి జాస్తి. మనస్సు భగవంతుడి మీద నిలవలేదు. తన చెల్లెలిపిల్లలైన సుచరితా సతీశులను కలుసుకోగానే ఆమెకు ప్రాణం లేచివచ్చింది. ఇప్పుడు దానికికూడా విఘాత కలుగుతున్నది. ఇక ఈ ఇంట్లో తనకు స్థానంలేదు.

"ముందు మా అమ్మ దగ్గిరికి వచ్చిఉంటే, అటునుంచి ఏ తీర్థానికైనా తీసుకు పోతాను," అన్నాడు వినయుడు. హరిమోహిని ఆ చూరుకింద క్షణం ఉండటం అతనికి సమ్మతంగాలేదు

హరిమోహిని తన సామానంతా సర్దుకోవటం చూసి సుచరిత, "ఈ రాత్రివేళ ఎక్కడికి వెళతావు, పెద్దమ్మా? రేపు తెల్లవారనీ చూద్దాం. నాన్నతో చెప్పకుండా వెళ్ళిపోతే ఆయన నొచ్చుకోరూ?" అన్నది.

ఆమాట నిజమేనని వినయుడుకూడా ఒప్పుకున్నాడు.

పరేశబాబే హరిమోహిని సమస్యకు పరిష్కారమార్గం చూపాడు ఆయన సుచరితతో, "మీ పెద్దమ్మ ఎక్కడికో వెళ్ళిపోవటం దేనికి, తల్లీ? నీ ఇంట్లోనే ఉంటుంది," అన్నా డాయన.

"నా ఇంటోనా?" అన్నది సుచరిత ఆశ్చర్యంగా.

"అవునమ్మా. కలకత్తాలో నీకో యిల్లున్నది, సతీశుడికో యిల్లున్నది. మీ నాన్న నాకు అప్పగించిపోయిన ఆస్తిమీద వడ్డీ చేర్చి, మీ ఇద్దరికీ చెరొక ఇల్లూ కొన్నాను. వాటిమీద మీకు బాడుగకూడా వస్తున్నది. నీ ఇల్లు ఈమధ్యనే ఖాళీ అయింది. అందులో మీ పెద్దమ్మ సుఖంగా ఉండవచ్చు. ఎంతోదూరంకూడా లేదు. మన ఇంటిపక్క సందులో మూడోయిల్లు," అన్నాడు పరేశబాబు.

"ఆ ఇంట్లో ఆమె ఒంటరిగా ఉండగలదా?" అన్నది సుచరిత.

"ఒంటరిగా ఎందుకుండాలి. నువుకూడా ఉండు. ఇల్లు దగ్గిరేగనక నువు దూరం రానవసరం కూడాలేదు."

సుచరిత ఇతరులు గీసే గిరులు దాటి అవతలికి వెళ్ళి తన స్వేచ్ఛాజీవితం తాను జీవించదగిన సమయం వచ్చిందని పరేశబాబు అదివరకే గ్రహించాడు. ఇక నుంచి ఆమె తనబాట తానే వెతుక్కుంటుంది. తనకు ప్రాప్తించే సుఖదుఃఖాలను తానే ఎదుర్కొంటుంది.

మర్నాడుఉదయం హరిమోహిని పరేశబాబువద్ద శలవు తీసుకుని, తన చెల్లెలి పిల్లల కాయన చేసిన ఉపకారానికి కృతజ్ఞత తెలుపుతూండగా. వినయుడు వచ్చి, ఆమెను తీసుకుపోవటానికి ఆనందమయి వచ్చి కింద ఉన్నదని చెప్పాడు. సుచరిత చప్పున కిందికి దిగిపోయింది.

"నేను ముందుగా వెళ్ళి మీకు ఇల్లు సిద్ధంచేస్తాను," అంటూ పరేశబాబు వెళ్ళిపోయాడు. హరిమోహినికోసం ఒక ఇల్లు సిద్ధంగా ఉన్నదనీ, అది సుచరిత సొంత ఇల్లనీ విని వినయుడాశ్చర్యపడ్డాడు.

కొంచెంసేపటికి ఆనందమయి, సుచరితా లలితలను వెంటబెట్టుకుని పైకి వచ్చింది. హరిమోహిని ఆప్యాయంగా ఆమెను తనసరసన కూచోపెట్టుకున్నది. వాళ్ళు మాట్లాడుకుంటుండగా సతీశు దొక కుక్కపిల్లను తెచ్చి పెద్దమ్మ కివ్వబోయాడు. ఆ అపవిత్రజంతువును చూసి కంగారుపడి హరిమోహిని. "దాన్ని లోపలికి తీసుకురాకురా బాబూ." అంటూ దూరంగా తొలగింది.

వారద పైకి వచ్చి ఆనందమయినీ, వినయుణ్ణీ భోజనానికి పిలిచింది. తనకు ఎక్కడ భోజనం చెయ్యటానికీ అభ్యంతరం లేదుగాని ప్రస్తుతం ఆకలి లేదని ఆనందమయి అన్నది; వినయుడు ఆ అనాచారుల భోజనం చెయ్యటానికి ఎగిరి గంతేశాడు. ఇది చూసి హరిమోహిని విభ్రాంతపోయింది. ఆమె ఆనందమయిని నోరు చేసుకుని అడిగిందికూడా.

"ఏం చెయ్యను? నా కులాన్ని ఆ ఈశ్వరుడే లాగేశాడు," అన్నది ఆనందమయి. ఆమెకు బలవంతంగా ఎవరో కిరస్తానీమతం అంటగట్టారు కాబోలనుకున్నది హరిమోహిని.

ఉదయం సుచరిత ఆఖరుసారి పరేశబాబు ప్రార్థనకు అన్ని సన్నాహాలూ చేసి ఆయన వెంట ఉన్నది. వాళ్ళు బయటికి వచ్చేసరికి పానుబాబు వచ్చి ఉన్నాడు. సుచరిత మరొక ఇంటికి వెళ్ళిపోతున్నదనీ, ఆ ఇంట తనకు ప్రవేశ ముండదనీ గ్రహించి, ఆతను ఈ పూటనే తాడోపేడో తేల్చాలని నిశ్చయించుకున్నాడు.

సుచరితను చెయ్యి జారిపోనివ్వే ఉద్దేశం అతని కెంత మాత్రమూ లేదు. సుచరితను చూడగానే అతను కుర్చీలో నిక్కి కూర్చుని, ''సుచరితా ఈ నాడు నీ పతనం ప్రారంభమయింది. ఇది మాకు దుర్దినం,'' అన్నాడు.

''పతన మవుతున్నదీ, పురోగమిస్తున్నదీ ఎవరి అంతరాత్మలో వారికి తెలుస్తుంది,'' అన్నాడు పరేశబాబు.

పానుబాబు పరేశబాబు అంతరాత్మను అధిక్షేపించటానికిగాను, ఆనాడు లలితా-వినయులు ఒకే స్టీమరులో ప్రయాణించిన విషయం ప్రస్తావించి, ఆయన తన కూతుళ్ళకు బ్రహ్మసమాజేతరుల పరిచయం కలగనిచ్చినందుకు తప్పు పట్టాడు.

''ఈ విషయాలతో మీ కేమిటి సంబంధం?'' అని సుచరిత పానుబాబును కోపంతో అడిగింది. తాను సమాజం తరపున మాట్లాడుతున్నా నన్నాడు పానుబాబు.

''బ్రహ్మసమాజం మిమ్మల్ని జడ్జిగా నియమించిన పక్షంలో మేం దానికి దూరంగా ఉండటం మంచిది,'' అన్నది లలిత.

''అమ్మా, లలితా! ఈపూట సుచరిత వెళ్ళిపోతున్నది. ఈ కీచులాటిప్పుడొద్దు. పానుబాబూ! మా వల్ల ఏ తప్పులు జగిరినప్పటికీ ఈ సమయాన మీరు మమ్మల్ని క్షమించాలి,'' అన్నాడు పరేశబాబు. పానుబాబు నోరు మూసుకోవలసివచ్చింది.

సుచరిత హరిమోహినివద్దకు వెళ్ళి, ''పెద్దమ్మా, ఈపూటకు వాళ్ళందరి పంక్తినా భోంచేస్తాను. నువ్వేమీ అనుకోకు,'' అన్నది. హరిమోహిని కిదేమీ అర్థంకాలేదు. సుచరిత పూర్తిగా ఆచారవంతురా లయిందని ఆమె నమ్మింది.

''అంటే అన్నావుగాని, ఆ రామ్‌దీన్ గాడి చేతినీళ్లమాత్రం తాగకు,'' అన్న దామె.

''అదేమిటి పెద్దమ్మా? వాడేగా రోజూ ఉదయం నీకు ఆవుపాలు పితికి తెచ్చేదీ?'' అన్నది సుచరిత.

''అంత విడ్డూరంగా మాట్లాడతా వేమిటే? పాలూ, నీరూ ఒకటా?'' అన్నది హరిమోహిని.

''సరే పోనీగాని సతీసుడికి మాత్రం అంటు లేమీ పెట్టకు. వాడు పద్దన్న పనే చేస్తాడు.'' అన్నది సుచరిత.

''వాడిదారి వేరూ!'' అన్నది హరిమోహిని.

సతీసుడు మగవాడు; వాళ్ళు అన్ని నియమాలూ ఉల్లంఘించవచ్చు.

## 3

పానుబాబు ధ్వజమెత్తాడు. లలిత వినయుల పడవప్రయాణం గురించి అతను బ్రహ్మసమాజప్రముఖు లందరినీ రెచ్చగొట్టాడు. అది కారుచిచ్చులాగా వ్యాపిం

చింది. అతను సుచరిత పతనమై విష్టాచారంలో పడిపోయిందనీ, మూఢవ్రతాలూ, నియమాలూ పాటిస్తున్నదనీకూడా ప్రచారం సాగించాడు.

సుచరిత వెళ్ళిపోయాక లలిత చివరంటా పోరాటం సాగించ తీర్మానించు కున్నది. ఆమె వినయుణ్ణి గట్టిగా ప్రేమిస్తున్నది. అతని కంఠం విం టేచాలు, ఆమె గుండె గబాగబా కొట్టుకుంటుంది. అతను రెండుమూడురోజులు కనిపించక పోతే ఆమె ప్రాణం గిలగిలలాడుతుంది.

ఈ మనోవేదనకు తట్టుకోలేక లలిత ఆడపిల్లలబడి పెడదామని ఆలోచించింది, పరేశబాబు నడిగితే, అందుకు చాలా డబ్బు కావాలనీ, అనేకమంది సహకరించాలనీ అన్నాడు. లలిత సుచరిత ఇంటికి వెళ్ళి, తన ఆలోచన చెప్పింది.

"దానికి నియమాలూ, నిబంధనలూ, నిర్వాహకమూ ఏమీలేదన్ని గావాలి ఆడపిల్లలం మనవల్ల ఏమవుతుంది?" అన్నది సుచరిత.

"అదే అనొద్దు. మనం ఆడపిల్లలుగా పుట్టాంగనుక నాలుగుగోడలమధ్య నలిగి పోవాలా? మనవల్ల ప్రపంచానికేమీ మేలు జరగకూడదా?" అన్నది లలిత. ఆమాట అన్న మీదట సుచరితలోకూడా చైతన్యం వచ్చింది.

ఈ స్కూలు విషయంలో లావణ్యకూడా ఉత్సాహం చూపింది. ఆమె చుట్టు పక్కల ఉండే ఆడపిల్లలను కూడగట్టాలని చూసింది; కాని బ్రహ్మసమాజీకుల నడిపేబడికి హిందువులు తమ కూతుళ్ళను పంప నిరాకరించారు.

లలిత నిరుత్సాహం చెందక పేద బ్రహ్మసామాజికుల ఆడపిల్లలతో బడి నడపవచ్చు నన్నది. అరడజను విద్యార్థినులతో కొద్దిరోజులపాటు బడి సాగింది. కాని క్రమంగా విద్యార్థినులు ఒక్కొక్కరే జారుకున్నారు. ఒకరోజు బడికి ఎవరూ రాలేదు. లలిత పనిపెట్టుకుని దగ్గరలో ఉండే విద్యార్థినుల ఇళ్ళకు వెళ్ళి కారణం అడిగింది. పెద్దవాళ్ళు అయోమయమైన కారణాలు చెప్పారు. అసలు కారణం సుధీరుడు చెప్పాడు — హారానుబాబు ఈ బడికి విరుద్ధంగా కత్తికట్టాడు — కారణం వినయుడూ, లలితా కొన్నివారాలక్రితం చేసిన పడవప్రయాణం.

"అంతేకాదు; వినయుడూ, అతని మిత్రులూ ఈ బడిలో చల్లగా దూరుతారని భయం," అన్నాడు సుధీరుడు.

"భయమా! అంతకన్న అదృష్ట మేముంటుంది? అలవారిలో సగం తెలివితేట లున్నవాళ్ళను వాళ్ళు సంపాదించగలరా?" అన్నది లలిత. బ్రహ్మసమాజాన్ని శుద్ధంగా ఉంచటంకోసం సమాజోద్ధారకులు ఇలాటి పద్ధతుల నవలంబించటం ఆమెకు అసహ్యం పుట్టించింది.

ఆమె సుచరితవద్దకు వెళ్ళి, "దీన్ని నేను సహించను; ప్రతిఘటించి తీరుతాను."

"ఏవిధంగా ప్రతిఘటిస్తావు ?'' అని సుచరిత అడిగింది.

"నాకు తెలీదు. నే ఇంకా ఆలోచించలేదు. మనవంటి అసహాయబాలికలపై ఇలా చాటుమాటు దెబ్బ తీసేవాళ్ళు పిరికిపందలు. వీళ్ళచేత నేను చచ్చినా ఓడిపోను."

"నాన్నగారేమంటారో తెలుసుకోవటం మంచిదికాదూ ?" అన్నది సుచరిత.

లలిత ఇంటికి బయలుదేరింది. తలవాకిలివద్ద వినయుడు తలవంచుకుని బయటికి వస్తూ ఎదురయాడు. ఆమెను చూసి అతను క్షణం ఆగి, ఏదో ఆలోచించినవాడల్లే కనబడి, తనను తాను నిగ్రహించుకుని, ఆమెకేసి తలవంచి వెళ్ళిపోయాడు. లలిత హృదయాన్ని శూలాలు పొడిచినట్టయింది. ఆమె గబగబా లోపలికి వెళ్ళి తన తల్లితో, ''ఇప్పు డిక్కడికి వినయబాబు వచ్చారా !" అని అడిగింది.

"నే నిప్పుడు పనిమీద ఉన్నాను. నన్ను విసిగించకు." అన్నది వరద.

''మ వ్యాయనతో ఏమన్నావేం ?''

''అబ్బో, దానికంతా చాలా ఉందిలే.'

''నన్నుగురించి మాట్లాడావా, లేదా ? అది చెప్పు చాలు !''

''మాట్లాడాను తల్లీ ! ఎందుకు మాట్లాడను ? సమాజంలో అంతా మననిగురించి మాట్లాడుకునేవాళ్ళే. అందుచేత అతన్ని హెచ్చరించవలసివచ్చింది."

లలితముఖం అవమానంతో జేవురించింది. "వినయబాబును ఇంకమీదట రావద్దని నాన్న అన్నారా ?" అని ఆమె అడిగింది.

"ఆయన కీ విషయాలు తలకుపట్టేమాటుంటే ఇంతదాకా వచ్చేదేకాదు."

" పానుబాబు మాత్రం ఇక్కడికి వస్తూ ఉండవచ్చునా ?"

"ఎలా అడుగుతోందో ! పానుబాబు రావటాని కేం ?"

"అయితే వినయబాబు రావటానికిమటు కేం ?"

''లలితా, నీతో వాదిస్తూ కూర్చోవటానికి నాకు తీరిక లేదు, చచ్చేటంత పని ఉంది," అన్నది వరద.

లలిత బడిలో ఉండే సమయం చూసి ఆవిడ వినయుణ్ణి పిలిపించి, చెప్పవలసినవి నాలుగూ చెప్పేసింది. లలితకు తెలియబోతుందా అనుకుంటే లలిత సమయానికి తిరిగివచ్చి, అంతా తెలుసుకున్నది.

లలిత మనసులో తుఫాను చెలరేగుతున్నది. ఆమె వెళ్ళి, ఉత్తరాలు రాసుకుంటున్న తన తండ్రివి, ''నాన్నా, వినయబాబు మవింటికి రాతగరా ? అని అడిగింది.

యువ.

ఆ మాటతో పరేశబాబు పరిస్థితి గ్రహించి, ''నా ఉద్దేశంలో వినయుడు నిజంగా చాలా సత్పురుషుడు. అతని శీలమూ, తెలివితేటలూ, సంస్కృతీ ఉన్నతమైనవి,'' అన్నాడు.

''గౌరబాబు తల్లి రెండుసార్లు ఇదివరకే మనింటికి వచ్చారు, సుచీదీదీని వెంటబెట్టుకుని వారింటికి పోదా మనుకుంటున్నాను,'' అన్నది లలిత.

పరేశబాబు కొంచెం ఆలోచించి, ''అలాగే వెళ్ళిరండి, నేను కూడా వచ్చి ఉందును గాని నాకు తీరిక లేదు,'' అన్నాడు.

# 4

తాను పరేశబాబు ఇంటికి వస్తూ పోతూ ఉండటాన ఇంత రభస జరుగుతుందని వినయుడు కలలోకూడా అనుకోలేదు లలితను గురించిన ప్రవాదు అతనికి పిడుగుపాటయింది. అతనికి లలితపట్ల గల భావం సామాన్య స్నేహానికి మించినది. ప్రస్తుత పరిస్థితులలో అలాటి భావం అనుచిత మని అతనికి తెలుసు. దీనివల్ల పరేశబాబు కుటుంబానికీ తనకూ మధ్య ఒక సందిగ్ధ బాంధవ్యం ఏర్పడింది. ద్వారంవద్ద లలిత ఎదురైనప్పుడు అతను తన తప్పు ఒప్పేసుకుందా మనుకున్నాడు. గాని అది సాధ్యంకాక, తలవంచి వచ్చేశాడు.

దారిలో సతీశుడు అతన్ని పేరుపెట్టి పిలిచాడు. ఆ కుర్రవాణ్ణి చూడగానే వినయుడికి కంట నీరు తిరిగి, గొంతు బిగుసుకుపోయింది. దానితో అతనికి పరేశబాబు కుటుంబంతో తనకుండిన పరిచయం ఎంత మధురమైనదో తెలిసివచ్చింది. అతను సతీశుణ్ణి తన ఇంటికి తీసుకుపోయి, మిఠాయి తినిపించి, పరేశబాబు ఇంటిదాకా సతీశుణ్ణి దిగబెట్టి, లోపలికి రమ్మని సతీశు డెంత మారాం చేసినా, వెళ్ళకుండా, ఆనందమయివద్దకు వెళ్ళాడు.

"ఏం, వినయా ? ఎందు కలా పాలిపోయివున్నావు ?" అని అడిగింది ఆనందమయి.

"అమ్మా, నేను మొదట్లో పరేశబాబింటికి వెళుతున్నప్పుడు గోరా ఆగ్రహి స్తే, అతని ఆగ్రహం పొరపాటనుకున్నాను. పొరపాటు అతని ఆగ్రహంకాదు, నా బుద్ధితక్కువ. మనకూ వాళ్ళకూ సాంఘికాచారాలలో గల తేడాను నేను లక్ష్య పెట్టలేదు. వాళ్ళ సమాజంవాళ్ళు ఎలాటి దుమారం లేపి, ఎంతదారుణమయిన అపవాదు వేశారంటే– నేనక్కడికి ఎన్నటికీ పోలేను," అన్నాడు వినయుడు.

"అంతశ్శాంతి లేకుండా బహిశ్శాంతి వుండటం చాలా దారుణ మంటాడు

గోరా. వాళ్ళ సమాజంలో దుమారం రేగితే, మధ్య నీకు విచారం దేనికి? నీ చిత్త శుద్ధి నీకు ముఖ్యం,'' అన్నది ఆనందమయి.

వినయుడికి తన చిత్తశుద్ధిలో గురికుదరలేదు. అతనికి లలితపైన ఉన్న ప్రేమ మానసికపాపంలాగా అతనికి తోచింది.

''నేను శశిముఖిని పెళ్ళిచేసుకున్నట్టయితే, కాళ్ళూ, చేతులూ కట్టేసి పడేసినట్టుండేవాణ్ణి,'' అన్నా డతను.

''అంటే శశిముఖి నీకు భార్యగా వుండక కట్టుతాడు కావాలనా నీ ఉద్దేశం? ఎంత అన్యాయం!"

ఇంతలో పరేశబాబు కుమార్తెలు వచ్చినట్టు నౌకరు వచ్చి చెప్పాడు. వినయుడు వెళ్ళిపోతానని లేచాడు.

"వెళ్ళకు, కాస్సేపు కిందనే ఉండు,'' అంటూ ఆనందమయి వెళ్ళిపోయింది.

కింద వినయుడికి మహిముడు తగిలి, "అంతా స్థిరం అయేపోయిందిగదా. ఇంక ఎందుకు –'' అని ప్రారంభించాడు.

''గోరాను తిరిగి రానియ్యి, ముహూర్తం పెట్టుకుందాం," అన్నాడు వినయుడు.

''అదెంత? ఇంకా కొద్దిరోజులేగా?" అంటూ మహిముడు వెళ్ళిపోయాడు.

ఇంతలో వినయుణ్ణి పైకి రమ్మంటూ కబురువచ్చింది. అతను గదిలోకి అడుగు పెట్టగానే అతని అవతారం చూచి సుచరితా లలితలు నిశ్చేష్టిత లయారు. అతను తిన్న దెబ్బ అతని ముఖాన బాగా తెలుస్తున్నది.

ఎన్నడూ అతనితో స్వేచ్ఛగా మాట్లాడలేని లలిత, "ఇదుగో. వినయబాబూ. మాకు అవసరంగా మీ సలహా కావాలి," అన్నది. ఈ మాటలతో అతని పాలిపోయిన ముఖంలోకి జీవం వచ్చింది.

తాము ఆడపిల్లలబడి ప్రారంభింతా మనుకుంటున్నామనీ, హిందువులు తమ పిల్లల్ని పంపకుండా ఉన్నారనీ, స్కూలు నియమావళి వగైరాలు అతను రాసిపెట్టి సహాయం చెయ్యాలనీ లలిత అన్నది. ఆమె సరిగా తన తల్లి వద్దన్నపనే చేస్తూ, వినయుడితో మరింత దగ్గిరసంబంధం కలిగించు కుంటున్నది. సుచరిత భయపడింది.

''మనం నాన్నగారిని సంప్రదించిగాని ఏ నిర్ణయమూ చెయ్యరాదు," అన్నదామె, లలిత అన్నమాటలను కొంతవరకు రద్దుచేస్తూ.

కాని లలితధోరణి మారలేదు.

"అవును మరి, నాన్నగారికి చెప్పకుండా ఎలాగ? వినయబాబు సహాయం

చేస్తామన్నారుగనక నాన్నగారితో చెప్పవచ్చు. స్కూలు నడవటంలోకూడా ఆయన సహాయం అనవసరం — మీ సహాయంకూడానూ," అన్నది లలిత ఆనందమయికేసి తిరిగి.

"దాని కేం భాగ్యం. మీస్కూలుగదులు చక్కగా ఊడ్చిపెడతాను," అన్నది ఆనందమయి నవ్వుతూ.

తరవాత ఆనందమయి ఒంటరిగా ఉండగా మహిముడు వచ్చి. "వినయుడు కాస్త సుముఖంగా ఉన్నాడు. వాడిబుద్ధి మళ్ళీ మారేలోపున పని జరిగిపోతే బాగుం దను," అన్నాడు.

"ఇంతలో వాడిబుద్ధి ఎప్పుడు మారింది? నా కేమీ చెప్పలేదే?" అన్నది ఆనందమయి.

"ఇంతకుమునుపే మాట్లాడానుగా? గోరా రాగానే ముహూర్తం పెట్టుకుందా మన్నాడు."

ఆనందమయి తల అడ్డంగా తిప్పి. "లేదు మహిమ్. నువు పూర్తిగా పొర పడ్డావు నామాట నమ్ము," అన్నది.

"నువ్వీ విషయంలో జోక్యం కలిగించుకోకుండా ఉంటే అంతా సవ్యంగా జరిగిపోతుంది," అంటూ మహిముడు కోపంగా వెళ్ళిపోయాడు.

*                    *                    *

"మనం బ్రహ్మసమాజికులమని హిందువుల పిల్లలు మా దగ్గర చదువుకో నంటా ఉన్నారు. అందుచేత వివరన్నా హిందువును సాయం తెచ్చుకుంటే ఎలా ఉంటుంది, నాన్నా?" అని లలిత పరేశబాబు నడిగింది.

"హిందువు లెవరు దొరుకుతారమ్మా?" అన్నాడు పరేశబాబు

"ఏదేం కష్టం - పనికొచ్చేవాళ్ళు చాలామంది ఉన్నారు వినయబాబుగారి..."

"వినయుడా? అతను నెందుకొప్పుకుంటాడు?"

ఇది లలితకు చాలా అవమానమయింది. తాను వినయుణ్ణి ఒప్పించలేకపోతే ఇంకెందుకు? "అతను నెందు కొప్పుకోడంటావు?" అన్న దామె.

"కొంచెం ఆలోచించినట్టయితే అతను నెంతమాత్రమూ ఒప్పుకోడు."

లలితముఖం జేవురించింది. ఆమె తన చీరకొంగున ఉన్న తాళపుచెవులగుత్తిని గలగల లాడిస్తూ ఆందోళనతో, "అయితే మరి ఈ స్కూలు సాగదా, నాన్నా?" అన్నది.

" ప్రస్తుతానికి కన్నీ ప్రతిబంధకాలే కనిపిస్తున్నాయి. కాదు కూడదని ముందుకు వెళ్ళావో రకరకాల విమర్శలు బయలుదేరుతాయి."

ఇంత అక్రమాన్ని సహించటం లలితను చాలా బాధపెట్టింది. ఇది పాను బాబుకు విజయం. తన తండ్రికాక మరెవరు తనను తిరోగమించమన్నా లలిత లక్ష్యపెట్టివుండదు. ఆమె లేచి తనగదికి వెళ్ళిపోయింది.

అక్కడ ఆమెకు వచ్చిన ఉత్తరం ఒకటి వున్నది. పెళ్ళాడి, బంకిపూరులో కాపురం చేస్తున్న చిన్ననాటి సహాధ్యాయిని శైలబాల రాసింది. "...నిన్నుగురించి పుకార్లు విని చాలా బాధపడ్డాను. ఒకానొకరు (పేరు దేనికిలే) నిన్నుగురించి దారుణమైనవార్త తెలుపుతూ రాశారు. అదే మరొకరు రాస్తే నమ్మకపోదును. నువ్వు నిజంగా ఒక హిందూ యువకుణ్ని పెళ్ళాడదామని చూస్తున్నావా? ఇదే నిజమైతే..."

లలితకు కోపం వచ్చి వెంటనే జవాబు రాసింది.

"...నిజమా, అబద్ధమా అని ప్రశ్నించడం చాలా విడ్డూరంగా వుంది. బ్రహ్మసామాజికుల మాటకు ఇతర సాక్ష్యం కావాలా? ఎవరో హిందూ యువకుణ్ణి నేను పెళ్ళాడజూస్తున్నందుకు నన్ను చూసి సువ్వెంత ఆశ్చర్యపడాలా? నేనొకటి చెబుతాను విను. సుప్రసిద్ధులయిన బ్రాహ్మయువకుల్లో కొందరిని పెళ్ళాడాలంటే నాకు కంపరం పుట్టుకొస్తుంది. ఏ బ్రహ్మకన్య అయినా గర్వంగా పెళ్ళాడదగిన హిందూ యువకులను ఒకరిద్దరిని నే నెరుగుదును. ఇప్పుడింతకంటె నీకేమీ రాయలేను..."

పరేశబాబు ఆనాడు మరేపనీ చెయ్యలేక విచారంలో పడిపోయాడు. ఆయన సుచరితవద్దకు వెళ్ళి, "లలితను గురించి గట్టిగా ఆలోచించవలసిన సమయం వచ్చింది," అన్నాడు.

"నాకు తెలుసు నాన్నా," అన్నది సుచరిత.

"నేను అపవాదుగురించి ఆలోచించడంలేదు. లలితకు నిజంగా..."

"లలిత ఈమధ్య నాతో మనసువిప్పి చెప్పటంలేదు."

"లలిత చాలా పెద్దసమస్యతో సతమతమవుతున్నది. దాన్ని ఇతరులతో చెప్పదు. వినయుణ్ని మన ఇంటికి స్వేచ్ఛగా రానిచ్చి లలితకు కష్టం తెచ్చి పెట్టానా?"

"వినయుడు నిష్కల్మషుడని నీకు తెలియదా, నాన్నా? అతని స్వభావంలో లొల్లున్నదిలేదు. అలాటివాళ్ళు చాలా అరుదు," అన్నది సుచరిత.

పరేశబాబు మనస్సు అకస్మికంగా తేలికపడింది. ఆయన స్వేచ్ఛగా ఊపిరి తీయగలిగాడు.

"ఇవాళ నీ దగ్గిర మంచిపాఠం నేర్చుకున్నానమ్మా." అన్నా డాయన.

"అబ్బే; అదేంమాట, నాన్నా?" అంటూ సుచరిత ఆయన పాదా లంటుకున్నది.

"పాక్షిక బుద్ధి ఆవహించినప్పుడు, మానవుడు తానెప్పుడన్న అల్పసత్యాన్ని కూడా మరిచిపోతాం. ఆ సుడిగుండంలోపడి, వాడు హిందువుడా, బ్రహ్మసామాజి కూడా అన్నదానికి ప్రాముఖ్యం ఇస్తాం. నే నలాటి సుడిగుండంలోనే పడిపోయాను. లలిత ఆడపిల్లల బడి ప్రారంభించాలని చాలా పట్టుదలగా ఉన్నది; వినయుడి సహాయం తీసుకోవటానికి నా అనుమతి కోరింది." అన్నా డాయన.

"తొందరపడవద్దు, నాన్నా! లేకపోతే అమ్మ చిరాకుపడుతుంది," అన్నది సుచరిత.

నాలుగురోజులు గడిచాక, శైలబాలకు లలిత రాసిన ఉత్తరం పట్టుకుని, పానుబాబు వారదపద్దకు వచ్చి, "ఇదుగో తెరవెనక జరిగే భాగోతం!" అంటూ ఉత్తరాన్ని ఆమె కిచ్చాడు.

ఆమె ఉత్తరమంతా చదివి, "ఈ జరిగే అంతకూ మూలకారణం ఆ సుచరితే దాన్ని మీరంతా బ్రహ్మరథం పట్టి, బ్రహ్మసమాజంలో అలాటి పిల్ల లేదని తెగ పొగిడేశారు. దాని అసలుస్వభావం నాకు మొదటినుంచీ తెలుసు. ఈ ఉత్తరం నాకు చూపటంకూడా దేనికి? మీ కేం చెయ్యాలనితోస్తే అలా చెయ్యండి," అన్నది

పరేశబాబును పిలిపించి, లలిత ఉత్తరం ఆయన కిచ్చాడు. ఆయన ఆ ఉత్తరాన్ని రెండుసార్లు చదివి "ఏముంది ఇందులో?" అన్నాడు.

"ఇం కేముండాలి? ఇం కెంత సాక్ష్యం కావాలి? విగ్రహారాధన సహించారు. కులతత్వం సహించారు మీ కూతుర్ని హిందువుడి కిచ్చి పెళ్ళి చెయ్యటం ఒకటే కాలివాయి! ఆ తరవాత మీరుకూడా హిందువుల్లో చేరిపోయి, ముక్కు మూసుకుని తపస్సు చేసుకోవచ్చు," అన్నది భార్య.

"లలిత హిందువుణ్ణి చేసుకోవటానికి నిశ్చయించినట్టు ఎవరంతా ఎందు కను కుంటున్నారో నాకు బోధపడలేదు. అలాగని ఈ ఉత్తరంలో ఎక్కడాలేదు," అన్నాడు పాపరేశబు.

"దేనితో మీ కళ్ళు తెరుచుకుంటాయో నా కీ క్షణానికూడా తెలీకుండా ఉంది. ఈ ఉత్తరంలో కన్న స్పష్టంగా రాయటం ఎలా?" అన్నది భార్య.

లలితనే పిలిచి, ఆ ఉత్తరం రాయటంలో ఆమె ఉద్దేశం అడిగి తెలుసుకుందా

మన్నాడు పానుబాబు ఎవరూ పిలవకముందే లలిత తుఫానులాగా ప్రవేశించి, "నాన్నా, ఈ ఉత్తరం చూడు. మన బ్రహ్మసమాజంనుంచే ఇలాటి ఆకాశరామన్న ఉత్తరాలు వస్తున్నాయి." అన్నది

పరేశబాబు ఆ ఉత్తరాన్ని చదివారు. ఆ ఉత్తరం రాసిన అనామకుడు లలితా వినయుల పెళ్ళి రహస్యంగా అదివరకే స్థిరపడ్డట్టు భావించి, వినయుడు తన బ్రహ్మ సమాజపు భార్యతో త్వరలోనే విసిగి మరొక హిందూస్త్రీని పెళ్ళాడతాడని జోస్యం చెప్పాడు. ఉత్తరం నిందాపూరితంగానూ లలితకు హితబోధ చేస్తున్నట్టూ ఉన్నది.

పానుబాబు ఉత్తరం తీసుకుని చదివి, "లలితా! ఈ ఉత్తరం చదివి నీ కాగ్రహం కలిగింది కాని అలాటి ఉత్తరానికి కారకురాలు నువ్వే కదా? ఇలాటి ఉత్తరం ను వెలా రాసుగలిగావు?" అన్నాడు.

"అయితే మైత్రులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నది మీరే నన్న మాట!" అన్నది లలిత.

"సమాజంపట్ల తనకుగల బాధ్యతల గుర్తించి, ఆమె నీ ఉత్తరం నాకు చూపింది" అన్నాడు పానుబాబు,

"ఇంతకూ బ్రహ్మసమాజం అనే దేమిటి?" అని లలిత విలవదీసినట్టు అడిగింది.

"నిన్నూ వినయబాబునూ గురించి సమాజంలో అంటూ చెప్పుకుంటున్న మాట నేను నమ్మటం లేదనుకో. అది అబద్ధమని నీ నోటితోనే స్పష్టంగా వినాలని ఉంది," అన్నాడు పానుబాబు.

లలిత జిగేలున మెరిసేకళ్ళతో. "మీ కెందుకు సందేహం కలగటంలేదూ?" అన్నది

పరేశబాబు ఆమె భుజంమీద చెయ్యి వేసి, "లలితా, నువ్వు మరీ ఉద్రేకంలో ఉన్నావు ఈ విషయం ఇప్పుడు చర్చించటం మంచిదికాదు. తరవాత నాతో చెబుదువుగాని," అన్నాడు.

"తీరా ఆరంభించిన చర్చను పడగొట్టకండి పరేశబాబూ," అన్నాడు పానుబాబు.

ఈ మాటతో లలిత మరింత రెచ్చిపోయి, "నాన్నను తప్పుపట్ట నవసరం లేదు. ఆయనకు మీలాగా నిజమంటే బెదురులేదు నేను వినయుణ్ణి పెళ్ళాడటంలో తప్పుగాని, అసంభావ్యంగాని ఏమీ లేదంటున్నాను," అన్నది.

"ఆయన బ్రహ్మమతం పుచ్చుకోవటానికి నిశ్చయించాడా?"

"ఏమిటి దాని అవసరం?"

పరేశబాబు భార్య కలిగించుకుని, "లలితా, ఏమిటి నువ్వనేది?" నీ కేమైనా మతి పోయిందా ?" అన్నది.

"నా కేమీ మతి పోలేదు. నన్ను నలుగురూ చుట్టుముట్టి ఇలా ఊదర పెడితే నేను సహించను. పానుబాబూ! మీ కొక్క సలహా ఇస్తాను. మీకన్న అన్ని విధాలా గొప్పవాళ్ళకు ఎన్నడూ సలహా ఇవ్వకండి." అంటూ లలిత అక్కడినుంచి వెళ్ళిపోయింది.

జరిగినదంతా లలితనుంచి విని సుచరిత, "నాకు భయంగా ఉంది," అన్నది. బ్రహ్మసమాజంలో ఇంత దుమారం రేగుతున్నది గదా: వినయుడు లలితను పెళ్ళాడనంటాడేమో నన్నదే ఆమె భయం.

''ఆయన ఒప్పుకుంటారు,'' అన్నది లలిత ధీమాగా. తాను తొందరపడి ఏమీ చెయ్యలేదనీ, పానుబాబు ముఠావాళ్ళు తనను ఎంత వేటాడినా తనకు భయంలేదనీ, తాను వాళ్ళకు లొంగేమాట కల్ల అనీ కూడా ఆమె చెప్పింది. తన స్వేచ్ఛకు పరేశబాబు ఎలాటి అవరోధమూ కలిగించడని ఆమెకు స్పష్టంగా తెలుసు.

''నాన్నగారు ఒప్పుకుంటారే అనుకుందాం. ఏం చెయ్యదలిచావు ?" అని అడిగి, లలిత జవాబు చెప్పేలోపుగానే, ''నువ్వేమీ చెయ్యక్కర్లేదు. నే నొక ఉపాయం ఆలోచించాను," అనేసింది సుచరిత.

ఆ సాయంకాలం పరేశబాబు సుచరితవద్దకు వచ్చాడు. ఆయన ఆందోళనగా కనపడటం గమనించి సుచరిత కారణ మడిగింది.

''నాకు మరేమీ ఆందోళన లేదు—తాను లేపిన దుమారానికి లలిత తట్టుకోగలదా అని! ఉద్రేకంతో తలఎత్తిన అహంకారం ఫలితాన్ని అనుభవించవలసినప్పుడు నిలబడదు. కనీసం తన భావికర్తవ్యం ఏమిటో లలిత నిర్ణయించుకున్నదా ?'' అన్నాడు పరేశబాబు.

"ఒక్కటి చెప్పగలను. లలిత క్రోధావేశంతో ఈ తిరుగుబాటు చెయ్యలేదు. దీనివల్ల ఏనష్టం కలిగినా ఎదుర్కొంటుంది. ఎంతోకాలంగా దాని మనసులో ఉండే భావాలే ఈ దెబ్బతో పైకి వచ్చాయి. లలితలాటి మనిషిని బలవంతాన నిగ్రహించటం మంచికాదు,'' అన్నది సుచరిత.

"కాని వినయుడు బ్రహ్మసమాజంలో చేరుతాడా ?"

"ఏమో ? మనం వెళ్ళి గౌరబాబుతల్లిని ఒకసారి చూస్తే ?

"నువ్వు వెళితే బాగుంటుం దనుకుంటున్నాను," అన్నాడు పరేశబాబు

# 5

వినయుడికి కూడా ఒక ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది దానిలో ఉన్నదేమంటే: వినయుడు లలితను పెళ్ళాడటం వాంఛనీయం కాదు; అందువల్ల వినయుడికి సుఖం లేకపోగా లలిత జీవితం నాశనమవుతుంది; అదీగాక, లలితకు ఊపిరితిత్తుల జబ్బువున్నది; క్షయ కావచ్చునని వైద్యులు శంకిస్తున్నారు

మెడమీద తల ఉన్నవాడెవడూ అలాటి ఉత్తరం వ్రాస్తాడని వినయుడనుకోలేదు లలితకూ, తనకూ సాంఘికాచారాలలో గల వ్యత్యాసంవల్ల వాళ్ళిద్దరికీ మధ్య పెళ్ళి అనూహ్యం అందుకనే అతను తన ప్రేమను దోషంగా పరిగణించుకుంటూ వస్తున్నాడు.

అయినా బ్రహ్మసమాజంవాళ్ళలో తనకూ లలితకూ పెళ్ళి సాధ్యమన్న భావం వ్యాపించిఉండటం తెలుసుకుని, అతను ఒకవిధంగా ఆనందం పొందాడు.

ఇంతలో పానుబాబు ప్రత్యక్షమయాడు వెంటనే ఆకాశరామన్న ఉత్తరంవెనక ఏమున్నదీ వినయుడికి తెలిసిపోయింది పానుబాబు వెంటనే అసలువిషయానికి రాక, మనుషుల ప్రవర్తనగురించీ, అందువల్ల ఇతరులకు కలిగే చిక్కులను మనుషులు గ్రహించకపోవటం గురించీ దొంకతిరుగుడుగా ఉపన్యసించసాగాడు.

"ఇదంతా అనవసరం. అసలువిషయానికి రండి. నేను మీదపడి కొట్టను," అన్నాడు వినయుడు.

"మీరు హిందువై ఉండి పరేశబాబుగారింటికి వస్తూ పోతూ, వారికుమార్తెల మీద ప్రవాదులు పుట్టేలాగ చెయ్యటం భావ్యమేనా?" అన్నాడు పానుబాబు.

"చూడండి, పానుబాబూ! జనం సృష్టించే ప్రవాదులకు నేను బాధ్యుణ్ణికాను. మీ బ్రహ్మసమాజంవాళ్ళు పరేశబాబుగారి కుమార్తెలను గురించి ప్రవాదులాడటం సమాజంవారికే తలవంపులుగాని, పరేశబాబు కుమార్తెలకుగాదు," అన్నాడు వినయుడు.

"ఒకపిల్ల తన తల్లిచాటున ఉండక, పరాయివాడితో స్టీమరులో ప్రయాణిస్తే నలుగురూ అనుకోరా?"

"బాహ్యసంఘటనలనూ, మనుష్యుల మనస్తత్వాలనూ ఏకంచేసి చూడదలిచిన పక్షంలో మీరు హిందూసమాజాన్ని వదలి బ్రహ్మసమాజంలో ఎందుకు చేరవలసి వచ్చిందో చెప్పగలరా? అయినా ఈ విషయాలు చర్చించి ప్రయోజనం లేదు. నా ధర్మం ఏమిటో నేను నిర్ణయించుకోగలను. అందులో మీరు నాకు రవంత సహాయంకూడా చెయ్యలేరు."

పానుబాబు వెళ్ళినాక వినయుడు చాలా వ్యధపడ్డాడు. తన కారణంగా పరేశబాబు కుమార్తెలపైన కళంకం ఆపాదించబడటమూ, లలిత భవిష్యత్తుకు అపాయం కలగటమూ అన్న ఆలోచనలు అతన్ని బాధించాయి.

వినయుడి ఇంట అతనికీ, పానుబాబుకూ సంభాషణ నడిచే సమయంలోనే అవినాశుడు ఆనందమయివద్దకు వచ్చి, వినయుడు లలితను పెళ్ళిచేసుకోబోతున్నాడనీ, బ్రహ్మసమాజంవాళ్ళద్వారా తనకీ సంగతి రూఢిగా తెలిసిందనీ, వినయుడు చివరకిలాటి పని చేస్తాడని తాను గోరాతో ఏనాడో అన్నాననీ చెప్పాడు. అతను వెళ్ళిపోతూ మహిముడి చెవినకూడా ఈ శుభవార్త వేసి మరీ వెళ్ళాడు.

అవినాశుడి మాటలు ఆనందమయి నమ్మలేదు. వినయుడు లలితను పెళ్ళి చేసుకునేదాగా వస్తే, ఆ సంగతి తనకు ఏనాడో తెలిసేది. వినయుడు చూచాయగానైనా ఆమాట ఆమెతో అనిఉండలేదు. అందుచేత ఆమె ఆపూట వినయుడికి భోజనం పెట్టినాక, "ఏం నాయనా, అలా ఉన్నావు?" అని అడిగింది.

వినయుడు తనకు వచ్చిన ఆకాశరామన్న ఉత్తరాన్ని ఆమెకిచ్చి, తనకూ పానుబాబుకూ మధ్య జరిగిన ఘర్షణ గురించి చెప్పాడు.

"ఇందులో అపవాదేముంది? నువ్వు పరేశబాబు కుమార్తెను పెళ్ళాడబోతున్నట్టు చెప్పుకుంటున్నారటగా?'' అన్నది ఆనందమయి.

"మా వివాహం సాధ్యమై ఉంటే అపవాదుండకపోను. కాని అది సాధ్యంకాదు కదా,'' అన్నాడు వినయుడు.

''నీకు సాహసం ఉంటే లలితను పెళ్ళాడి ఆమెపైన పడిన అపవాదును తొలగించు," అన్నది ఆనందమయి

"ఏమిటమ్మా నువ్వనేది? నీ వినయుడు ఎక్కడినుంచో ఊడిపడ్డాడనుకుంటున్నావా? నేను చేసుకుంటా ననగానే లలిత ఎగిరి గంతేస్తుందా?"

"నాకా భయం లేదు. అయినా నీ చేతిలో వున్నపని నువ్వు చెయ్యి. నువ్వు చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నా ననటానికేం?''

"దాన్ని లలిత అవమానంగా భావిస్తే?"

"కొత్తగా వచ్చే అవమాన మేమిటి? మీ రిద్దరూ పెళ్ళాడతారని జనం చెప్పుకుంటూనే ఉండిరిగా?'

"కాని మనం గోరా సంగతికూడా ఆలోచించాలిగా?''

''ఇది గోరాను సంప్రదించే విషయంకాదు. వాడికి కోపం వస్తుందని నాకు

తెలుసు. కాని మన మేం చెయ్యగలం? నీకు లలితపట్ల ఏమాత్రం ఆదరం ఉన్నా వాళ్ళ సమాజంవాళ్ళు ఆమెపైన చేసే దుష్ప్రచారాన్ని అరికట్టితీరాలి."

వాళ్ళిలా మాట్లాడుతుండగా మహిముడు వచ్చి వినయుణ్ణి నానా దుర్భాషలూ ఆడాడు పరేశబాబు కుటుంబం వినయుణ్ణి బుట్టలో వేసుకున్నదన్నాడు వాళ్ళు వినయుణ్ణి నాశనం చేస్తారన్నాడు. అతను వెళ్ళినదాకా వినయుడు తలవంచుకుని, నోరెత్తలేదు.

మహిముడు వెళ్ళగానే ఆనందమయి వినయుడితో, "నీవు వెళ్ళి పరేశబాబుతో మాట్లాడు అలా అయితే అన్ని చిక్కులూ విడిపోతాయి," అన్నది.

ఆమె సుచరితను చూచి "ఈ గొడవ వినగానే కంగారుపడి వచ్చాను. తప్పు వినయుడిదేనా? వాడు నేరమంతా తనమీద వేసుకుని మహాబాధ పడుతున్నాడు," అన్నది.

"లేదు, లేదు. ఈ అల్లరంతా లలిత చేజేతులా తెచ్చిపెట్టుకున్నదే. ఆ స్టీమరులోనే లలితకూడా ఎక్కుతుందని వినయబాబుకు తెలియదు. వాళ్ళిద్దరూ కూడబలుక్కుని స్టీమరుప్రయాణం చేసినట్టుగా అంతా మాట్లాడుకుంటున్నారు. అభిమానంకొద్దీ లలిత నిజం చెప్పటంలేదు," అన్నది సుచరిత.

"ఏమైనా దీన్నిగురించి ఏదో ఒకటి చెయ్యలిగదా!" అన్నది ఆనందమయి. లలితకోసం వినయు డేమైనా చెయ్యటానికి సిద్ధంగా ఉంటాడని ఆమె సూచించింది.

"లలితకూడా పెళ్ళికి ఒప్పుకుంటుంది దానిమనసు నాకు తెలుసు. కాని వినయబాబు తన సమాజాన్ని విడిచిపెడతారా?" అన్నది సుచరిత.

"తప్పనిసరి అయితే విడుస్తాడేమో. కాని అది అవసరమా? నాయింటో దిగినవాళ్ళు పాటించే ఆచారాలన్నీ నేను పాటించను. నన్ను వాళ్ళు కిరస్తానీ అంటారు. అంతమాత్రాన అది నాయిల్లు కాకపోయిందా? వాళ్లు నావాళ్ళు కాకపోయారా? మనుషులు కలవటానికి అభిప్రాయభేదాలు అడ్డురావాలా?" అన్నది ఆనందమయి.

ఈ ధోరణిలో ఆనందమయి చాలాసేపు మాట్లాడింది. వారి సంభాషణ మధ్య లలితకూడా వచ్చింది. కాని ఆనందమయి వాదన సుచరిత అభిప్రాయాన్ని మార్చినట్టు కనబడలేదు. ఆనందమయికి నిరాశ కలిగింది. అసలుసంగతేమంటే గోరాకు సుచరితను చేసుకోవాలని ఆమె కోరిక. గోరాకు హిందువుల పిల్లనిచ్చి చెయ్యటం సమ్మతంకాక ఆనందమయి చాలా సంబంధాలు తిప్పికొట్టింది, గోరాకు పెళ్ళి ఇష్టం లేదని చెప్పింది. ఇంక రెండుమూడు రోజులలో గోరా విడుదల అయివస్తాడు.

ఈలోపల సుచరితను కదిలించి చూతా మనుకున్నది ఆనందమయి. కాని సుచరిత కనలలేదు. దంపతులిద్దరూ ఒకే సమాజానికి చెందిఉండాలన్న విశ్వాసాన్ని ఆమె ఆనందమయి మాటలు విని వదులుకునేలాగా కనబడలేదు.

ఈలోపల వినయుడు పరేశబాబు దగ్గరకు వెళ్ళి, లలితపైన వచ్చిన అపవాదును రద్దుచెయ్యటానికి తాను ఆమెను పెళ్ళాడటానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు.

"ఈ అలజడి అంత ముఖ్యమైనదికాదు. వాళ్ళు ఇవాళ గోలగా చెప్పుకున్నది రేపు మరిచిపోతారు. ఇందుకోసమై నువ్వు తొందరపడి ఎలాటిత్యాగమూ చెయ్యనవసరంలేదు," అన్నాడు పరేశబాబు.

"నేను అచ్చగా నా ధర్మంగా భావించి ఈ సూచన చెయ్యటంలేదు. మీరు సరే నన్నట్టయితే ఎంతో సంతోషంగా — నేను భయపడిందల్లా —" అని వినయుడు తడువుకున్నాడు.

"నీ భయానికి కారణ మేమీ లేదు. లలితకు నువ్వంటే ఇష్టమని సుచరిత నాతో అన్నది," అన్నాడు పరేశబాబు.

ఒక్కసారిగా వినయుడి శరీరం ఆనందంతో పులకించింది: "నే నామెకు తగిన వాణ్ణని మీకు తోస్తే నాఅంత భాగ్యశాలి ఉండడు," అన్నాడు.

వినయుణ్ణి అక్కడే ఉండమని పరేశబాబు తనభార్యను చూడబోయాడు. తరవాత వినయుణ్ణి పైకిపిలిచాడు. అతన్ని చూస్తూనే పరేశబాబుభార్య, "మతం పుచ్చుకోవటానికి ముహూర్తం నిర్ణయించవలసిఉంటుంది," అన్నది.

"మతం పుచ్చుకోవటం తప్పనిసరా?" అన్నాడు వినయుడు.

"అదేమన్నమాట? తప్పనిసరికాదా? లేకుండా బ్రహ్మసామాజికుల పిల్ల నెలా పెళ్ళిచేసుకుంటారు?" అన్నదామె.

"బ్రహ్మసమాజ మంటే నాకుచాలా అభిమానం. దానికి వ్యతిరేకంగా నే నెన్నడూ ప్రవర్తించలేదుకూడా."

"అలాంటప్పుడు మతం పుచ్చుకోవటాని కేం?"

"ఏమీలేదు. కాని నేను హిందూసమాజాన్ని త్యజించలేను."

"అలాటప్పుడీ ప్రస్తావన తేవటమేతప్పు. మా పిల్లలను పెళ్ళాడేది మమ్మల్ని చూసి జాలిపడా, లేక మా ఉద్ధరింపుకా?"

తనసూచన వారి కవమానకర మయిందని తెలిసి వినయుడు చాలా బాధపడ్డాడు. తాను లలితను పెళ్ళాడటానికి పరేశబాబు సమ్మతించడని తేలిపోయింది. "నన్ను మన్నించండి," అని అతను అక్కడినుంచి బయల్దేరాడు. వెళ్ళిపోతుండగా ఎదండా

మూల లలిత ఉత్తరాలు రాసుకుంటూ, అతని అడుగులచప్పుడుకు తల ఎత్తిచూసి, ఆందోళన చెందింది. అతను ఆమెను చూసి తలవంచి, మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

# 6

గోరా జైలునుంచి విడుదల అయి బయటికి వచ్చేసరికి అతనికోసం పరేశబాబూ, వినయుడూ వేచిఉన్నారు. పరేశబాబును చూడగానే గోరాకు ఎన్నడూ లేనంత ఆనందం పొంగివచ్చి, ఆయన పాదాలు తాకి ప్రణామం చేశాడు. వారు ముగ్గురూ కలిసి బండిలో ఎక్కబోతూండగా, అవినాశుడు కొంతమందిని వెంటబెట్టుకుని వచ్చి, రోడ్డు పక్కనే గోరాకు గొప్ప సన్మానసభ జరప యత్నించాడు. అతను తెచ్చిన పూలదండలూ అందరూ కలిసి పాడిన పాటా చూసి గోరా చీదరించుకుని "ఆపండి. ఆపండి! ఏమిటీ ఫార్సు?" అని అరిచాడు.

స్టీమరులో వాళ్ళు కలకత్తాకు తిరిగి వచ్చాక, గోరా కృష్ణదయాళుడితో, "జైలులో నేను అపవిత్రుణ్ణయాను ప్రాయశ్చిత్తం చేయించుకుంటాను," అన్నాడు.

అలాటి దేమీ అవసరం లేదు నీ విషయంలో ఎలాటి ప్రాయశ్చిత్తమూ అక్కర్లేదు; నా మాట నమ్ము," అన్నాడు కృష్ణదయాళుడు. ఆచారాలను గురించి ఎంతో పట్టుదల గల తన తండ్రి తన ప్రాయశ్చిత్తాన్ని అంత తీవ్రంగా ఎందుకు వ్యతిరేకిస్తున్నదీ గోరాకు బోధపడలేదు. భోజనాలదగ్గర కూడా, వినయుడు మైలపడిపోతాడని గోరా కొంచెం ఎడంగా కూర్చుని భోంచేశాడు.

భోజనా లయాక, గోరావద్దకు మహిముడు వచ్చి, వినయుడికీ తన కూతురికీ పెళ్ళిరోజు నిశ్చయించమనీ, లేకపోతే వినయుడు ఏ బ్రహ్మసామాజికులనో పెళ్ళి చేసుకుని మత భ్రష్టు డవుతాడనీ గట్టిగా చెప్పివెళ్ళాడు.

"ఏమిటిదంతా?" అని గోరా వినయుణ్ణి అడిగాడు.

"అది కొద్దిలో చెడితే తేలేది కాదు. అసలు విషయం మేమంటే, నేను లలితను పెళ్ళాడని పక్షంలో ఆమె యావజ్జీవమూ వాళ్ళ సమాజంవారిచేత తిట్లు తినే పరిస్థితి ఏర్పడింది. ఆ పరిస్థితినుంచి ఆమెను కాపాడటం నా చేతిలో ఉన్నది," అన్నాడు వినయుడు.

గోరా మండిపడ్డాడు; లలితకు న్యాయం చెయ్యటంకోసం నీ సమాజానికి ద్రోహం చేస్తావా అన్నాడు. తాను లలితను వివాహం చెసుకోబోవటం లేదని చెప్పక వినయుడు వివాహం చేసుకోవటం న్యాక్రమమేనని వాదించాడు. మతం మనుషుల కోసమేగాని, మనుషులు మతంకోసం కాదన్నాడు. ఇద్దరూ ఘాటుగానే వాదించు

కున్నారు. వినయుడి సవాళ్ళకు గోరా సమాధానం చెప్పలేక, "నన్ను బాధించేటట్లా నువ్వు ఒక బ్రాహ్మకన్యకోసం నీ సమాజానికి దూరం కాగలుగుతున్నావు. నాకది సాధ్యంకాదు ఎన్ని లోపాలుండనీ, నాకు భారతదేశం కావాలి. దానికీ నాకూ మధ్య వెంట్రుకవాసి ఎడం ఏర్పడ్డా నేను సహించలేను," అన్నాడు.

గోరా ఈ మనోవేదనను మరవలేకపోయాడు. వినయుడు ఒక పిల్లమీది మోజుతో, ఇంతకాలమయ్యాక, తనకు శాశ్వతంగా దూరం కాబోతున్నాడు. అవినాశుడు మళ్ళీ కొంతమందిని వెంటవేసుకు వచ్చి, గోరా ఆర్యధర్మాన్ని ఉద్ధరించటానికి పుట్టిన అవతారపురుషుడని ఉపన్యాసం ఇచ్చి, అందరిచేతా గోరాకు జేజేలు కొట్టించాడు. గోరాకు తాను ఒంటరిగాడైపోయినట్టు భావన కలిగింది.

ఇంతలో ఆనందమయి అతన్ని రమ్మని కబురుచేసింది. అతను వెళ్ళేసరికి ఆనందమయి వెంట సుచరిత ఉన్నది. సుచరితకు ఇప్పుడు గోరామనసులో ప్రత్యేక స్థానమున్నది. ఆమెవంటివాళ్ళే అతని దేశంలో ఆడవాళ్ళుకూడా ఉన్నారన్నది మొదటిసారి గుర్తించాడు. జైలులో ఉన్న నెలరోజులూ అతను విడవకుండా ఆమెను స్మరించి, జైలు పరిసరాలు అవాస్తవికంగా కనబడేటట్లు చేసుకున్నాడు. వినయుడు బ్రాహ్మబాలికను 'సుకోరాణి' వాదించినప్పుడు, గోరా ఆ వాదనను కొంతవరకు తనకే చెప్పుకున్నాడుకూడా. అందుచేత, అనుకోకుండా సుచరిత కనిపించేసరికి అతనికి ఆశ్చర్యానందాలు కలిగాయి. అతనామెను చూస్తూనే, "మీరిక్కడ ఉన్నారా?" అన్నాడు.

గోరా జైలుమూలంగా చిక్కిపోయి, కాంతి తరిగి ఉండటం సుచరిత గమనించింది. ఆమెకు అతనిపైన గౌరవం మరింత పెరిగింది.

"నువ్వు లేని రోజుల్లో సుచరిత ద్వారా నేనెంత ఊరటపొందానో చెప్పలేను. నాకొక కూతురుంటే ఎంత సుఖపడిఉండునో ఇప్పుడు తెలిసి వస్తున్నది." అన్నది ఆనందమయి.

సుచరిత కొంచెంసేపు కూర్చుని, వెళ్ళిపోతూ వినయుణ్ణి తమ ఇంటికి రమ్మని ఆహ్వానించింది. ఆమె తనను ఆహ్వానించలేదని గోరా కొంచెం కష్టపడ్డాడు. కాని, అందుకు కారణం గ్రహించాక లోపం తనలోనే ఉందని అతను గ్రహించాడు: వినయుడు ఏ మనుషుల మధ్యనైనా మసలగలడు. అది గోరాకు చేతగాకపోవటం అతని లోపమే.

లలితను గురించి మాట్లాడటానికే సుచరిత వినయుణ్ణి తమ ఇంటికి పిలిచింది. అతన్ని చూడగానే ఆమె, "చూడండి, వినయబాబూ! అంతస్సులో ప్రతిబంధకాలు

లేనప్పుడు ఇలాంటి అవాంతరాలను పాటించ వలసిన అవసర మేమిటి?'' అని అడిగింది.

''ఇలాంటి అవాంతరాలను బొత్తిగా తృణీకరించగలమా?'' అన్నాడు వినయుడు.

మతం వ్యక్తికి సంబంధించినదా, సమాజానికి సంబంధించినదా అన్న సమస్య గురించి ఇద్దరూ వితర్కిస్తుండగా సతీశుడొక పత్రికా, ఒక చీటీ తెచ్చి సుచరిత కిచ్చాడు.

పత్రిక బ్రహ్మసమాజం వాళ్ళది. అందులో లలితా వినయుల పెళ్ళి తప్పిపోయిం దనీ, దానికి కారణం వినయుడు మతం మార్చుకోను నిరాకరించడమే ననీ, పేర్లు లేకుండా వార్త వేశారు.

వినయుడు తన ఇంట ఉన్నట్టు తెలపకుండా, సుచరిత లలిత నొకసారి రమ్మని కబురుచేసి, తాను స్నానం చెయ్యబోయింది. ఈలోపుగా హరిమోహిని వంట ఇంట్లోనుంచి వచ్చి వినయుడితో ఏదో సంభాషణ ప్రారంభించింది. అంతలో లలిత వచ్చి, వినయుణ్ణి చూసి, కోపంతో ముఖం పెట్టింది. అది వినయుడికి పరిచితమైన ముఖమే. కాస్సేపు చూసి లలిత, ''నేను వెళ్ళాలి. మరొకసారి వస్తానని దీదీకి చెప్పు,'' అని హరిమోహినితో అని వెళ్ళిపోయింది.

సుచరిత స్నానం చేసివచ్చేలోపల వినయుడు పత్రిక తీసి, అందులో గుర్తుపెట్టి ఉన్న వార్త చదివాడు. సమాజంవాళ్ళు లలితను పొనపఱుం మానరని అతనికి తెలిసిపోయింది.

సుచరిత స్నానం చేసివచ్చి, సతీశుడికి భోజనం పెట్టి స్కూలుకు పంపింది. తరవాత వినయుడు చేతులూ, కాళ్ళూ కడుక్కోకుండా భోజనానికి కూర్చోవటం చూసి హరిమోహిని, "మన హిందూ ఆచారాలంటే లక్ష్యం లేకపోతే బ్రహ్మ సమాజంలో చేరరాదా, నాయనా?'' అన్నది.

''హిందూమతమంటే నిషేధాలూ, నియమాలూ తప్ప ఇంకేమీ లేదని తోచి నప్పుడు బ్రహ్మసమాజంలో కాకపోతే, తురకల్లోనో, క్రిస్తానీల్లోనో చేరతాను. కాని హిందూమతమంటే ఇంకా కొంతనమ్మకం ఉన్నది." అన్నాడు వినయుడు.

సుచరిత ఇంటినుంచి బయలుదేరిన వినయుడు ఒక తోట చేరి, అక్కడ ఒక చెట్టునీడన కూర్చుని తన పరిస్థితి గురించి ఆలోచించసాగాడు. అతనికి తెలియకుండానే పొద్దువాలింది. సతీశుడు బడినుంచి వస్తూ అతన్ని చూసి, "హా యింటికి పోదాండా:" అని చెయ్యిపట్టుకుని వదల్లేదు.

వాళ్ళిద్దరూ పరేశబాబు ఇంటిదాకా వచ్చేసరికి వినయుడు తల ఎత్తి, పైఅంతస్తు గదిలో ఉన్న పరేశబాబునూ, వీధికి వీపుపెట్టి కూర్చునిఉన్న లలితనూ చూశాడు.

వెంటనే అతను సతీశుణ్ణి పిలిపించుకుని లోపలికి వెళ్ళి, మెట్లెక్కి పైకి వెళ్ళాడు. గదిలో పరేశబాబు మాత్రమే ఉన్నాడు; లలిత వెళ్ళిపోయింది.

వినయుడు పరేశబాబు చూపిన కుర్చీలో కూర్చుంటూ "నేను ప్రతిరోజూ హిందూ నియమాలను ఉల్లంఘిస్తూనే ఉండటంచేత బ్రహ్మసమాజంలో తలదాచు కుందామనుకుంటున్నాను. నాకు మీరె సూక్ష్మం ఇవ్వాలని నా కోరిక," అన్నాడు. ఈ ఆలోచన అతనికి కలిగింది పొద్దుపొడుస్తూ ఉండగానే.

"సరేకాని, దీన్నిగురించి సమగ్రంగా యోచించావా?" అని పరేశబాబు అడిగాడు.

"ఇందులో ఆలోచించటానికేముంది. మంచి చెడ్డలు తప్పు; చేసిన తప్పు సవరించుకోవటమే నా తక్షణ కర్తవ్యం."

"మత విశ్వాసాల విషయంలో బ్రహ్మసమాజంతో నీ అభిప్రాయాలు ఏకీభ విస్తాయా?"

"నిజం చెప్పాలంటే నాలో మతవిశ్వాసం పరిణతి పొందిందని చెప్పలేను. నాకు జీవితంలో మతంతో అవసరం కలగలేదు. సంచితంగా వస్తున్నది గనక హిందూమతాన్ని అవలంబిస్తున్నాను."

చాలాసేపు మాట్లాడిన మీదట పరేశబాబు వినయుడిని తొందర పడవద్దని సలహా ఇచ్చాడు. బాగా ఆలోచించమన్నాడు.

ఇంతలో వారద వచ్చింది. వినయు డడిగిన మాట గురించి పరేశబాబు తన భార్యకు చెప్పనేలేదు. వినయుడే తాను బ్రహ్మసమాజంలో చేరదలిచినట్లు ఆమెతో చెప్పాడు.

"ఎల్లుండి ఆదివారంనాడు, పరేశబాబుగారు నాకు మతం ఇచ్చేటట్లుంటే" అన్నా డతను.

"లేదు, నా కుటుంబానికి స్వార్థం ఉన్నచోట నేను ఉపదేశికుణ్ణి కాలేను. తిన్నగా బ్రహ్మసమాజానికే దరఖాస్తు పెట్టుకోవలసి ఉంటుంది," అన్నాడు పరేశబాబు.

వినయుడికి నిరుత్సాహం కలిగింది. బ్రహ్మసమాజంవాళ్ళకు తాను దరఖాస్తు పెట్టుకోవటమూ, దాన్ని వాళ్ళు పత్రికలో ప్రచురించటమూ, ఏ పరిస్థితులలో తాను బ్రహ్మమతం పుచ్చుకుంటున్నదీ తెలియకుండా తన హిందూ మిత్రులు ఆ వార్త చదవటమూ, అది గోరాకు తెలియటమూ, ఇవన్నీ ఊహించుకున్నకొద్దీ వినయుడికి నీరసం వచ్చేసింది.

అతనేమీ అనకపోవటం చూసి పరేశబాబు భార్య, "వినయుడికి సమాజంలో ఎవరూ తెలీదు. నేనిప్పుడే పానుబాబును పిలిపిస్తాను," అన్నది. ఆమె సుధీరుణ్ణి పిలిచి, "వినయబాబు ఎల్లుండి ఆదివారంనాడు మన సమాజంలో చేరుతున్నాడు," అన్నది. వినయుడంటే గౌరవంగల సుధీరుడు చాలా సంతోషించాడు

పానుబాబును పిలిపిస్తున్నా రనగానే వినయుడు వెళ్ళిపోవటానికి లేచాడు. వారద అపినా ఆగలేదు.

"తొందరపడవద్దు. స్థిమితంగా ఆలోచించుకో," అని అతనికి పరేశబాబు మళ్ళీ సలహా ఇచ్చాడు.

వీధిలో అతనికి అవినాశుడూ మరి మగ్గురూ కనిపించారు.

"నువుకూడా రా, కాశీపూరుతోటలో గోరా ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నాడు" అన్నాడు అవినాశుడు.

"నాకిప్పుడు తీరికలేదు," అంటూ వినయుడు అవినాశుణ్ణి వదిలించుకుని వెళ్ళిపోయాడు.

# 7

పానుబాబు వస్తూనే లలితను పిలిచి, గంభీరంగా, "లలితా, ఇది నీ జీవితంలో పరీక్షా సమయం. ఒకవంక నీ మతం, మరొకవంక నీ కోరికలు. దేన్నో ఒకదాన్ని ఎన్నుకోవాలి," అన్నాడు.

లలిత మాట్లాడలేదు.

"నీకోసమో, మరెందుకో వినయబాబు బ్రహ్మసమాజంలో చేరదలచిన సంగతి నీకు తెలిసేఉండవచ్చు."

జవాబులేదు.

"వినయుడి నిర్ణయం పరేశబాబుగారిని తృప్తిపరచవచ్చు; కాని ఇది సంతోష కరమైన విషయమా అని తేల్చుకోవల్సినదానివి నువు. ఇందులో సంతోషప్రదమైన దేమైనా ఉందా అని సమాజంతరఫున నిన్ను నువు ప్రశ్నించుకోవాలని సమాజం తరఫున నిన్ను నేను కోరుతున్నాను."

జవాబులేదు.

"బ్రహ్మసమాజ చరిత్రలో ఇదొక దుస్సహ సంఘటనగా శాశ్వతంగా ఉండి పోవటం నీకు సమ్మతమేనా?"

లలిత రాయిలాగా కూర్చున్నది.

"కాంక్షలు మనిషిని నీరసపెడతాయి. అవి ఒక్కొక్కసారి ఒక వ్యక్తినేగాక

అనేక వందలమంది జీవితాలను ధ్వంసంచేస్తాయి. అలాటి దౌర్బల్యం క్షమించ దగినదా, లలితా! ఒక్క క్షణం ఆగు."

"వద్దు, వద్దు పానుబాబూ! మీరు మమ్మల్ని క్షమించవద్దు. మీ నూటి పోట్లకు మే మలవాటు పడిపోయాం. మీరు మమల్ని క్షమించేట్టయితే మా కది దుర్భర మవుతుంది!" అన్నది లలిత ఆవేశంతో.

పానుబాబువైఖరి పరేశబాబుభార్యకు కొంచెంకూడా నచ్చలేదు. వినయుణ్ణి సమాజంలో చేర్చాలని ఆమెకు తీవ్రమైనకాంక్ష. అందుకు తన భర్తసహాయం లేదు సరేకదా, పానుబాబుకూడా కలిసిరావటంలేదు. ఈపని తనవల్లనే కావాలని నిశ్చయించుకుని, ఆమె సతీశుణ్ణి వెంటబెట్టుకుని వినయుడి ఇంటికి వెళ్ళింది.

"చూడు, వినయబాబూ! నీకు సమాజం అధికార్లు తెలీదు. అందుచేత నా కొక ఉత్తరం రాసిఇచ్చావంటే నేను దాన్ని సమాజం అధికార్ల కిచ్చి, ఆదివారంనాడు నీ మతస్వీకారం జరిగేటట్టు చూస్తాను." అన్నదామె.

ఏమి జరిగినా వినయుడికి ఒకటిగానే తోచింది. అతను ఆమె కోరినట్టు ఉత్తరం రాశిచ్చాడు. ఆమె వెళ్ళిపోతూ లలితకూ, అతనికీ పెళ్ళి జరగటం గురించి చూచాయగా ఒకముక్క అని వెళ్ళిపోయింది. ఆమె ఇంటికి చేరుతూనే లలిత గదికి వెళ్ళింది.

"ఎక్కడికి వెళ్ళావమ్మా?" అని లలిత అడిగింది.

"వినయుడి గదికి."

"ఎందుకూ?"

"ఇందుకూ!" అంటూ వినయుడు రాసిచ్చిన ఉత్తరాన్ని ఆమె లలిత కిచ్చింది. దాన్ని చదివేసరికి లలిత ముఖం జేవురించింది.

"ఈ ఉత్తరం సంపాదించటానికి ఎంత ఒత్తిడి చెయ్యవలసివచ్చిందో తెలుసా?" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

మర్నాడామె సమాజానికి బయలుదేరబోతూ ఉత్తరంకోసం చూస్తే అది ముక్కలు ముక్కలుగా చింపిఉన్నది ...

మర్నాడు సాయంకాలం గోరా సుచరిత ఇంటికి వచ్చాడు. సుచరిత ఒంటరిగా అతనితో మాట్లాడటానికి జంకి, హరిమోహినిని తీసుకువచ్చి పరిచయం చేసింది. హరిమోహిని గోరానుగురించి చాలా విని సంతోషించిఉన్నది. అతను సాక్షాత్తు శివుడి అవతారంలాగా ఉంటాడని ఆమె కలలోనైనా అనుకోలేదు.

"నాయనా, మరొకసారి నీకు భోజనం పెడతాముగాని. ఈ పూటకు ఫలహారం చేసి మరీ వెళ్ళు," అంటూ హరిమోహిని వంటఇంట్లోకి వెళ్ళింది.

వెంటనే గోరా సుచరితకేసి తిరిగి, "వినయుడికి బ్రహ్మసమాజ నియమాల ప్రకారం పెళ్ళి జరిపాలని చూడటం న్యాయమా ?" అన్నాడు.

సుచరితకు కొంచెం రోషం వచ్చి, "బ్రాహ్మ వివాహవిధి అక్రమమైనదని నన్ను అనమంటారా ?" అన్నది.

"నిన్ను అక్రమమైనమాట ఏదీ అనను. నువు సంకుచిత బుద్ధులలో చేరేదానివి కావని నాకు తెలుసు ఒక ప్రత్యేకమైన పార్టీకి సంబంధించిన మనిషిలాగా ఆలోచించవద్దు," అన్నాడు గోరా.

"మీరూ ఒక పార్టీకి చెందినవారే కదా ?"

"కాను, నేను హిందువుణ్ణి, హిందువుల కొక పార్టీ లేదు. హిందువు లోక జాతి; చాలా విస్తృతమై, వైవిధ్యం గల జాతి."

"అలా అయితే హిందువులు పార్టీవైఖరి అవలంబించటం దేనికి ?"

"దెబ్బతిన్నవా డెదురు ఆత్మరక్షణ చేసుకుంటాడు: రాయి కాదు గనక : ప్రాణం ఉన్నది గనక :"

"నేను ఉత్తమ మానవధర్మ మనుకునేదాన్ని హిందువులు ప్రమాదంగా భావిస్తే ఏం చెయ్యాలి?"

"నీ దృష్టిలో ధర్మమయినది. ఈ విస్తృతజాతికి దెబ్బ అయిన పక్షంలో నీ దృష్టిలోనే ఏదో దోషమున్నదన్నమాట. నీ సమాజంయొక్క విశ్వాసాలే సరైన వనుకుని ఇతర్యాగాలకు పూనుకోవటం సరికాదు ఒక పెద్ద పడవలో ఒక చిన్న చిల్లి తొలచటం ఎలుక దృష్టిలో సరికావచ్చు; కాని అందువల్ల అధికమైన ప్రమాదం ఉంటుంది. నీ సంకుచిత విశ్వాసాలను అందరూ ఆమోదించాలనీ, అందరు మనుషులూ ఒకటేననీ, కేవలమూ బ్రహ్మసమాజంలో సభ్యులు కావటానికే పుట్టారనీ ఎలా భావించగలవు? ప్రపంచాన్నంతా జయించి తమ అధీనంలోకి తెచ్చుకోవాలనుకునే బందిపోటుదేశాలకూ, ఈ వైఖరి గలవారికీ తేడా ఏమిటి?"

గోరా ఈ విధంగా మాట్లాడుకుంటూ పోతుంటే సుచరిత తన్మయురాలై విన సాగింది అతనివి పట్టుపదేశాలు కావు. అతని మాటల వెనక ఉన్న సత్యం కళ్ళకు కట్టినట్టూ, ఎటుఎదుట ప్రత్యక్షమైనట్టూ ఆమె భావించింది. ఆమె ఎదురు చెప్పలేకపోవటం చూసి గోరా, "నా మాటలు నీకు కటువుగా ఉండవచ్చు. నేను



ప్రతిపక్షానికి చెందినవాణ్ణనే భావంతో నామీద ఎదురు తిరగవద్దు. నువ్వు నా ప్రతిపక్షమనుకున్నట్టయితే నే నసలు మాట్లాడేఉండను," అన్నాడు.

"లేదు, లేదు. నా సంగతి మరిచిపోండి. మీరు చెప్పేది చెప్పండి. నేను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాను," అన్నది సుచరిత.

గోరా మరికొంతసేపు ప్రసంగించి చివర కిలా ముగించాడు.

"హిందూమతంలో అన్నిరకాల విశ్వాసాలకూ చోటున్నది. అది అందరికీ తల్లి. అది మనిషిని మనిషిగా పరిగణిస్తుంది గాని, ఒక మతంవాడుగా పరిగణించదు. వివేకులనూ, వివేచనా వైవిధ్యం గలవారినీ, అవివేకులనూకూడా ఆదరిస్తుంది. క్రైస్తవమతం వైవిధ్యాన్ని సహించదు. క్రైస్తవులవిద్య చదువుకోవటంచేత మనం హిందూమతంలోని వైవిధ్యం చూసి అసహ్యపడుతున్నాం. ఈ దుష్ప్రభావంనుంచి బయటపడితేనేగాని హిందూమతంతాలూకు పరమసత్యాలు మన కర్థంకావు."

అత సిలా మాట్లాడుతూండగా అక్కడికి పానుబాబు వచ్చాడు. అతను వీధిలోనుంచే గోరాగొంతు వినిఉండటంచేత, సుచరిత తనకు అతనితో ప్రసంగించే తీరిక లేదన్నాకూడా వచ్చి కూర్చున్నాడు. గోరాకు ఫలహారం అయిందేమో చూసే మిషమీద సుచరిత వెళ్ళిపోయింది.

పానుబాబు గోరాను చర్చలోకి దింపుతూ, "ఆదివారంనాడు వినయబాబును బ్రహ్మసమాజంలో చేర్చటానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు మీకు తెలుసుననుకుంటాను?" అన్నాడు.

గోరా తనకు తెలియదన్నాడు. పానుబాబు వేసిన ప్రశ్నకు సంబంధించి జవాబుగా అతను, వినయుడు తన సమ్మతి కోరబోడనీ, [illegible] సమ్మతించటమే ఆ మతంమీద అతనికి గురి ఉన్నట్టు గుర్తు అనీ అన్నాడు.

"నేను మిమ్మల్ని ముఖ్యంగా అడగాలనుకున్నది ఏమంటే, వినయబాబు పరేశబాబు కుటుంబంలోవ్యక్తిని పెళ్ళాడటాన్ని మీరు ప్రతిఘటించరా." అన్నాడు పానుబాబు.

గోరాకు మండిపోయింది. "నేనీ విషయాలు మీతో ఎందుకు చర్చించాలి పానుబాబూ? వినయుడు నా స్నేహితుడుగాని మీ స్నేహితుడు కాదే!" అన్నాడు.

"నేను బ్రహ్మసమాజం పక్షాన అడుగుతున్నాను."

"ఆ సమాజానికీ నాకూ ఏమీ సంబంధం లేదు."

వీళ్ళిలా ఘర్షణపడుతుండగా సుచరిత వచ్చి, పక్కగదిలో ఫలహారం చెయ్యటానికి గోరాను తీసుకుపోయింది. ఆమెతో ఒంటరిగా మాట్లాడటానికి పానుబాబు చేసిన ప్రయత్నాలనామె లక్ష్యపెట్టలేదు. ఆమెకోసం కొంతసేపు చూసి పానుబాబు ఆమెకు ఉత్తరం రాసిపెట్టి వెళ్ళిపోయాడు.

తరవాత గోరా వెళ్ళిపోతూ సుచరితతో, "నీ స్థానం విస్తృతమైనది భారతదేశంలో. నిన్నిక్కడ సుస్థిరంగా నిలిపేదాకా నేను వదలను. నువు పాటించవలసిన విశ్వాసాలూ, సత్యమూ ఎవరో చెప్పేమాటలు కావు. నీవు అసంఖ్యాకులైన దేశీయులతో బంధాలు కలిగివున్నావు. నువు పుట్టకమునుపే నీ దేశప్రజలు నీ కోసం స్థానం ఏర్పాటుచేశారు. వారు నీ కేమీ కారనీ, వారికి నువ్వేమీ కావనీ ఎన్నడూ అనవద్దు. అలా అన్నక్షణాన నీ మనసూ, నీ బలమూ కరిగి మాయమవుతాయి. రేపు మళ్ళీ కనిపిస్తాను."

వినయుడు ఆనందమయి దగ్గిరికి వెళ్ళి తాను మర్నాడు బ్రహ్మసమాజంలో చేరబోతున్నాననీ, తనకు నిజంగా హిందూ మతాచారాలలో విశ్వాసం లేదనీ, కేవలమూ యుక్తితోనే వాటిని సమర్థిస్తూవచ్చాడు; గాని నిజమైన ప్రగాఢవిశ్వాసంతో కాదనీ చెప్పాడు.

అతను మతం మార్చుకోవటానికి ఆనందమయి ఎంతమాత్రమూ ఒప్పుకోలేదు. "ముప్పైకోట్లమంది ఉంటున్న ఇంటిలో నీకు స్థానం లేకపోయిందా? చిత్తశుద్ధిగా

నువు కొన్ని ఆచారాలు పాటించలేకపోతే ఇతరులచేత తిట్లుతిను. నేను పడుతున్నాను కానా! నన్నందరూ కిరస్తానీ అంటున్నారు. నేను నా సమాజాన్ని వదులుకున్నానా?" అన్నదామె.

"బ్రహ్మసమాజంలో చేరతానని మాట ఇచ్చాను. వెనక్కు లాగటానికి లేదు," అన్నాడు వినయుడు.

ఇంతలో లలిత వచ్చింది. వినయుడు అవతలికి వెళ్ళిపోయాడు. ఆనందమయీ లలితా వినయుణ్ణి గురించి మాట్లాడుకున్నారు. రేపు వినయుడు బ్రహ్మమత స్వీకరణ చేస్తున్నాడని ఆనందమయి అనేసరికి లలిత, "దేనికీ? అంత అవసరమేం వచ్చిందీ?" అని అడిగింది.

"అయితే అవసరమే లేదా?" అన్నది ఆనందమయి ఆశ్చర్యంతో.

"ఎంతమాత్రమూ లేదు."

"మాట ఇచ్చాను, తిరగనంటున్నాడు వినయుడు."

"ఇలాటి విషయాల్లో మాట నిలబెట్టుకోవటంలో అర్థంలేదు. అభిప్రాయం మార్చుకోవచ్చు; దాని కేం?"

"అమ్మా, దావరికావి కిది సమయంకాదు. మతం మార్చుకోకుండా నిన్ను పెళ్ళాడటం సాధ్యంకాదని వినయుడి ఉద్దేశం."

"నా కలాటి నమ్మకాలు లేనేలేవు. మనుషుల మధ్య సంబంధాలేర్పడటానికి మతాలు అడ్డొచ్చేమాటైతే భిన్నమతాలవారి మధ్య స్నేహానికి అవకాశమే ఉండదు. అన్ని మతాల మధ్యా ఎత్తయిన గోడలు లేవవలిసిందే," అన్నది లలిత.

ఆనందమయి మనస్సు చాలా తేలికనపడింది. ఆమె వినయుణ్ణీ, లలితనూ ఒకచోట చేర్చి, మాట్లాడుకుంటూ ఉండమని తాను ఫలహారం తయారు చేసే మిషమీద అవతలికి వెళ్ళింది.

లలితా వినయులు మనసిచ్చి మాట్లాడుకున్నారు. ఒకరి మతాల ప్రమేయం మరొకరి కుండనవసరం లేదు.

"మీరు మతం మార్చుకునే అవమానానికి గురికావటం నేను సహించలేను," అన్నది లలిత. వారిద్దరూ ఇరవై నిమిషాలపాటు సంభాషించుకున్నారు. తరవాత ఇద్దరూ కలిసి పరేశబాబువద్దకు వెళ్ళారు.

"నేను సంఘం ఎదట ఏ ప్రమాణాలూ చెయ్యదలచలేదు. మే మిద్దరమూ ఏకం కావటానికి మీ ఆశీర్వచనం ఒక్కటే చాలు," అన్నాడు వినయుడు పరేశబాబుతో.

పరేశబాబు కొంచెం ఆలోచించి, "అయితే నువు హిందూ సమాజంలోనే ఉంటావన్నమాట? బ్రహ్మసమాజంలో చేరవు?" అన్నాడు.

"లేదు," అన్నాడు వినయుడు.

పరేశబాబు లలితకేసి చూశాడు.

"నాన్నా, నా మతం నాకే ఉంటుంది. కాని నా విశ్వాసాలతో ఏకీభవించని వారిని వెలివెయ్యలేను. మన సమాజంలో నా విశ్వాసాలే గల వాళ్ళను కొందరిని నేను నావాళ్ళుగా చూడలేను. బ్రహ్మసమాజం వెలుపల అంతా భ్రాంతే అనుకునే దాన్ని. కాని ఆ అభిప్రాయం నా కిప్పుడు పూర్తిగా పోయింది," అన్నది లలిత.

"కాని రేపు మీకు పుట్టబోయే తరాలవాళ్ళందరి బాధ్యతా మీ సొంతం కాదు, సంఘానిది కదా!" అన్నాడు పరేశబాబు.

"అందుకు హిందూసమాజం ఉన్నది," అన్నాడు వినయుడు.

"హిందూసమాజం వాళ్ళను ఆదరించకపోతే?"

"హిందూసమాజం అన్ని మతాలవాళ్ళనూ ఆదరిస్తుంది."

ఇద్దరూ మతం గురించి తర్కించుకున్నారు. లలిత వారి వాదనకు అడ్డువచ్చి, "నాన్నా! బ్రహ్మసమాజం ద్వారా నేనలవరచుకున్న విశ్వాసాల మూలంగా నాకు మరొక సమాజంలో బాధలు ఎదురవుతాయని తెలుసు. కాని నేనందుకు భయపడను. నా బాధల్లా నా చర్యలు మీకు బాధ కలిగిస్తాయేమోననే," అన్నది.

పరేశబాబు వినయుడితో, "మన దేశంలో సాంఘికాచారాలు మతాచారాలతో ముడిపడిఉన్నాయి. ఇతర మతాలవారిని నీ సమాజంలోనికి తీసుకుపోవటం ఎలా సాధ్యం?" అన్నాడు.

వినయుడికి ఆ చిక్కు అర్థమయింది. అతను లలితను పెళ్ళాడేమాటైతే, లలిత విగ్రహానికి ప్రణామం పెట్టాలి. పెడుతుందా? ఆమె కది పరమరోత. వినయుడికీ విగ్రహారాధనలో నమ్మకం లేదు. పెళ్ళిలో విగ్రహారాధన లేకుండా చూస్తాడు. కాని ఇలాటివి అసంఖ్యాకమైన సమస్య లుంటాయి. వివాహం వ్యక్తిగతమైన విషయం కాదు, సాంఘికమైనది.

"కొంచెం వ్యవధి తీసుకుని సావకాశంగా ఆలోచించండి. తొందర పడవద్దు." అని తోటలోకి వెళ్ళిపోయాడు పరేశబాబు.

"సంఘంలో చెడ్డపనులకు తప్ప మంచిపనులకు చోటే లేదా?" అని లలిత వినయుణ్ణి అడిగింది.

''నాకు సంతోషం భంగం మేమీ లేదు. సత్యం సీడన మన మిద్దరమూ నిలవగలిగితే మనమే సఖం," అన్నాడు వినయుడు.

పరేశబాబు భార్య వచ్చి, "బ్రహ్మసమాజంలో చేరే ఉద్దేశం మానుకున్నావటగా? ఏమిటీ వేషాలు? లలిత జీవితం నాశనం చేద్దామనా?'' అని వినయుణ్ణి అడిగింది

"వినయబాబు మతం స్వీకరించటం ఇష్టం లేనివాళ్ళు మన సమాజంలో ఉన్నారు. నావు సత్రిక చదవలేదా? ఆయా మతస్వీకారం చేస్తే నేం, చెయ్యకపోతే నేం?" అని లలిత తల్లితో అన్నది.

"మతం మార్చుకోకపోతే పెళ్ళి ఎలా జరుగుతుంది?"

"హిందూవిధి ప్రకారం జరిగేటట్టు చూస్తాము,'' అన్నాడు వినయుడు.

పరేశబాబు భార్యకు పట్టరాని కోపం వచ్చింది.

"వినయ్. వెళ్ళు! ఈ ఇంటినుంచి వెళ్ళిపో. ఎప్పుడూ తిరిగిరాకు," అన్న దామె అమర్యాదగా...

కొంతటిరోజుల అన్నప్రకారం గోరా సుచరితను చూడవచ్చాడు. అతను హరిమోహిని పూజాగృహంలో దేవుడికి నమస్కరించిరావటం చూసి, సుచరిత, ఆ విగ్రహంలో మీకు నమ్మకం ఉన్నదా?'' అని అడిగింది.

అతను పెళ్ళి ఉపన్యాసం ప్రారంభించాడు. తనకు దేవుడిఅవసరం కలగలేదని అతను ఒప్పుకున్నాడు; కాని తన దేశప్రజల ఆచారాలను తాను గౌరవిస్తానన్నాడు విగ్రహాలు దేవుడికి ప్రతిరూపాలు. ఒక పుస్తకంలో ఒక మహత్తరమైన భావం ఉంటే ఆ భావాన్ని అసలే ప్రమాణాన్నిబట్టి, అక్షరాల సంఖ్యను బట్టి కొలవం. అలాగే దేవుడు అనంతుడు. ఆ అనంతుణ్ణి భక్తులు చిన్నరాయిలో చూడవచ్చు. ఇలా మాట్లాడుతూ గోరా సుచరితను తనపక్షం చేసుకోవటానికి విశ్వప్రయత్నం చేశాడు. "నువ్వు దూరంగా వుండిపోతే నా భారతదేశం శోభించదు. నువ్వు లేకపోతే అంతా వృథా! నేను నీకోసమే వచ్చాను,'' అన్నాడతను.

సుచరిత కళ్ళు చెమర్చాయి. గోరా వెళ్ళిపోయాక సుచరిత పైడాబామీదికి వెళ్ళి కాలం ఎలా గడుస్తున్నదీ తెలియకుండా, చల్లగాలిలో పచార్లు చెయ్యసాగింది. తనకోసం పరేశబాబు డాబాపైకి వచ్చినదాకా ఆమె అక్కడే ఉండిపోయింది.

ఇద్దరూ కిందికి వచ్చాక, పరేశబాబు, లలిత వినయుణ్ణి హిందూ వివాహవిధి ప్రకారం పెళ్ళాడబోతున్నదనీ, అందులో విగ్రహపూజ లేకుండా చేస్తానని వినయుడన్నాడనీ చెప్పాడు.

"మీరు ఒప్పుకున్నారా ?" అన్నది సుచరిత.

''లేదు; కాని ఒప్పుకుంటాను. లలిత ఈ పెళ్ళివల్ల తనకు ఏర్పడే కష్టాలను సంతోషంగా స్వీకరిస్తున్నది. ఆమె చేసేది తప్పుకానప్పు డెలా అడ్డుపుల్ల వేసేది ?'' అన్నాడు పరేశబాబు

# 8

ఉదయం లేగాయతు గోరా గదిలో ఒకడే సంచాయతి. మహిముడు వచ్చి గోరాచేతి కొక పత్రిక ఇచ్చాడు వినయుడు హిందూమతం విసర్జించి బ్రాహ్మ కన్యను పెళ్ళాడబోతున్నట్లు అందులో ఉంది. శశిముఖిని పెళ్ళాడతానని మాటఇచ్చి, ఇలా చేసినందుకు వినయుణ్ణి తిట్టి మహిముడు వెళ్ళిపోయాడు.

తరవాత అవినాశుడు వచ్చాడు. వినయుణ్ణి నానామాటలూ అన్నాదు. అతని వెనకగా గోరాశిష్యులందరూ వచ్చి ఏవేవో మాట లన్నారు. గోరా ఎవరికీ ఏమీ జవాబు చెప్పలేదు. వచ్చినవా రలాగా వెళ్ళిపోయారు వినయుడు ఇంటికి వచ్చి గోరా గదిలోకి రాకుండా పైకి వెళ్ళిపోతుంటే, గోరా అతన్ని పిలిచి, ''బ్రహ్మసమాజంలో చేరుతున్నావా ?'' అన్నాడు

''లేదు, చేరనుకూడా,'' అన్నాడు వినయుడు.

గోరా తీవ్రంగా అతనితో వాదం వేసుకున్నాడు. వినయుడు యుద్ధానికి సిద్ధంగానే ఉన్నాడు. "నేను సమాజానికి బలులిచ్చి వేస రాక్షసిని మంచి చేసుకున్నట్టు చెయ్యలేను," అనేశా డతను.

అతను బ్రహ్మమతం స్వీకరించకుండానే లలితను హిందూ వివాహవిధి ప్రకారం పెళ్ళాడుతున్నా నని గోరాకు తెలియజేశాడు.

''మరి పరేశబాబు సమ్మతించాడా ?'' అని గోరా అడిగాడు

వినయుడు పరేశబాబు రాసిన సమ్మతిఉత్తరం గోరాకు చూపి, "పరేశబాబులాగే నువుకూడా మా పెళ్ళి అనుమతించు," అన్నాడు.

సమ్మతించ నన్నాడు గోరా

"నేను ముస్లిము మిత్రుణ్ణయితే అనుమతించిఉందువా ?" అని అడిగాడు వినయుడు. అప్పు డనుమతించేవా ణ్ణని గోరా ఒప్పుకుంటూ, ''చెట్టు కొమ్మ విరిగితే అతకదు; చెట్టుకు పాకిన లత పడిపోతే ఎత్తిపెట్టవచ్చు,'' అన్నాడు.

అలాటప్పుడు, చెట్టు మరీ పెళుసుగా ఉండటమూ, స్వల్పకారణాలకు కొమ్మలు విరగటమూ ఉండరా దన్నాడు వినయుడు.

వినయుడు ఆనందమయిదగ్గిరికి వెళ్ళాక, మహిముడు వచ్చి తన సమస్యలు

వెళ్ళబోసుకున్నాడు. శశిముఖిని అవినాశుడి కిచ్చి పెళ్ళి చెయ్యాలి. అవినాశుడు గంతేసి ఒప్పుకొన్నాడు. కట్నంమాట ఎత్తితే, చెవులు మూసుకున్నాడు. కాని అవినాశుడి తండ్రికి కట్నంపట్ల అంత నిర్లక్ష్యం లేదు. పిల్లకు భారీగా నగలు పెట్టాలన్నా డాయన. ఖరీదు పెంచకుండా నగలబరువు పెంచే కంసాలిని చూడాలి. తండ్రి కృష్ణదయాళుణ్ణి ఒక కొత్త స్వామీజీ పట్టాడు. రోజుకు మూడు స్నానాలూ, ప్రాణాయామాలూ చేయించి, ఆ స్వామీజీ ముసలాయన ప్రాణాలు తీసేట్టున్నాడు. కృష్ణదయాళుడు చూడబోతే, మహిముడు డబ్బు అడిగినప్పుడల్లా కళ్ళూ, ముక్కూ మూసుకుంటున్నాడు. అవినాశుడి తండ్రికి గల పుత్రవాత్సల్యం ఈయనలో కనబడదు...

హరిమోహినికి గోరా మీద ఏమీ సదభిప్రాయం కలగలేదు. అతని ఉపన్యాసాలు ఆమె తల కెక్కలేదు. అతను ఎంతసేపటికీ తన ప్రతిపక్షులను చీల్చి చెండాడుతాడు గాని, తోటివారికి ఏమీ చెప్పడు. అతని నోట ఆమె ఏనాడూ నాలుగు మంచిముక్కలు వినలేదు. తమ ఇంటికి రావటంలో గోరా ఉద్దేశం సుచరితను బుట్టలో వేసుకోవటమేనని ఆమె రూఢి చేసుకున్నది. సుచరితకు ఆస్తి వున్నది: దానిమీద గోరా కన్ను పడివుండాలి.

గోరా మళ్ళీ ఇవాళకూడా వచ్చాడు. సుచరితతో ఏదో మాటలు ప్రారంభించాడు. గోరా సుచరిత శక్తులలో అంతులేని విశ్వాసం ప్రకటించాడు. హరిమోహిని మధ్యలో వచ్చి సుచరితను వంటపని చూడమని పంపింది. తరవాత ఆమె గోరాతో, "నువు హిందువుడవే గదూ, నాయనా? నీకు హిందూ సంప్రదాయాలంటే గౌరవమేగా? అలాటప్పుడు రోజూ వచ్చి, ఈడొచ్చిన పిల్లతో ఏమిటి మాట్లాడతావు? ఇలాటి ప్రవర్తన మంచిదేనని ఏ ధర్మశాస్త్రంలో ఉంది? నీ శిష్యులు చాలామంది ఉన్నారుట; నీ ప్రవర్తన చూసి వాళ్ళేమనుకుంటారు? నిన్న పొద్దుపోయినదాకా మాట్లాడితివి. తెల్లవారిందో లేదో మళ్ళీ వస్తివి. అది పొద్దున లేచి ఒక్కపని చెయ్యలేదు. మీ ఇంట్లో ఆడపిల్లలు పనీపాటా చెయ్యకపోతే ఊరుకుంటావా? నాకీ ప్రపంచంలో ఉన్నది అది ఒక్కతే. చెయ్యెత్తి దణ్ణం పెడతాను, దాని జోలికి రాకు. పరేశబాబు కింకా ఇద్దరు కూతుళ్ళున్నారు; వాళ్ళింటికి వెళ్ళు," అన్నది.

గోరా దిమ్మరపోయాడు. అతను వెళ్ళిపోయేటప్పుడు కింద వంట చేస్తున్న సుచరితకు చెప్పనన్నా లేదు.

అతను వెళ్ళిన మరుక్షణమే పానుబాబు వచ్చాడు. అతను వంటఇంటి వాకిలి

బయట నిలబడి "విన్నావా, సుచరితా? వినయుడు లలితను హిందూపద్ధతిలో పెళ్ళాడబోతున్నాడు. దీనికి కారకు లెవరు? నువే! బ్రహ్మసమాజం దృష్టిలో నువు దోషివి. నువే వినయుణ్ణీ, గౌరమోహనబాబునూ మీ ఇంటికి చేరనిచ్చావు. ఇవాళ ఏమవుతున్నదో చూడు. ఇవాళ నువు లలితను చూసి జాలిపడవచ్చు; కాని రేపు నీకూ ఇదేపతనం కలగబోతుంది. ఆలోచించు. మునం తన్ను కలలన్నీ ఒక్కసారి స్మరించు. వెనక్కి వచ్చెయ్యి." అన్నాడు.

ఈ ప్రసంగమంతా మౌనంగా విన్న సుచరిత అతనికేసి తిరిగి, "నేను హిందువును!" అన్నది.

"హిందువువా? అంటే, గౌరమోహనబాబు ఉభయసంధ్యలా నీకు ఉపదేశం ఇస్తున్నాడన్నమాట!" అన్నాడు పానుబాబు.

"అవును. ఉపదేశం తీసుకుంటున్నాను. ఆయన నాకు గురువు."

అంతదాకా తామెగురువు తానే అనుకుంటున్న పానుబాబుకు కొరడాదెబ్బ తిన్నట్లయింది: "హిందూసమాజం నిన్ను స్వీకరిస్తుందనుకున్నావా? గౌరమోహన బాబు నిన్ను ఒక్కనాటికి పెళ్ళాడడు. చూస్తూఉండు!"

"ఆయన నా గురువని చెప్పలేదూ?" అన్నది సుచరిత. ఆమె కళ్ళు క్రోధంతో మెరిశాయి.

"నువు చెప్పనిదికూడా అర్థం చేసుకోవచ్చుగా?"

"ఈ ఇంటినుంచి వెళ్ళు. మళ్ళీ నాకు కనిపించవద్దు." అన్నది సుచరిత.

ఈ సంభాషణ అంతా వింటున్న హరిమోహిని సమాధానపడి చెంది, తన ప్రార్థనలను దేవుడు ఆలకించాడనుకున్నది.

గోరా ఇంటికి వచ్చేసరికి మహిముడు కనిపించి, "వినయుడు ఆ బ్రహ్మసమాజం దాన్ని తెచ్చి ఈ ఇంట కాపరం పెడితే నే నింకెక్కడికైనా లేచిపోవలసివస్తుంది. కుటుంబీకుణ్ణి, ఆడపిల్లలుగలవాణ్ణి." అన్నాడు

"అలా ఎన్నటికీ జరగదులే." అని చెప్పి, గోరా ఆనందమయి ఉన్నచోటకు వెళ్ళి తానే వినయుడిపెళ్ళి తమఇంటనే జరగబోతున్నట్లు తెలుసుకున్నాడు. "వారి పెళ్ళిప్రయత్నాలు నేను దగ్గరుండి చెయ్యకపోతే ఎవరు చేస్తారు?" అన్నదామె.

గోరా అందుకు తీవ్రంగా అభ్యంతరం చెప్పాడు. ఆనందమయి ఆ పెళ్ళికి వెళ్ళటానికే వీల్లేదన్నాడు. వినయుడు తన పెళ్ళి మరెక్కడైనా ఏర్పాటు చేసుకో వలసి ఉంటుందని చెప్పటానికి గోరా వెళ్ళిపోగానే ఆనందమయి తన భర్తవద్దకు



వెళ్ళి, ''గోరాను ఇం కెంతకాలం మోసం చేస్తారు. అంతకంతకూ పరిస్థితి విషమించుతున్నది,'' అన్నది.

''నీ కేమన్నా పిచ్చా ఏం? గోరా సంగతి బయట పడితే నేను నలుగురికీ ఏమని సమాధానం చెబుతాను. పోలీసులు నా గొంతుమీదికి తెస్తారు. పింఛనుకూడా ఆగి పోవచ్చు. ఏదో విధంగా నువే చక్రం అడ్డువెయ్యి. పారితే పారుతుంది, లేకపోతే లేదు,'' అన్నాడు కృష్ణదయాళుడు.

వినయుడి పెళ్ళికి అతని బంధువు లెవరూ రావటంలేదు. లలిత కుటుంబం సహజంగా ఈ పెళ్ళితో ఎలాంటి సంబంధమూ పెట్టుకోవటంలేదు. అందుచేత పరేశబాబు గోరాను చూడవచ్చి, ''లలిత తరపున నేనూ, వినయుడి తరపున నువూ ఈ పెళ్ళితంతు నడపవలసివున్నది,'' అన్నాడు.

''నాకీ పెళ్ళితో ఏమీ సంబంధం లేదు,'' అన్నాడు గోరా.

“అదేమిటి? వినయుడు నీ స్నేహితుడుగదా? స్నేహితుడు ఇలాటప్పుడు కాక మరి దేనికి?” అన్నాడు పరేశబాబు.

''నాకు సంఘంతో గల ఇతర సంబంధాలు కూడా పాటించాలి,'' అన్నాడు గోరా. పరేశబాబు తానే ఒంటరిగా పెళ్ళి చేయిస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

గోరా ప్రాయశ్చిత్తప్రక్రియ నిమిత్తం ప్రయత్నాలు చురుకుగా సాగుతున్నాయి. ముహూర్తం నిర్ణయమయింది. ఆహ్వానాలు వెళ్లాయి. గోరాను అభిమానించే దనికులు చందాలు వేశారు. గోరా ఆ తతంగంలో మునిగిపోయాడు

పరేశబాబుకు బ్రహ్మసమాజంనుంచి తాఖీదు వచ్చింది. ఆయన తన కుమార్తెను హిందువుడి కిచ్చి పెళ్ళి చేస్తూ, తానే స్వయంగా పెళ్ళి చేస్తున్నాడు గనుక ఆయనను సమాజంనుంచి బహిష్కరించవలసి ఉంటుంది. ఆయన సంజాయిషీ ఇచ్చుకోదలిస్తే ఫలాని గడువులోపల ఇచ్చుకోవచ్చు.

పరేశబాబు వెంటనే సమాధానం రాశాడు. "లలిత వివాహం నేను స్వయంగా చెయ్యక తప్పదు. అందుకు మీరు నన్ను బహిష్కరిస్తే అది మీ తప్పని నేను భావించను."

* * * *

ఒకనాడు సుచరితను చూడవచ్చి ఆనందమయి, "అమ్మా! వినయుడి పెళ్ళికి ఈ దగ్గరలోనే ఇల్లొకటి మాట్లాడాను. నువుకూడా వచ్చి పెళ్ళిప్రయత్నాలలో సహాయం చేస్తావా?" అన్నది.

సుచరిత ఆశ్చర్యంతో, "మీ రీ పెళ్ళికి వస్తారా? అందరూ మిమ్మల్ని ఆడిపోయ్యరూ?" అని అడిగింది.

"ఆడిపోస్తారు. తలవంచుకుని సహిస్తే సరిపోయే. నేను పెళ్ళికి రాకుండా ఎలా జరుగుతుంది. అయితే నేను వినయుడి పక్షాన రాను; పెళ్ళికూతురి పక్షాన పెళ్ళిలో పాల్గొంటాను. లలిత పెళ్ళి నా యింట జరుగుతుంది," అన్నది ఆనందమయి.

హరిమోహినికి మటుకు సుచరిత ఈ పెళ్ళికి రావటాని కెంతమాత్రమూ ఒప్పలేదు. "మీ గోరా మాటలు తల కెక్కి, అది తాను హిందువునని కేకలు పెడుతున్నది. హిందువు కావటం మాటలా? ఇంత ఈడొచ్చి పెళ్ళి కాలేదేమని నలుగురూ అడగరూ? ఎంతో జాగ్రత్తగా ఉంచే, దాని భవిష్యత్తు ఒక ఒడ్డున పడేటట్టు చేస్తాను," అన్నది

ఆనందమయి హరిమోహిని వైఖరికి దిగ్భ్రమ చెంది, కలవు పుచ్చుకున్నది. కాని మర్నాడు సుచరిత పెళ్ళి జరిగే ఇంటికి రానేవచ్చింది. లక్ష్మి సహాయంతో ఆనందమయి పెళ్ళి ఇల్లంతా కడిగించింది. పెళ్ళి ఖర్చులకుగాను పరేశబాబు సుచరితచేతికి డబ్బిచ్చారు. తరవాత లలిత తన పుట్టింటినుంచి పరేశబాబువెంట ఏకంగా పెళ్ళింటికి వచ్చేసింది.

## 9

ఇంత కాలం నిలవక గోరా రోజూ గ్రామాలమీద సంచారం వెళ్ళివస్తున్నాడు. గ్రామప్రజలలో ఆచారాల కట్టుబాటు చాలా జాస్తి. ఆ ఆచారాలు గ్రామీణ జీవితాన్ని ఎలా అధోగతికి ఈడ్చుకుపోతున్నదీ అతను స్వయంగా చూశాడు. ఆచారాలు ప్రజలలో ఐకమత్యం పెంపొందించటం లేదు; వారి హితాన్ని బలపరచటం లేదు; పైపెచ్చు అవి వారిలో దయాదాక్షిణ్యాలు కూడా లేకుండా చేశాయి. ఎవరన్నా చితికిపోతుంటే అంతా చూస్తూ ఊరుకుంటాయి. ఎంత దారిద్ర్యంలో కూడా విధ్యుక్తకర్మలకు విఘాతం కలగరాదు. ఆచారం గ్రామీణులను బలి పుచ్చుకుంటున్నది! ఇవి చూసి గోరా కళ్ళు తెరుచుకున్నాయి. ఈ అవలక్షణాలు అతనికి హిందువులలో కనిపించినట్టుగా ముస్లిములలో కనబడలేదు; వారిలో ఐకమత్యం ఉన్నది.

సోమవారం, రాత్రికి తన పెళ్ళి అనగా, వినయుడు తెల్లవారకుండానే వచ్చి గోరాను తన పెళ్ళికి ఆహ్వానించాడు.

"నేను పెళ్ళికి రాలేను. అయితే నేం? నువు అమ్మను లాక్కువెళ్ళావుగద: నీదే విజయం," అన్నాడు గోరా

స్నేహితు లిద్దరూ కలిసి చాలా సేపు మాట్లాడుకున్నారు. వినయుడు తన మనసు విప్పి గోరాకు చెప్పేశాడు. ప్రేమ అతన్ని పూర్తిగా మార్చేసి, అతని హృదయాన్ని అనిర్వచనీయానందంతో నింపేసింది. "ప్రేమ మన ఆత్మను మేల్కొలుపుతుంది. అంతదాకా మనహృదయాల్లో ఎంతచైతన్యం దాగఉన్నదో మనకు తెలీదు అందుకే జీవితం నీరసంగా ఉంటుంది." అన్నాడు వినయుడు.

వినయుడు వెళ్ళాక గోరాకు ఆరోజు గ్రామసంచారం వెళ్ళబుద్ధికాలేదు. వినయుడి మాటలతో చైతన్యం పొందిన కారణంగా అతనికి సుచరితను చూడబోవాలనిపించింది. అతను సుచరిత ఇంటికి వెళ్ళి తలుపు తట్టేసరికి నౌకరొకడు తలుపు తెరిచి, "చిన్నమ్మగా రింటోలేరు. లలితమ్మగారి పెళ్ళి ప్రయత్నాలు చూడబోయారు. రెండు రోజు లవుతుంది," అని చెప్పాడు.

ఆ తరవాత ఎవరో కొత్తమనిషి హుక్కా తాగుతూ వచ్చి గోరాను లోపలికి ఆహ్వానించి, కాస్సేపు మాట్లాడి పంపేశాడు. గోరా ఈ మనిషిని ఎరగడు. ఇతను హరిమోహిని ఆఖడుపురిది, కైలాసుడు. ఇతనికి ముప్పైఅయిదేళ్ళు. భార్య పోయింది. అతనికి సుచరితనిచ్చి పెళ్ళిచెయ్యటానికి హరిమోహినిచేసినప్రయత్నాల

ఫలితంగా ఇతను కలకత్తా చేరాడు. కాని అప్పటికే సుచరిత లలిత పెళ్ళిపనులమీద వెళ్ళిపోయింది.

పెళ్ళి అయిపోగానే సుచరిత తిరిగి వస్తుందని హరిమోహిని అనుకున్నది. కాని పెళ్ళి అయాక సుచరితా, తానూ లలితవెంట కొన్నిరోజులు ఉండదలచినట్టు ఆనందమయి హరిమోహినికి చీటీ పంపింది. వెంటనే హరిమోహిని పల్లకీ మాట్లాడి సుచరితను తీసుకుపోవటానికి వచ్చింది.

సుచరిత హరిమోహినివెంట బయలుదేరుతూ ఆనందమయితోనూ, లలితతోనూ తాను మధ్యాహ్నానికల్లా తిరిగివస్తానని చెప్పింది. ఆమె తన యింటికి చేరుతూనే, నౌకరుచేత ఒంటికి నూనె మర్దన చేయించుకుంటున్న కైలాసుణ్ణి చూసింది. కాని అతను తనకు నిర్ణయించబడిన భర్త అని గ్రహించలేదు.

ఆసంగతి హరిమోహిని బయటపెట్టి, ''అలాంటిమొగుడు దొరకటం నీ అదృష్టమనుకో,'' అన్నది.

"నేను చచ్చినా పెళ్ళి చేసుకోను," అనేసింది సుచరిత...

అవినాశుడు గోరా ప్రాయశ్చిత్తకర్మగురించి చాలా పెద్ద హడావుడి చేసి, పత్రికలలో వ్యాసాలు రాసి, ఆహ్వానాలు పంపాడు. దేశం మూలమూలలనుంచీ ఉత్తరాలు రాసాగాయి. కృష్ణదయాళుడి మిత్రులు వచ్చి, ''నీ కొడుకు నీఅంతవాడనిపించాడు,'' అని అభినందించసాగారు.

కృష్ణదయాళుడు కంగారుపడి గోరాకోసం బయలుదేరాడు. గోరా పూజామందిరంలో పూజ చేస్తున్నట్టు తెలిసింది. కృష్ణదయాళుడు పూజామందిరానికి వెళ్ళి, వాకిలి అవతలికి పిలిచి, తక్షణం బయటికి రమ్మని గోరాను పిలిచాడు. గోరా వచ్చి ఏమిటని అడిగాడు.

''పూజామందిరంలో కెందుకు వెళ్ళావ్? నీ కక్కడేం పని?'' అన్నాడు కృష్ణదయాళుడు చిరాకుగా.

''దేవుడి పూజ చేస్తున్నాను.''

"నువ్వు పూజ చెయ్యగూడదు. అదంతా పూజారి చూసుకుంటాడు. ఇదో సంగతి. నువ్వు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నావుటగా. వద్దని చెబితినే?'' అన్నాడు కృష్ణదయాళుడు.

''వద్దన్నారు గాని కారణం చెప్పలేదు.''

''కారణాలతో నీ కేం పని? పెద్దవాళ్ళం వద్దంటే వినాలి."

దహనం చెయ్యబోతున్నాడు. ఆటుతరవాత తాను సన్యాసే. ఈలోపల ఈ అవకాశం తీసుకుని సుచరితను ఆఖరుసారి చూసి, మనసారా ఆనందం పొందితే తప్పేం ?

అతని కింకొక ఆలోచన వచ్చింది. తన తండ్రి తన ప్రాయశ్చిత్తానికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాడు. దానికి తప్పక కారణం ఉంటుంది. ఆ కారణం ఏమిటో ? తెలుసుకుంటే అదే తన సమస్యకు విమోచన మార్గం కావచ్చు. హరిమోహినిని ఒక్క క్షణం ఉండమని, గోరా, కృష్ణదయాళుడి గదికి వెళ్ళాడు. గది తలుపు గడియపెట్టిఉన్నది. ఆయన లోపల ఏదో యోగాభ్యాసంలో ఉన్నాడు; తలుపు తెరవడు.

అతను నిరాశ చెంది తిరిగి రాగానే హరిమోహిని, "ఒక్కసారి మా ఇంటికి రా, బాబూ!" అని బతిమాలింది.

"నేను రాను. నా కేమిటి సంబంధం ?" అన్నాడు గోరా.

"పోనీ కైలాసును చేసుకోమని ఒక్క ముక్క రాయి."

"నే నాయ న్నెరగను. ఎలా రాసేది ?"

ఆమె బాధ పడలేక చివరకు గోరా కాగితం తీసుకుని దానిమీద ఇలా రాశాడు: "స్త్రీలకు అందరి క్షేమమూ సాధించటమే సార్థక్యం. ప్రపంచంలో కష్టా లుండవచ్చు; సుఖా లుండవచ్చు-శీలమూ పవిత్రతా గల స్త్రీ అన్నిటినీ స్వీకరించి, తన మతాన్ని తన ఇంట ప్రతిష్ఠించటం తన ధర్మంగా భావిస్తుంది."

హరిమోహిని మర్నాడు ఉదయం సుచరితకు ఆ చీటీ చూపి, "మీ గురువుగారు నీ కిది ఇచ్చాడు." అన్నది. అందులో సుచరితకు తెలియని దేమీ లేదు; కాని గోరా తన కా చీటీని ఇవ్వ డెందుకు పంపాలి. తన పెద్దమ్మ ద్వారా ఎందుకు పంపా లన్నది ఆమెను బాధించింది. ఆమె మౌనంగా ఉండటం చూసి హరిమోహిని, "ఆ చీటీలో రాసినది సరిగానే ఉన్నదా ?...అయితే ఇంక జాప్యం దేనికి?" అన్నది.

"జాప్యం చెయ్యను. నాన్నగారిని ఒక్కసారి చూసిరావాలి," అన్నది సుచరిత.

ఆమె వెళ్ళేసరికి పరేశబాబు పెట్టె సర్దుకుంటున్నాడు.

"రేపు ఉదయం మెయిలుకు సిమ్లా వెళుతున్నానమ్మా ?" అన్నా డాయన. ఆయనకు ఇంట్లో శాంతిలేకుండా పోయింది.

"నన్నుకూడా తీసుకువెళ్ళు, నాన్నా!" అన్నది సుచరిత, ఆయన పెట్టెను తానే సరిగా సర్దుతూ...

హరిమోహిని చేతికి చీటీ ఇచ్చాడే గాని దానిపైన అతని హృదయం సంతకం చెయ్యలేదు. అందుచేత గోరా ఆ రాత్రి గంగాతీరానికి వెళ్ళక తెల్లవార్లూ గంటలు

లేక్కించాడు. మర్నాడు ఉదయం అతను ప్రాయశ్చిత్తస్థలం చేరేసరికి అక్కడ వాలాగుంది పండితులూ, శాస్త్రజ్ఞులూ చేరి, గోరాకు గల మతాభిమానాన్ని తెగ పొగడారు.

గోరా గంగాస్నానం చేసి బట్టలు కట్టుకుని ప్రాయశ్చిత్తవిధికి సిద్ధమవు తూండగా అవినాశుడు వచ్చి, "కృష్ణదయాళబాబుకు జబ్బుగా ఉంది," అని చెప్పాడు.

గోరా కట్టుబట్టలతోనే ఇంటికి వెళ్ళాడు. కృష్ణదయాళుడు జబ్బుగా పడుకుని ఉన్నాడు. ఆనందమయి ఆయన కాళ్ళు వత్తుతున్నది. ఎలా ఉంది అని గోరా అడిగితే, "ఇప్పుడు కాస్త నయమే. డాక్టరుకోసం కబురు వెళ్ళింది," అన్నది.

రోగి మంచంపక్కనే కుర్చీ వేసి ఉన్నది. అందులో కూర్చోమని కృష్ణ దయాళుడు సైగ చేశాడు. గోరా కూర్చున్నాడు. కృష్ణదయాళుడు మిగిలినవా ళ్ళందరినీ బయటికి వెళ్ళమని, ఆనందమయి కేసి ఒకసారి చూసి, గోరాతో, "నా కాలం దగ్గరపడింది. నీకు తెలియకుండా ఒక విషయం దాచాను. నీకు చెప్ప నవసరం లేకుండానే జరిగిపోతుం దనుకున్నాను; కాని జరగదు. నేను పోతే ఉత్తరక్రియలలో నీకు వంతెలా ఉంటుంది?" అన్నాడు బలహీనంగా.

గోరా తల్లి కేసి తిరిగి, "నే నాయనకు ఉత్తరక్రియలు చెయ్యగూడదా? ఏమి టమ్మా ఇదీ?" అన్నాడు.

"చెయ్యగూడదు నాయనా," అన్నది ఆనందమయి.

"అయితే నే నాయన కొడుకును కానా?" అన్నాడు గోరా ఆశ్చర్యంతో దిమ్మరపోయి.

"కావు."

ఈసారి ప్రశ్న గోరా హృదయంలోనుంచి బద్దలయివచ్చింది; "అయితే నువు నా అసలమ్మవు కావా, అమ్మా?"

"నాయనా, గోరా! నువేరా నా అసలు కొడుకువు. నేను గొడ్రాలిని. కాని నా కడుపున కన్నకొడుకుకన్నా ఎక్కువైనవాడివి," అన్నది ఆనందమయి.

"అయితే నేను మీ కెక్కడ దొరికాను?"

"తిరుగుబాటు సమయంలో మేం ఇటావాలో ఉండగా, ఒకరాత్రి నీతల్లి మాఇంట దాక్కున్నది. ఆమెభర్త కిందటిరోజే పోయాడు. అతని పేరు___" కృష్ణదయాళుడు అన్నాడు.

"ఆయనపేరు నా కనవసరం," అన్నాడు గోరా.



"అతను ఐరిషువాడు. ఆ రాత్రే నీ తల్లి నిన్ను ప్రసవించి చనిపోయింది. అప్పటినుంచీ ఈ ఇంటనే పెరిగావు."

గోరాకు ఒక్క క్షణంలో గతమంతా కలలాగా అయింది. అతని జీవితపు పునాదులు కూలిపోయాయి. అతనికి తల్లిలేదు, తండ్రిలేదు, జాతిలేదు, దేశంలేదు, వంశంలేదు, దేవుడులేదు. అతని కిప్పు డెలాటి ఆధారమూలేదు. అంతా సూన్యం.

ఒక ఇంగ్లీషుడాక్టరూ, బెంగాలీవైద్యుడూ వచ్చారు. ఆదివరకు ఇంగ్లీషువాడు కనిపిస్తేనే రోతపడే గోరా, ఈ ఇంగ్లీషు డాక్టరును చూసి, 'అందరికన్న నాకు సన్నిహితు డితనా?' అనుకున్నాడు.

డాక్టరు రోగిని పరీక్షించి ప్రమాద మేమీ లేదన్నాడు. ఆయన వెళ్ళిపోయాక గోరా ఆనందమయిని, "ఇదంతా నాకు ముందే ఎందుకు చెప్పలేదమ్మా?'' అని అడిగాడు.

''నిన్ను పోగొట్టుకుంటానన్న భయంచేత, నాయనా!'' అన్నది ఆనందమయి.

గోరా తల్లితో పరేశబాబు ఇంటికి వెళ్ళివస్తానని చెప్పి బయలుదేరాడు.

గోరా వచ్చేసరికి సుచరిత ఇంకా పెట్టె సర్దటం పూర్తికాలేదు. అత నింకా ప్రాయశ్చిత్తానికి ధరించిన పట్టుబట్టలతోనే ఉన్నాడు. అతన్ని చూడగానే సుచరి



తకు తాను మొట్టమొదట అతన్ని చూసిన అవతారం గుర్తుకొచ్చి, కొంచెం భయం కలిగింది.

గోరా లోపలికి వస్తూనే పరేశబాబు కాళ్ళవద్ద మోకరించి, తల నేలకు తగిలే టట్టు వందనం చేశాడు. పరేశబాబు కంగారుగా అతన్ని లేవనెత్తి, "కూర్చో నాయనా, కూర్చో." అన్నాడు.

"పరేశబాబూః నా కిప్పు డెలాటి బంధాలూ లేవు." అన్నాడు గోరా.

"బంధా లేమిటి," అని పరేశబాబు అడిగాడు.

"నే నిప్పుడు హిందువును గాను. నా తల్లిదండ్రులు ఐరిషువాళ్ళనీ, నేను సిపాయీల తిరుగుబాటు సమయంలో దొరికాననీ ఇంతకుముందే తెలిసింది. ఈ భారతదేశంలో నేను ప్రవేశించదగిన ఆలయం లేదు. హిందువుల విందులలో నేను పాల్గొనరాదు...పరేశబాబూః భారతదేశాన్ని నా జీవితంతో సాక్షాత్కరింపజేసు కుందామని విశ్వప్రయత్నంచేసి, అడుగడుగునా ఎదురుదెబ్బలు తిన్నాను. ఆ ఎదురు దెబ్బలను ఆరాధించాను. అంత తప్ప నే నిం కేపనీ చెయ్యలేకపోయాను. ఇండియా వాస్తవరూపం ప్రత్యక్షమైనప్పుడల్లా వెన్ను చూపి, నా విశ్వాసాలను దక్కించుకునే టందుకు బ్రహ్మప్రయత్నం చేశాను. ఇవాళ ఒక్క క్షణంలో నా కలలన్నీ మాయమై, నే నొక మహత్తర సత్యంమధ్య స్వేచ్ఛగా నిలబడ్డాను. ఇప్పుడు నాకు వాస్తవదేశంకోసం నిజంగా శ్రమించే అధికారం వచ్చింది."

"మనకు నిజం లభ్యమయాక దానికి కృత్రిమపు తొడుగులు తొడగకుండానే ఆనందం పొందగలం," అన్నాడు పరేశబాబు.

"ఇవాళ నాకు స్వేచ్ఛ లభించగానే ముందు మీదగ్గిరికి ఎందుకు వచ్చానో తెలుసా? స్వేచ్ఛామంత్రం మీకు తెలుసు; అందుకే ఇవాళ మీకు ఏ సమాజం. లోనూ స్థానంలేదు. నన్ను మీ శిష్యుడుగా చేసుకోండి. హిందువులకూ, ముసల్మానులకూ, క్రైస్తవులకూ, బ్రహ్మసామాజికులకూ ఈశ్వరుడైనవాడి మంత్రం నాకు ఉపదేశించండి. ఆ ఈశ్వరుడే భారతదేశం!'' అన్నాడు గోరా.

తరవాత అతను సుచరిత చెయ్యి పట్టుకుని, ఆమెతో సహా పరేశబాబుకు ప్రణామం చేశాడు...

ఆ సాయంకాలం గోరా ఇంటికి వెళ్ళి ఆనందమయితో, ''అమ్మా, నీ లక్ష్మిని కాసివి మంచినీళ్ళు తెమ్మను," అన్నాడు.

వినయుడికి కబురు చేస్తున్నాను, నాయనా!" అన్నది ఆనందమయి రహస్యంగా గోరాతో.

